భారతి

మాసపత్రిక

★

శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు
(1938-1972)

★

ఏప్రిల్ 1974

సంపుటము : 51 : సంచిక : 4 :

విడిపత్రిక వెల రూపాయిన్నర



19–4–74 చైత్ర బహుళ ద్వాదశి శుక్రవారం

కళాప్రపూర్ణ, దేశోద్ధారక, శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారి

106–వ జయంత్యుత్సవము

ప్రవిమల జీవిత ప్రసృమర ప్రథితాకృతు లాత్తధర్మసా
ర వివశచిత్తు లార్యగుణరంజన మంజుల నాన వీరులన్
తనఁబడు నిన్ను బోలు మహితాత్మకు లెచ్చట; నీ వొకండవున్
ఆవగుణసత్త్వమౌ తెలుగునాట వెలింగితి సత్యమూర్తివై !

విషయానుక్రమణిక

ఏప్రిల్ 1974

యుగసంధి

శ్రీ గడియారం శేషఫణిశర్మ

నిన్నటిదాకా
వీరంతా
కర్కోటక విషజ్వాలలకు
ఆహుతులైన కురూపులు,

వంచనకు
తలలు వంచిన
మెత్తని పులులు,
యాచకులు,
పాచకులు,
షండులు,
శిఖండులు,

దుస్సహ దుఃఖ సాగరాలను
పుడిసిలించి విడచిన
అగస్త్య భ్రాతలు

ఇప్పుడేమో
శాశ్వత జీవసమాధులు చీల్చుకుని
అగ్నిధారలతో
అవభృత స్నానాలు చేస్తున్న
అవధూతలు,
అనల దూతలు.

అభిచార సవన స్రుక్కాంతితో,
గుప్తసుప్తాస్థికలను
అభిమంత్రిస్తున్న
భైరవ కాపాలికులు,
నవయుగ వైతాళికులు.

బిగిసిన పిడికిళ్లతో,
ఎగసిన కొడవళ్లతో,
ఎగిరిపడుతున్న

చైతన్య తరంగాలు,
పగపట్టిన
తాక్షక భుజంగాలు.

నిన్నటి
ఈ భీరువులు
ఇప్పుడు
చలన్మేరువులు,
నిన్నటి
ఈగరికలు
ఇప్పుడు
తళచ్ఛురికలు,

నిన్నటి
ఈ బడుగులు
ఇప్పుడు
చిచ్చుఱ పిడుగులు,
నిన్నటి
ఈ రిక్తులు
ఇప్పుడు
అక్షుద్ర శక్తులు.

ఇది యుగసంధి,
అంతరిస్తున్న తమస్సుకూ,
అవతరిస్తున్న రక్తోషస్సుకూ
మధ్య ఒక అరుణ సంధ్య!
మహానల ఝంఝ!!

ఈ రక్త సరిత్తుల నుండి,
ఈ మహాగ్నిక్రతువుల నుండి,
మానవతా వాదంగా
మహా ఘంటా నాదంగా
ఆవిర్భవిస్తుంది,
అస్తమయంలేని
ఒకానొక అభ్యుదయ మహాయుగం!!

నాగార్జునకొండ తవ్వకాలలో దొరికిన నాణెం అచ్చు - ముక్క

శాతవాహనుల వెండినాణాలకి సంబంధించిన కొత్త సమాచారం

శ్రీ ఐ. కార్తికేయ శర్మ

(ఆర్కియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, హైదరాబాదు)

ఈ మధ్య నేను శాతవాహనుల నాణాలని పరిశీలిస్తూ ఉండగా కాల్చిన మట్టి అచ్చు—ముక్క ఒకటి దొరికింది.[1] ఇది నాగార్జున కొండలోని బాగా ప్రాచీన స్తరాలలో లభించిన శాతవాహనావశేషాలతో ఒకటి. వాశిష్ఠీపుత్రపుళుమావి చిత్రంకల నాణానికి కావలసిన రూపాకృతుల ప్రతిబింబం దీని మీద **ఉంది.**

భౌతిక స్వరూప వర్ణన

చక్రాకారంకల ఈ మట్టిముక్క[2] వ్యక్తి చిత్రం కలం నాణెం 'బొరుసు' వైపుకి కావలసిన రూపాకృతిని తయారుచేసే అచ్చు కలిగి ఉంది. దీని వ్యాసం 2.5 సెం. మీ. నాణెం పోతకి పనికివచ్చే భాగం వ్యాసం 1.5 సెం. మీ., ఈ భాగం తక్కిన భాగాల కన్నా కొంచెం ఎక్కువ లోతు కలిగి ఉంది. వాశిష్ఠీపుత్ర పుళుమావి ఇతర నాణాల పరిమాణాలు దీనికి సరిపోతున్నాయి. అచ్చులోకి కరగబోసిన లోహం ప్రవేశించేందుకు కావలసిన 'కాలువ' ఒకటి ఉంది. అచ్చు వెనుకభాగం చదునుగానే ఉంది. కొంచెం గరుకుగా ఉంది.


ఈ అచ్చులో ఈ అంశాలు కనిపిస్తాయి—ఒక వేదిక మీద ఆరు తోరణాలుకల చైత్యం (ఇది మధ్య భాగంలో ఉంది), దీనిమీద ఒక అర్ధ చంద్రాకారం కింది భాగంలో ఒక వంకుల గీత; ఎడమపక్కగా ఒక 'ఉజ్జయిని గుర్తు', ఈ గుర్తువయి 'బాహువు'కి ఒక అర్ధ చంద్రాకారం; రెండు అర్ధ చంద్రాకారాల మధ్యా కిరణాలు కల సూర్యబింబం; అంచు చుట్టూ ఈ కింది అక్షరాలు—

'అరహ(ణకు వాహిట్‌టిమా) కణకు తిరుపుళుమావికు'

మొత్తం ఇరవయి అక్షరాలు ఉండి ఉండాలి కాని (4) నుంచి (10) దాకా (అక్షరాలు) ముద్రలు పడకముందు బిళ్ళకి చెందనివి, తెలిసిన ఇతర ఉదాహరణలనుంచి పునర్నిర్మించబడినవి. రూపాకృతి అంతటికీ చుట్టూ పూసల అంచు ఉంది. శాసనం శాతవాహన—బ్రాహ్మి లిపిలో ఉంది, భాష ప్రాచీనమయిన తెలుగు.

ఇతర ఉపలబ్ధ విశేషాలు

గౌతమీపుత్ర యజ్ఞశాతకర్ణి బొమ్మలు కల వెండి నాణాలు సొపారా,[3] బేస్నగర్‌లలో[4] దొరికాయి. ఇవి తప్ప దొరికిన ఇతర శాతవాహనుల నాణాలు కొందరు వ్యక్తులు సేకరించినవి. ప్రస్తుతం ఉదహరించినది అసంపూర్ణమయినదే కాని, తవ్వకాలలో దొరి



శాతవాహనుల వెండినాణాలమీద బొమ్మలు.
(పి. ఆర్. కె. ప్రసాద్ సౌజన్యంతో)

కిన వాటిలో మొదటిదని నిస్సందేహంగా చెప్పవచ్చు. దీనితోబాటు లభించిన ఇతర విశేషాలనిబట్టి దీని ప్రాముఖ్యతని అర్థం చేసుకొనవచ్చు.

1954–60 కాలంలో శ్రీ ఆర్. సుబ్రహ్మణ్యం పెద్దపెట్టున జరిపిన తవ్వకాలు శాతవాహనుల నాణాలు, శాసనాలకి సంబంధించిన యెంతో సమాచారాన్ని బయటపెట్టగలిగాయి.[4]అ ఇక్ష్వాకుల పూర్వకాలానికి చెందిన అవశేషాలు నగరం ప్రాంతంలోను, కోట బురుజులకింద దొరికాయి. వీటిలో శాతవాహనులకి మాత్రమే సంబంధించిన నాణాల నిధులు రెండు దొరికాయి. ఇవికాక పుళుమావి (I), శాతకర్ణి (IV). యజ్ఞశ్రీల నాణాలు కొన్ని ఇక్కడా అక్కడా దొరికాయి. ఇవన్నీ ఒకే రకంవి — గుండ్రంగా ఉజ్జయిని × ఏనుగు గుర్తుకలిగి ఉంటాయి. అన్నీ ఒకే పరిమాణం, బరువు కలవి. అన్నిటికన్నా పాతవి పుళుమావి (II)వి, అతని సోదరుడు శ్రీ శాతకర్ణి (IV)వి. నాగార్జునకొండలో గౌతమీపుత్ర శాతకర్ణి నాణెం లేదు.[5] దీనినిబట్టి నాగార్జునకొండ పుళుమావి కాలంనుంచి విజయశాతకర్ణిదాకా వరుసగా నాలుగు తరాల శాతవాహన పాలకులకింద ఉందని ఊహించవచ్చు—ఈ స్థలంలో విజయశాతకర్ణి దినుసు నాణెం మాత్రం లేదు. ఈ రకం నాణెం శాతవాహనుల వారసులయిన ఇక్ష్వాకులచేత జాగ్రత్తగా కొనసాగింపబడింది. ప్రాచీన భారతీయ నాణాలు బాగా ప్రాంతీయ లక్షణాలు కలిగి ఉంటాయని రుజువు అవుతోంది.


విజయశాతకర్ణి పరిపాలనలో (ఆరవ ఏడు) వేయించిన శాసనం ఒకటి తరువాతి శాతవాహనుల కాలంలో ఇక్ష్వాకుల రాజధాని అయిన 'శ్రీపర్వత విజయపురి'నుంచి ప్రాముఖ్యతకల నగరం అని స్పష్టంగా తెలుపుతుంది. ఇది ప్రాముఖ్యత కల నగరమ్మేకాని ఆ పేరుకల రాజధాని నగరం[6] కాకపోవచ్చు. పుళుమావి తండ్రి ధరణికోటకింద తూర్పు రాజ్యాలని సంపాదించుకున్నాడు. సుప్రసిద్ధుడయిన ఇతని కొడుకు ఈ రాజ్యాలమీద తన అధికారాన్ని గట్టి చేసుకున్నాడని పిస్తుంది. అతను 'ధనకటకస్వామి' అనే పేరుని కూడా సంపాదించుకుని రాజకుమారుడుగా ఈ ప్రాంతాలని ఏలి ఉండవచ్చు. ఈ బిరుదు నాసిక్ శాసనంలో కనిపిస్తుంది.[7]

సామ్యాలు

ఎన్. ఆర్. అద్వానీ బీరువాలోనిది, త్రివేదీ ప్రచురణ[8] ద్వారా తెలిసినది పుళుమావి (II) బొమ్మ కల వెండినాణెం ఒకటే ఒకటి ఉంది. ఇది సందేహం లేకుండా పుళుమావిదే. 1949 లో భిల్సావద్ద దొరికిందిట. దీనికి రెండు వైపులా అక్షరాలు చదువటానికి వీలుగా లేవు. రాజు బొమ్మమాత్రం స్పష్టంగా ఉంది. భిల్సాలో దొరికిన దీనిని నాగార్జునకొండ నాణెం పక్కనే పెట్టిచూస్తే ఈ రాజు నాణాలు ఒక ప్రత్యేకమయిన రకానికి చెందినవని తెలియగలవు.

శాతవాహనులు సామ్రాజ్యంలోని వారి స్వంత రాష్ట్రంలోను, ఉత్తర రాష్ట్రంలోను వాడకంకోసమే ఈ వెండినాణాలని వేయించారని సాధారణంగా నమ్మబడుతోంది. ఇవి ఒకప్పటి క్షాత్రపరాజుల ఆధీనంతో ఉన్న ప్రాంతాలతో సమానమయినవి. కాని, పయిన

నాగార్జునకొండ తవ్వకాలలో దొరికిన నాణెం అచ్చు-ముక్క



ముఖ్యమయిన శాతవాహన నగరాలు, వెండినాణాలు దొరికిన చోట్లు.

చెప్పిన నాణెం తీరాంధ్రప్రదేశంలో తయారయినదని (ఇక్కడ వాడకంకోసం కాకపోయినా) రుజువు అవుతోంది; తక్కిన శాతవాహనుల నాణాలవలె ఉత్తరాదికే పరిమితం అయినది కాదు. దీనిని ఆంధ్రలో తయారు చెయ్యటానికి కారణం ఏమిటో వెనుకవైపున కనిపించే తెలుగు శాసనమే సూచిస్తుంది. అసలు గౌతమీపుత్ర శాతకర్ణి వెండినాణెంమీది శాసనం తెలుగుదేనా ? అన్న ప్రశ్న ఉదయించక మానదు. తెలుగుదే అయితే, తెలుగు మాట్లాడేవారి ప్రాంతాలలోని టంకశాలలలోనే ఇది తయారయిందా? మనకి లభ్యమయిన గౌతమీపుత్రుడి నాణెం ఒక్కటే దక్షిణకోసలలోని బలాపూర్‌కి[9] చెందినది కనుక, ఇదికూడా శిథిలావస్థలో ఉంది కనుక ఈ ప్రశ్నకి సరయిన సమాధానాలు ఇవ్వలేము. ఈ రాజుకి చెందిన నాణాలు కొన్ని ఇంకా దొరికితే, అవిమంచి స్వరూపాలు కలిగిఉంటే సమస్య పరిష్కారం వీలు అవుతుంది.

శాతవాహనుల నాణాలకి సంబంధించిన కొత్త సమాచారం

హైదరాబాదుకి చెందిన దిన్‌కర్‌రావు వాశిష్ఠీపుత్ర శాతకర్ణి (IV) నాణెం ఒకటి సంపాదించారు. ప్రొఫెసరు డి. సి. సర్కారు[10] దీనిని పరిశీలిస్తున్నప్పుడు బొమ్మలు కల నాణాలమీద శాసనాలు ఎంత ముఖ్యమయినవో మొట్టమొదటిసారిగా తెలుప గలిగారు. శాసన భాష ప్రారంభదశలో ఉన్న తెలుగు అని అయన అనుకున్నారు. ఆర్. నాగస్వామి[11] ఒక వార్తాపత్రికా

వ్యాసంలో సర్కార్ పాఠానికి కొన్ని సవరణలు ప్రతిపాదించి నాణెం వెనుకవైపు ఉన్న శాసనం భాష ప్రారంభ దశలోఉన్న తమిళం అన్నారు.

ఈ మధ్య వెలువడిన రెండు పరిశోధనా వ్యాసాలు శాతవాహనుల వెండి నాణాల వెలువరింపులకి సంబంధించిన సమస్యలని పయికి తీసుకువచ్చాయి. వీటి వెనుకవైపుల శాసనాలని పి. ఆర్. కె. ప్రసాద్ చదువగలిగారు. ఈయన ప్రయత్నాలు ఫలించా యన వచ్చు. శాసనం భాష తమిళం కాదు — తెలుగు అని ఆయన సామర్థ్యంతో వాదించారు. శాతవాహనులకి సంబంధించిన విషయాలపట్ల ఆసక్తి కలవారంతా ఆయన వాదాలని గమనించాలి. నేను ప్రసాద్, సర్కార్‌ల అభిప్రాయాలని పూర్తిగా బలపరుస్తున్నాను. రెండు భాషలలో శాసనాలు కల ఈ వెలువరింపుల ప్రాచీన రచన, ప్రాముఖ్యత ఏమిటో పండితుల దృష్టిలోకి తీసుకురావటానికి ప్రయత్నిస్తాను.

వివరాలలోకి వెళ్ళటానికి ముందు అన్ని నాణాల మీది శాసనాలనీ నేను ఏవిధంగా చదివానో చెప్పటం అవసరం. పైన చెప్పినట్లు దొరికిన ఒక్క గౌతమీ పుత్రుడి నాణెం మీది శాసనమూ చదువటానికి వీలుగా లేదు; అందుచేత ఈ సమీక్షలో దానిని వదిలి వెయ్యటం జరుగుతుంది. రెండు వైపులా ఉండే శాసనాలలోని వస్తువు ఒకటేననీ, ఒకటి రెండవదాని తెలుగు అనువాదమేననీ గమనించాలి.

శాసనాలు

పుళుమావి (II):

ముందు: రాజ్ఞో వాశిఠీ — పుతస సిరి పుళుమావిస.

వెనుక: అఱహణకు వాహిత్తి మాకణకు చిఱుపు తు మావికు

'వాశిష్ఠీ పుత్రుడు, సుప్రసిద్ధుడూ అయిన పుళుమావిరాజు (నాణెం)'

శాతకర్ణి (IV)

ముందు: రాజ్ఞో వాశిష్ఠీ — పుతస సిరి శాతకణిస.

వెనుక: అఱహణకు వాహిత్తి మాకణకు చిఱు హాతకణికు.

'వాశిష్ఠీపుత్రుడు, సుప్రసిద్ధ రాజు శాతకర్ణి (నాణెం)'

యజ్ఞశాతకర్ణి

ముందు : రాజో గోతమీపుతస సిరియజ శాతకణిస.

వెనుక: అఱహణకు గోతమీపుతకుహిరి యజ హాత కణికు.

'గోతమీపుత్రుడు, సుప్రసిద్ధరాజు శాతకర్ణి (నాణెం)'

వెనుకవైపున ఉన్న అపూర్వమయిన శాసనమే మన పరిశీలనకి తగినది కనుక ఈ కింద దానిని గురించి కుణ్ణంగా చర్చ జరుపటానికి నిశ్చయించటం అయింది.

వెనుకవైపు శాసనా లన్నిటిలోనూ ఇరవయిమూడు మాత్రలు ఉంటాయి. మొదటి రెండు శాసనాలలోనూ ప్రాసయతులు రెండవ, పదిహేనవ అక్షరాల మధ్య ఉంటాయి. యజ్ఞశాతకర్ణి నాణెం శాసనంలో యతి ఒకటవ మాత్ర, పదహారవ (అంటే పద్నాలుగవ అక్షరం) మాత్రల మధ్య ఉంటుంది. ఈ నాణెంలోనే భాషకి సంబంధించిన ఒక విశేషాన్ని చూడవచ్చు. పాత తెలుగు మాట 'మాకణకు' బదులు 'పుతకు' వాడబడింది; ఇది మాత్రల సర్దుబాటుకోసం జరిగింది. ఎందుచేతనంటే రాజు పేరులో 'యజ్ఞ' అన్న రెండు మాత్రలు అదనంగా ఉన్నాయి. ఆ కాలానికి 'పుత' అనే మాట వాడుకలోకి వచ్చింది; ఇది సంస్కృత 'పుత్ర'నుంచి వచ్చినది. ప్రాకృతం, ప్రారంభదశలోని తెలుగుభాషల మీద సంస్కృతం ప్రభావం13 ఫలితమే ఇదంతా. 'కుమారుడు, పుతుడు, పుత్రుడు, తనయుడు' మొదలయిన పదాలు ప్రథమా విభక్తి తెలుగు ప్రత్యయం 'డు' కలుపగా వచ్చినవి. అంటే, తెలుగు సాహిత్య చరిత్రకి తెలిసిన తెలుగు వాక్యాలలో అతిప్రాచీనమయినవి ఈ నాణాల మీది శాసనాలలో14 కనిపిస్తున్నాయన్నమాట. 'రగడ' ఛందస్సు కల అతిప్రాచీన పాదం కూడా ఇదే. 'రగడ' మాత్రా

ఛందస్సు ప్రకారం నడిచే శుద్ధదేశి రకం. ఈ సందర్భంలో ఒక విషయాన్ని గమనించవచ్చు; సంస్కృతంలో ఛందోబద్ధమయిన శాసనాలు చేయించిన వారిలో మొదటివారు గుప్త సమ్రాట్టు[15] లయితే ప్రాంతీయభాషలో ఛందోబద్ధమయిన శాసనాలు వేయించిన మొట్టమొదటివారు శాతవాహన స్వామ్రాజ్యాధిపతులు.

ఇది ఎలాగ ఉన్నప్పటికీ, వెనుకవైపున ఉన్న శాసనం లిపి ప్రత్యేక గుణాలని కొన్నిటినిబట్టి నాగస్వామి, రామయ్యలు 'వెనుకవైపున లిపి తమిళనాడు గుహలలో తమిళభాషలో రాయటానికి వాడబడిన 'దమిళి' లిపి అనే నిర్ధారణకి వచ్చారు; 'భాష తమిళమేకాని తెలుగుకాదు' అనీ, 'ఒకటిమాత్రం నిస్సందేహంగా తెలుస్తోంది. ఈ నాణెంమీద క్రీ. శ. రెండవ శతాబ్దపు తమిళ శాసనం ఉందన్న సంగతి' అనీ కూడా వీరు అన్నారు. సర్కారు, ఆయనకన్నా సారవంతంగా ప్రసాద్ శాసనంయొక్క భాషకి సంబంధించిన విషయాలని గురించి చర్చించారు కనుక నేను ప్రాచీన రచనా విశేషాలని గురించి మాత్రం ఇక్కడ కొన్ని మాటలు చెప్తాను.

నాగస్వామి, రామయ్యలు ఈ విశేషాలని స్థూలంగా వర్ణించారు—[16]

1. 'మ' అక్షరం తమిళ-బ్రాహ్మి గుహ శాసనాలలో వలెనే 'U' ఆకారం కల మధ్య గీత కలిగి ఉంది.

2. 'హ' అక్షరాన్ని దమిళి 'చ'లాగా చదివితే 'అరచన్, వాచిట్టి, చాతకాణి' అనే మాటలు వస్తాయి.

3. 'కు' అక్షరాన్ని పై పదా లన్నిటిలోనూ 'ష' గా చదవటం జరిగింది.

4. 'కాచిట్టి'లోని చివరి అక్షరం 'ట' శుద్ధ హల్లు; దీనికి ఉన్న 'పుల్లి' (చుక్క) అరవ రచనా పద్ధతులలో మాత్రమే కనిపిస్తుంది.

'తన బొమ్మతోబాటు ద్విభాషా శాసనాలు కల నాణాలని చెయ్యటం మొదలుపెట్టినవాడు వాశిష్ఠీపుత్ర శాతకర్ణి' అని నాగస్వామి అభిప్రాయం. 'శాతవాహనరాజు బొమ్మ కల రకం నాణాలలో ఇదే మొదటిది,' అని కూడా ఆయన అన్నారు. తగిన సమాచారం తెలియకపోవటంచేతనే ఇటువంటి సిద్ధాంతాలు వెలువడుతున్నా యనిపిస్తుంది.

ప్రాచీన రచనా విశేషాలు

పైన చెప్పిన సంగతులని వరుసగా చర్చించే బదులు అక్షర స్వరూపాలకి సంబంధించిన కొన్ని విషయాలని స్థూలంగా గమనించవచ్చు. గౌతమీపుత్ర శాతకర్ణి కాలంనుంచి రాజుల నాణాలమీది శాసనాలు ఆ కాలపు శాతవాహన శాసనాల అక్షరాల స్వరూపాలతో పోలికలు కలిగిఉంటాయి. ఈ పోలికలు ప్రాంతం మీద ఆధారపడవు. 'తలకట్టు' ఆకారంలో ఒక ప్రత్యేకత కనిపిస్తుంది. మొదట్లో అది కొంచెం మందమయిన శిఖరభాగం; తరువాత గాటు కల తలకట్టు అయింది; అనంతరం దానికి వెడల్పయిన త్రిభుజాకారం వచ్చింది. చివరి రెండు ఆకారాలని తరువాతి శాతవాహన (గౌతమీపుత్రుడి కాలం అనంతరం) నాణాలమీద, ఇక్ష్వాకుల రచనల మీద చూడవచ్చు.[17] ప్రస్తుతం పరిశీలనకింద ఉన్న నాణాల అక్షరాలకి గాటుకల తలకట్టు ఉంటుంది.

1. 'మ': ఈ కాలంలో 'మ' కి రెండు స్వరూపాలు ఉండేవి. ఒకటి త్రికోణాకారం లేక వర్తులాకారం కలది. రెండవది ఇంగ్లీషులో 'యు' శబ్దం కల అక్షరానికి అడ్డగీత వేసినట్లు ఉండేది.



అడ్డగీత కల చివరి స్వరూపంలో మళ్లీ రెండు దినుసులు కనిపిస్తాయి. ఒకదాంట్లో అడ్డగీత లోపల మాత్రమే ఉంటుంది, రెండవదాంట్లో ఈ గీత బయటికి పొడుచుకుని వస్తుంది. వెండి నాణాలమీద మొదటిరకం ముందువైపు, రెండవరకం వెనుకవైపు కనిపిస్తాయి. రెండవది భట్టిప్రోలు అవశేషాల స్ఫటిక పాత్రమీద కనిపించే అక్షరాల రకం ప్రారంభదశలకి చెందినది.[18] అశోక బ్రాహ్మి లిపిలో కూడా కొన్ని మార్పులతో ఈ రకం అక్షరాలు కనిపిస్తాయి.[19] ఇది పాతరకంది.ఇది త్రికోణ, వర్తులాకారాలు కల 'మ'తో

టొటు పక్కపక్కనే గోచరిస్తూ ఉంటుంది. సిత్తన్న వాసల్ శాసనంలో[20] రెండురకాల అక్షరాలూ పక్క పక్కనే ఉండటం గమనార్హం. పడమరవైపు ఉండే భాజ,[31] సాంఛీ[32] గుహలలో రెండూ కనిపిస్తాయి.

2. 'హ': దినకర్‌రావ్, రామయ్యల నాణాల వెనుకవైపు శాసనాల అక్షరాన్ని అనుశీలిస్తే, సర్కార్ ఉదహరించి, పరిష్కరించినట్లు, అక్షరం స్వరూపం శాతవాహన, ఇక్ష్వాకుల అక్షరాల స్వరూపాన్నే ఎక్కువ పోలి ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తుంది. కేసనపల్లిలో దొరికిన చాంతమూల 1 శాసనం అక్షరాల విషయంలో ఈ పోలికలు ఇంకా బాగా కనిపిస్తాయి. ఇక్కడి అక్షరం కొంచెం కుదిమట్టంగా ఉంటుంది, ఎడమ వయిపు నిలువుగీత పొడుగు తక్కువగా ఉంటుంది, కుడి వైపుకి పోయే 'టిక్' (✓) గుర్తు వంకరగా ఉంటుంది, కిందిభాగం 'ఉచ్చు' కలిగి ఉంటుంది. కొన్ని శాతవాహనుల శాసనాలలోవలె అక్షరం కుడివైపుకి వాలి ఉంటుంది.[24]

నాగస్వామి 'కంటితో చూసి' ఇచ్చిన నకలు అసలుకి భిన్నంగా ఉంది. అంతేకాక, 'చ' అక్షరంలో ఎడమవైపు ఉచ్చు నిలువుగా ఎప్పుడూ మూసుకునే ఉంటుంది కాని తెరుచుకుని ఉండదు. మహాలింగం ఉదహరించిన[25] తమిళ ప్రాంతం శాసనాలన్నిటినీ పరిశీలిస్తే ఈ విషయం తెలుస్తుంది; శాసన కాలంతో నిమిత్తంలేదు. ఈ సందర్భంలో మరొక సంగతిని బాగా గుర్తించాలి. నాగస్వామి చదివినట్లు[26] 'హ'ని 'చ'గా చదివినా (తమిళంలో 'శివ' బదులు 'చివ'లాగ) నాణెం వెనుకవైపుఉన్న శాసనాన్ని ఈవిధంగా చదువటానికి వీలులేదు. ఎందుచేతనంటే—'హిరు'ని 'చిరు' అని చదువవలసివస్తుంది, ఈ విధంగా చదువటంలో అర్థంలేదు.

3. 'కు': పశ్చిమ భారతదేశ ప్రాంతంలోని గుహలలో 'శాతవాహనుల మొదటి శాసనాలు కొన్ని క్రీ. పూ. రెండవ శతాబ్దానికి చెందినవి;[27] వీటిలో 'కు' అక్షరానికి వంకు సాధారణంగా కుడివైపుకి ఉంటుంది. తీరాంధ్ర ప్రాంతంలోకూడా (అమరావతికి చెందిన శాసనాలలో మొదటివీ తరువాతివి) ఈ స్వరూపం తరుచు కనిపిస్తూ ఉంటుంది. పులుమావి నాసిక్ శాసనంలోనూ ఇటువంటి స్వరూపం ఉంది. నిలువుగీతకి కుడిగా ఒక అడ్డగీతని చూడవచ్చు. కేసనపల్లి,[28] అమరావతి నిలువు ఫలకంమీద ఇటువంటి కోణాకారం కల 'కు' స్పష్టంగా కనిపిస్తుంది. ఇవి రెండూ క్రీ. పూ. 2, 3 శతాబ్దాలకి చెందినవే. అశోక బ్రాహ్మీ లిపిలో[29] ఎన్నో ఉదాహరణలు. అయితే ఈ రకం అక్షరం మామండూర్,[30] సిత్తన్నవాసల్, అరికామేడులలో సయితం కనిపించటం గమనార్హం. తరువాతి శాతవాహన, ఇక్ష్వాకుల శాసనాలలో రెండు రకాల 'కు'ని చూడవచ్చు.[31] ఒకటి నిలువుగా కుడి వైపుకి వంగేది; రెండవది, నిలువుగీతకి కిందభాగంలో కుడిపక్కకిపోయే ఒక గీత. 'కు' దీర్ఘం రాయటానికి మరొకగీత వాడేవారు. ఒక శాసనంలో రెండు, మూడు రకాలు కనిపించటం విశేషం;[32] అంతేకాదు, ఒకే పంక్తిలో అన్నిరకాలూ కనిపిస్తూ ఉంటాయి.

4. 'పుళ్ళి': 'పుళ్ళి'పెట్టే అలవాటు క్రీ. శ. రెండవ శతాబ్దంలో ఉండేదనీ, మొదట్లో ఇది ప్రారంభదశలో ఉన్న తెలుగువంటి ద్రావిడ భాషలని రాయటానికి వాడబడేదని సర్కార్ అభిప్రాయం. నేను ఆయనతో ఏకీభవిస్తాను.[33] అది అక్షరాలకి వాడే కొన్ని ప్రత్యేక సాంకేతిక సంజ్ఞలలో ఒకటి అనవచ్చు; వరుస తప్పకుండా వాడబడేవి కావేమో కూడా. శుద్ధహల్లుని సూచించే అక్షరం ఒక చుక్క కలిగి ఉంటుందని తొల్కాప్పియమ్[34] అంటుంది. ఈ గ్రంథం ప్రకారం అనాటి బ్రాహ్మీ లిపిలో 'క్' ని '-|-'గా రాసిఉండాలి. కాని, బ్రాహ్మీలో ఇతర సందర్భాలలో దీనిని అనుస్వారం, కం(N)కోసం వాడేవారు.

ఈ రోజుల్లో చుక్కని శుద్ధహల్లుమీద పెడుతున్నారు. లోపల, పక్కన పెట్టటంలేదు. మహాలింగం[35] చెప్పినట్లు తరువాతి, తరువాతి శాసనాలలో ఇది లేకపోవటం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. పాత శాసనాలలో కూడా అరుదుగా కనిపిస్తుంది. 'అన్నిటి కన్నా ప్రాచీనమయిన తమిళ శాసనం'గా వర్ణింపబడిన అరాచ్చలూర్ శాసనంలో 'తిత్తన్' 'తత్తక్' 'వణ్ణక్ కోక్అక్' 'చత్తక్' మొదలయిన పదాలలో 'పంక్తి రెండవ ప్రారంభంలో ఒక చిన్నచుక్క ఉంటుం'దని మహాలింగం.[36] అయితే, ఇది చుక్కా, విరామాలలో ఏ ఒకటో తెలియదు. అరికామేడులో[37] చుక్క ఉన్నట్లు

ప్రచురింపబడిన ఉదాహరణలని బట్టి తెలియటం లేదు.

అంటే, 'తమిళ బ్రాహ్మీ' ప్రత్యేకతగా చెప్ప బడుతున్న 'పుల్లి' లేక చుక్క క్రీ. శ. రెండవ శతాబ్ది తరువాత అరుదుగా కనిపిస్తుంది. ఈ కాలంలో అది తరుచుగా పరిశీలకుల గమనంలోకి రాదు. అయితే అతి ప్రాచీనమయిన తమిళ వ్యాకరణం తొల్కాప్పియమ్ ఇది ఉండితీరాలని సూత్రంగా చెబుతుంది. ప్రారంభదశలో ఉన్న తెలుగు కూడా ద్రావిడ భాషా కుటుంబానికి చెందినదే కనుక వెండి నాణాలమీద ఈ గుర్తు వాడ బడి ఉండవచ్చు. అందుచేత, 'పుల్లి' గుర్తు ఉన్నంత మాత్రాన ఒక ప్రాచీన శాసనంయొక్క భాష గుణం ఏమిటో తెలుస్తున్నదనుకొనటం సరికాదు. ఆ గుర్తు వాడకం కేవలం ఒక రచనా పద్ధతిని సూచిస్తుంది. పాత తెలుగుకి ఉపయోగింపబడిన ఒక సాంప్రదాయ బద్ధమయిన రచనా పద్ధతికి ఇదొక అరుదయిన ఉదాహరణ అని కూడా అనవచ్చు. ఇంకా — ఇది ప్రాచీన శాసనాలలో కనిపించదు. నేటి తెలుగు రచనలో సరే సరి. అంటే, వాశిష్ఠీపుత్ర శాతకర్ణి, బహుశ పుళుమావుల తెగ నాణాలమీది రచనా పద్ధతిలో కనిపించే 'పుల్లి' లేక చుక్క అనంతర కాలాలలో కనిపించని ఒక విశేషం అని భావించవలసి ఉంటుంది— భట్టిప్రోలు రచనా పద్ధతికూడా ప్రత్యేకమయినదే.38

ఇంత చెప్పిన తరువాత ఇంకొక ప్రశ్నకి సమాధానం దొరకవలసి ఉంది—ఎందుకని నాణెం వెనుకవైపు శాసనంలో మాత్రమే 'మ, హ, కు' అక్షరాల అపురూప స్వరూపాలు ఒకసారికన్నా అధికంగా కనిపిస్తాయి? ఈ కాలానికే పాత తెలుగు శబ్దాలకి తగిన మార్పులతో బ్రాహ్మీ అక్షరాలు కొన్ని బ్రాహ్మీ లిపిలో ఉన్నాయని మనం అనుకోవాలా? అనుకోవాలని నా దృఢమయిన అభిప్రాయం. భట్టిప్రోలు స్ఫటిక (?) అవశేషాల పాత్ర, పేటికలమీది శాసనాలు నా అభిప్రాయాన్ని బలపరుస్తున్నాయి. అంతే కాక, రూపాకృతి అంశాలన్నీ ఒకే పరిమాణాలు కలిగి ఉంటాయి; 0.6 నుంచి 0.65 అంగుళాలు, వర్తులాకారాలు, బరువుల (అనుబంధం చూడ ప్రార్థన) ప్రమాణాలు—వీటిలోనే సమాధానం ఇమిడి ఉంది. ముందువైపుల మీది బొమ్మలు, ముందు—వెనుక వైపులమీది రాజుల పేరులు ఒక్కొక్క రాజు విషయంలోనూ మారినప్పటికీ అంశాలు మారవు. అయితే, వెనుకవైపు రూపాకృతులు—పై మూడు అక్షరాల ఆకారాలతో సహా—ఒకేవిధంగా ఉంటూ వచ్చాయి. దీనిని బట్టి ఒక సంగతి స్పష్టంగా తెలుస్తుంది. అదేమిటంటే, బొమ్మలు కల నాణాలన్నీ ఒకే టంకశాల కేంద్రం లేక కేంద్రాల అచ్చులతో తయారయి ఉండాలన్న సంగతే ఇది. రాజు బొమ్మ, శాసనంలోని పేరు మాత్రం మార్చబడేవన్నమాట. టంకశాల కేంద్రం ఆంధ్రాపథంలోని నాగార్జునకొండలో ఉండేదని నా అభిప్రాయం. సాక్ష్యం నా అభిప్రాయాన్ని బలపరుస్తోంది. మొట్టమొదటి బొమ్మ వెండినాణాన్ని గౌతమీపుత్రుడు వెలువరించి ఉండవచ్చు, అతని కొడుకు పుళుమావి బొమ్మ నాణెం ప్రమాణం ఏమిటో నిర్ధారణ చేసి ఉండవచ్చు. ఇది పుళుమావి (I) 'ధనకటకస్వామి' అయినతరువాత తీరాంధ్ర ప్రాంతాలు, క్షాత్రప దేశాలు సామ్రాజ్యంలో చేర్చబడిన తరువాత జరిగి ఉండవచ్చు.

ఈ విషయ ప్రస్తావనలో మనం చెప్పగలిగినది ఒకటి ఏమిటంటే, ఒక అక్షరాన్ని ఎన్నో రకాలుగా రాయటం ఉండేది, ఇది ఒక కాల వ్యవధికి వర్తిస్తుంది, కొన్ని సమయాలలో ఒక శాసనంలోని ఒక పంక్తికి కూడా వర్తిస్తుంది. అశోకుడి కాలంలోనే ఎన్నో ప్రాంతీయ లిపులు ఉండేవనీ, అవన్నీ స్వతంత్రంగా అభివృద్ధి చెందేవనీ చెప్పేవాదం క్రమంగా బలహీనమవుతోంది. దానీ39 చెప్పినట్లు 'అశోక బ్రాహ్మీ' సామ్రాజ్యానికి సంబంధించినది; ఇందులో ప్రాంతీయ లిపులని వేరుపరచటం కష్టం. ఒకే కాలానికీ, ప్రాంతానికీ చెందిన శాసనాలని అనుశీలించి వేరు వేరు రచనాపద్ధతులు ఉన్నవీ లేనివీ తెలుసుకొనవచ్చు.40 'అశోకబ్రాహ్మీ' లిపివలె 'శాతవాహన బ్రాహ్మీ' లిపికూడా సమ్రాట్టులు వాడినవే. ఇది అశోకబ్రాహ్మీని అనుసరించి 'ఇక్ష్వాకుల లిపి'లోకి అలాగే మారిపోయింది. ఇది 'తమిళ బ్రాహ్మీ'కి చాలా దూరం. 'తమిళ బ్రాహ్మీ' తమిళ భాషలోని శబ్దాలని, ఒక ప్రాంతానికి సంబంధించిన శబ్దాలని సూచించటానికి వాడబడిన లిపి. మహదేవన్ స్పష్టంగా చెప్పినట్లు తమిళ బ్రాహ్మీ అక్షరాలు 'ళ:, ళ

ఙ్, ఞ్:' (తెలుగు అచ్చులతో చూపించటానికి వీలు కాని అక్షరాలని రెండింటినీ పక్కన 'కోలన్' గుర్తుతో చూపించటం అయింది; పై నాలుగింటిలో మొదటి, నాలుగవ అక్షరాలకి ఈ గుర్తు ' వాడబడింది.) అరికే మేడు అనంతర కాలానికి చెందిన నాలుగు బ్రాహ్మీ అక్షరాలనుంచి వచ్చినవే. వీటి శబ్దాలు పోలికలు కలిగి ఉండేవి.[41]

మరికొన్ని విషయాలని గమనించాలి:

1. ఆ కాలంలో బొమ్మలుకల వెండి వెలువరింపులు దొరికిన ప్రాంతం ఎంతవరకు విస్తరించింది; 2. శాతవాహన నాణాలలో వాటి ప్రాముఖ్యత. మాప్ లేక భూగోళ పటం చూసినట్లయితే వెండి నాణాలన్నీ ఉత్తర, పశ్చిమభారత ప్రాంతాలనుంచి వచ్చినవని తెలుస్తుంది—పైన చెప్పిన అచ్చుముక్కని మినహాయిస్తే. దినకర్ రావ్, రామయ్యలకి హైదరాబాదులో దొరికినది కూడా డక్కన్‌కి చెందినదే అనుకుంటే శాతవాహన సామ్రాజ్య కేంద్రానికి దగ్గరగా ఒక టంకశాల ఉంటుందని మాత్రమే ఊహించాలి. పోనీ, నాగస్వామి వాదాన్ని స్వీకరించి వెనుకవైపు శాసనం తమిళమే అనుకుంటే—చరిత్రలో ఎప్పటికీ, ఎటువంటి పరిస్థితులలోనూ హైదరాబాదు ప్రాంతం తమిళభాష మాట్లాడేవారి ప్రాంతంగా పరిగణించబడదు. ఇక్కడా, అక్కడా తమిళం మాట్లాడేవారు కొందరు ఉండేవారేమో కాని 'తెలుగు, కన్నడ దేశంలో తమిళం విరివిగా చదవబడేది, మాట్లాడబడేది' అనుకొనటం, ఈ నాణాలు తమిళం వచ్చినవారికోసం వెలువరింపబడినవనుకొనటం ఊహాగానాన్ని అతిగా పెంచటమే అవుతుంది.[42] శాతవాహన రాజులు తమిళాన్ని పోషించి, నేటి తమిళనాడు ఉత్తరభాగాలని పాలించేవారనటంలో మాత్రం సందేహం లేదు.

ఈ శాసనం ప్రారంభదశలో ఉన్న తెలుగులోనే ఉందనుకున్నప్పటికీ ఈ రకం నాణెం తెలుగుభాష మాట్లాడేవారి ప్రాంతాలకోసం మాత్రం ఉద్దేశించబడి ఉండదనీ, క్షాత్రపుల వెండినాణాలకి అలవాటుపడిన పడమటి — ఉత్తరాది ప్రజలకోసం ఉద్దేశించబడి ఉంటుందనీ ఇక్కడ నొక్కిచెప్పటం అవసరం.

వెనుకవైపు తెలుగు శాసనాలు ఉన్న వెలువరింపులు శాతవాహన చరిత్రలో గౌతమీపుత్రుడి కాలంలోనూ, ఆతని అనంతరకాలంలోనూ ఉండిన రాజకీయ, ఆర్థిక పరిస్థితుల ఫలితాలే అనవచ్చు; శాతవాహన రాజుల మాతృభాష తెలుగు అనటంలో సందేహంలేదు. వీరికి విధివశాత్తు, ఒక్క గౌతమీపుత్రుడి కాలంలోనే తెలుగుదేశంమీద అధికారం వచ్చింది.[43] ఈ అధికారాన్ని గౌతమీపుత్రుడి కొడుకు పుళుమావి II గట్టిపరుచుకున్నాడు.

ఒకప్పటి పశ్చిమ క్షాత్రపుల దేశాలు కైవశం కావటంచేత క్షాత్రపులవలెనే శాతవాహనులు కూడా వెండినాణాలని వెలువరించవలసి వచ్చింది. ఒక తేడాని మాత్రం గమనించాలి. అదేమిటంటే — శాతవాహన నాణాల బొమ్మలు, వెనుకవైపుఉన్న సంకేతాలు దేశీయ శైలిని కనబరుస్తాయి; వాటిమీద రెండు భాషలలో శాసనాలు ఉంటాయి,[44] తెలుగు - ప్రాకృతం. క్షాత్రపుల వెలువరింపులమీద గ్రీకు, ఖరోష్ఠీ, బ్రాహ్మీ లిపులలో శాసనాలు ఉంటాయి; సంస్కృత, ప్రాకృతభాషలలో శాసనాలు ఉంటాయి.[45] ఇద్దరు పాలకులూ జయింపబడిన ప్రదేశంమీద తమ జాతీయత ప్రభావాన్ని ప్రకటించారు.

మౌర్య పరిపాలన ఫలితంగా, ఎంతో విశాలమయిన భూభాగం సామ్రాజ్యంలో భాగం అయిపోవటంచేతనూ, అధికారయుతంగానూ, ఇతరంగానూ వెలువడిన శాసనాలని బ్రాహ్మీలిపిలో ప్రాకృతభాషతో వెలువరించేవారు. మౌర్యుల అనంతరం అంత పెద్ద సామ్రాజ్యాన్ని ఏలిన శాతవాహనులు ఆదే అధికార భాషని, అదే లిపిలో తమ శాసనాలకోసం వాడేవారు. కొన్ని శతాబ్దాల అధికార పోషణద్వారా ప్రాకృత భాషకీ, బ్రాహ్మీలిపికీ 'అఖిల భారత'స్థాయి వచ్చింది—అప్పటి పరిస్థితులకి నేటి భావాన్నీ, పరిభాషనీ వాడటం తప్పుకాకపోతే, ప్రాంతీయభాషలో (లేక మాండలికాలు), ఏమయినా ఉంటే వాటి లిపులు బయటపడకుండా ఉండిపోయి ఉంటాయి. వీటికి సారస్వత, సాంస్కృతిక, రాజకీయరంగాలలో గుర్తింపు లభించి ఉండదు. అది కేవలం ప్రాంతీయాలకోసం వినియోగింపబడి ఉంటాయి. ఈ ప్రాంతీయులలో అధిక సంఖ్యాకులు, నేటివలెనే, చదువురానివారయి ఉండాలి. వీరినే జనసామాన్యం అనవచ్చు. బాగా

దక్షిణంగా ఉన్న ప్రాంతాలసంగతి వేరు.[46] పెన్నారు కిందనుంచి కన్యాకుమారిదాకా ఉండే దేశం, కనీసం చారిత్రక కాలం ప్రారంభదశలో మౌర్య, శాతవాహన సామ్రాజ్యాల పరిపాలనలో లేవు. ఒక స్పష్టమయిన ప్రాంతీయ స్వభావాన్ని కనబరిచే ధోరణి ఈ ప్రాంతపు భాషలలోనూ, లిపులలోనూ కూడా పెంపొందింది.[47] అందుచేత, పాత తమిళ సాహిత్యం, లిపిలో మిగిలిన ఉదాహరణలు ఒక వ్యక్తిత్వాన్ని సంపాదించుకున్నాయి. ఈ వ్యక్తిత్వం ప్రభావం పక్కప్రాంతాల భాషలయిన తెలుగు, కన్నడాలమీద కనిపిస్తుంది. ఈ భాషలు తమిళంమీద అంతగా తమ ప్రభావాన్ని చూపించవు.

పాత తెలుగుకి సంబంధించిన అవశేషాలు ఎక్కువ మిగులలేదు.[48] మిగిలే అవకాశాలు తక్కువ అని ఊహించాలి. తరువాతి శాతవాహనుల ధర్మమా అని నాణాలమీది శాసనాలు సందేహాలకి తావు ఇవ్వని కొంత సాక్ష్యాలు మనకి లభించాయి.

(ఈ వ్యాసం జర్నల్ ఆఫ్ ది ఎకనామిక్ ఎండ్ సోషల్ హిస్టరీ ఆఫ్ ది ఓరియంట్ సం. XVI, భాగం I లో వెలువడింది.)

అధోజ్ఞాపికలు

1. ఐ. కార్తికేయ శర్మ, "రీజనల్ డిస్ట్రిబ్యూషన్, సీక్వెన్స్, క్రోనాలజీ ఎండ్ హిస్టారికల్ సిగ్నిఫికెన్స్ ఆఫ్ ది శాతవాహనా కాయినేజ్". ఎ. ఎమ్. శాస్త్రి సంపాదకత్వాన వెలువడిన "కాయిన్స్ ఆఫ్ ది శాతవాహనాస్ ఎండ్ కాయిన్స్ ఫ్రమ్ ఎక్స్కవేషన్స్" పుటలు 75—103(నాగపూర్1972)

2. ఇండియన్ ఆర్కియాలజీ 1956—57—ఎ రివ్యూ, పుట 38, పటం 61 (మధ్యది). ఇది తప్పుగా గౌతమీపుత్ర శాతకర్ణికి సంబంధించినదిగా వర్ణింపబడింది.

3. ఇ. జె. రాప్సన్ "కాటలాగ్ ఆఫ్ ఇండియన్ కాయిన్స్ ఇన్ ది బ్రిటిష్ మ్యూజియమ్, ఆంధ్రా ఎండ్ వెస్టర్న్ క్షాత్రపా" వగయిరా (1908) పటం 2, ఇ 1 (ప బి.ఎమ్.సి.)

4. ఆర్కి. సర్వే. ఆ. ఇం. ఆన్యువల్ రిపోర్ట్ 1913—14, పు. 208, పటం, 65 అంకె 22 (ప ఎ. ఎస్. ఐ. ఆర్.)

4 అ) ఎ. ఇం. 36, పు 273—74. గౌతమీపుత్ర విజయ శాతకర్ణి తామ్రశాసనం.

5. ఐ.ఏ.ఆర్. 1956—57 పు. 38, పటం 60, ఎ, అం. 1. తప్పాల నిధి నాణాలమీది శాసనం వంటిదే ఈ శాసనం కూడా. "శ్రీ శాతకణిస" అనే శాసనం ఈ రాజుయొక్క వెండి బొమ్మలుకల వెలువరింపులమీది శాసనాన్ని బాగా గుర్తు చేస్తుంది. చూ: జర్నల్ ఆఫ్ ది న్యూ ఆశ్మటిక్ సొసయిటీ ఆఫ్ ఇండియా 30 (1968), ప 2, అం. 15 (ప జె. ఎన్. ఎస్. ఐ.)

6. ఐ. కె. శర్మ "విజయ ఇన్స్క్రిప్షన్స్ ఎండ్ శ్రీ పర్వత విజయపురి" జర్నల్ ఆఫ్ ఓరియంటల్ ఇన్స్టిట్యూట్, అం 1—2 (బరోడా 1968), పు 133—34. పుళుమావి 2 నాణాలు ఒక విహార స్థలంలో (అం. 11) దొరికాయి. ఇది మహా చైత్యానికి ఎదురుగా ఉంది. అంటే, ఇవి శాతవాహన కాలంలో ఉండేదని తెలుస్తోంది. చూ: ఎస్. దత్. "బుద్ధిస్ట్ మాంక్స్ ఎండ్ మానస్టరీస్ ఇన్ ఇండియా'. (ఆక్స్ఫర్డ్ 1962), పు 124, నోట్ 2.

7 ఆర్కి సర్వే ఆఫ్ వెస్టర్న్ ఇండియా 4, పు 3, అం 15, పంక్తి 2 (ప ఎ. ఎస్. డబ్ల్యు ఐ)

8. జె ఎన్. ఎస్. ఐ. 14, పు 1—3

9. జె. ఎన్. ఎస్. ఐ. 21, పు 102—09, పటం 6, అం 1, 1 ఎ.

10. ఎ. ఇం. 35, పు 250—54, ప 1

11. ఆర్. నాగస్వామి, "ఎ బైలింగువల్ కాయిన్ ఆఫ్ శాతవాహనాస్" సండే స్టాండర్డ్ 26.3.1967.

12. ఎ. ఎస్. శాస్త్రి "సిల్వర్ కాయిన్స్ ఆఫ్ ది శాతవాహనాస్" బులెటిన్ ఆఫ్ కల్కత్తా యూనివర్శిటీ, 1971, పు 113—19, పి. ఆర్. కె. ప్రసాద్, "సిల్వర్ పోర్ట్రెయిట్ కాయిన్స్ ఆఫ్ ది శాతవాహనాస్" ఇన్ శాస్త్రి, ఎ. ఎమ్. (సం) అదే 68—74.

13. ఐ. కార్తికేయ శర్మ "అభీరక వసుషేనా ఇన్స్క్రిప్షన్ ఎట్ నాగార్జున కొండా' ఇండికా, సం. 7, అం. 1, పు 4, 15—16 (బొంబాయి 1970)

14. ఇక్కడి తెలుగు మాటలు 'అరహణకు, నాకనకు, తిరు'అన్నవి. షష్ఠీ విభక్తి ప్రత్యయం 'కు' (అజంత భాష అయిన

తెలుగులో చివర అచ్చు శబ్దం ఉండటానికి ఇది మరొక నిదర్శనం.) మాటల చివర వచ్చినప్పుడు ఒక 'స' శబ్దం ముందు వస్తుంది. అందుచేత 'అరసనకు, మాకనకు, అరసన్—అరసు, లేక అరుసుకు—అరసనకు' రాజుయొక్క అవుతుంది. ప్రాకృతంలో 'స' బదులు 'హ' రావచ్చు. 'హ బదులు 'స' కూడా రావచ్చు. 'మాగం(డు)కు—మాగనుకు:— యొక్క కొడుకు. 'మాగన్' అనే పదం 'మాగండు' అవుతుంది. (ప్రాకృత సాంప్రదాయంలోని 'స' తెలుగులోకి వచ్చింది.) ఇక్కడ ప్రథమా విభక్తి 'డు' బదులు షష్ఠీ విభక్తి ప్రత్యయం 'కు' వస్తుంది కనుక 'మాగం(డు)కు—మాగనుకు' అవుతుంది. 'తిరు' అనే అక్షరజాలం తెలుగులో దివ్య గుణాన్ని సూచిస్తుంది. 'తిరునాళ్లు' అంటే దేవుడి ఉత్సవ దినాలు. 'తిరుపతి' అంటే 'శ్రీపతి'. పవిత్రతని కూడా ఈ అక్షరాలు సూచిస్తాయి. 'తిరునీరు' అంటే నుదుటికి పెట్టుకునే రేణువు. ఇది ఇంకొక అర్థంలో కూడా వాడబడుతుంది. స్వామి రామానందతీర్థ, కృష్ణతీర్థులు వంటి పేరులలో ఉపసర్గగా పని చేస్తుంది. "తీర్థ" అనే మాటకి "తిరు" ప్రాకృతరూపం అనిపిస్తుంది. "తీర్థ" అంటే పవిత్రజలం లేదా "క్షేత్రం'.

15. ఎ. ఎస్. ఆల్టేకర్, "ది కాయిన్స్ ఆఫ్ ది గుప్తా ఎంపయిర్" (1957) పు. 17.

16. ఎస్. రామయ్య, "మోర్ లయిట్ ఆన్ ది కాయిన్ ఆఫ్ శాతవాహనాస్" సండే స్టాండర్డ్, మదరాసు. 10—2—1967. నాగస్వామి చదివిన "ష" అక్షరాంతం ఆయనకి అర్థం కాలేదు. చూ: జె. ఎన్. ఎస్. ఐ. 30 (1968) పు. 77—79.

17. ఇక్ష్వాకు వంశ ప్రారంభకుడు శ్రీ చాంతమూల 1 శాసనాలలో తలకట్టుమీద గాట్లు గమనించతగినవి. చూ. ఎ. ఆం. 1 (1969), 148 పుట ఎదురుగా ఉన్న పటం. అంతేకాక, ఎ. ఇం. 37, భాగం 1, పు 29—32.

18. ఎ. హెచ్. దానీ "ఇండియన్ పాలాయొగ్రాఫీ' (లండన్ 1963) పటం 7 బి., టి. వి. మహాలింగం, "సౌత్ ఇండియన్ పాలాయొగ్రఫీ" (మదరాసు 1969) పు 133, బొమ్మ 12.

19. దానీ—అదే— ప 4 బి: అమరావతి స్తంభం శాసనం, ఎ. ఇం. 35, పు 43.

20. మహాలింగం— అదే—పు. 245, ప. 14.

21. దానీ—అదే— పటం 7 బి, అం. 1

22. దానీ— ,,— పటం 6 బి

23. ఎ. ఆం. 1 (1969) పు 148, దానీ— అదే— పటం 7 బి, అం. 3,9.

24. దానీ— అదే— పటాలు 6 బి 11, 12., 9 బి అం—12, ఎ. ఇం. 33 పటం ఎ—బి. పు. 148, అదే 34, పు. 20.

25. మహాలింగం—అదే—అధ్యాయం 4.

26. నాగస్వామి—అదే—

27. డి. సి. సర్కార్, "సెలెక్ట్ ఇన్‌స్క్రిప్షన్స్ 1" (1965), ప. 33. 2 "కుమార హకుసిరి, కుమార శాతవాహన" వగయిరా. చూడండి, దానీ— అదే - ప 6 ఎ, 7ఎ, నానెఘాట్ కొండాన్ అం. 2—1.

28. ఆర్కియొలాజికల్ సీరీస్ అం.27,అం.ప్ర.ప్ర. 1969, ప 15, ఎన్షంట్ ఇండియా, 60. 20—21 (1967) ప 15—17 బి, అం సి..

29. ఎర్రగుడి శిలా'శాసనం. ఎ. ఆర్. ఎ. ఎస్. ఐ. 1928—29 పటం 61; రాజుల మంథగిరి. ఎ. ఇ. 31 అం 28; దాని—అదే—పటం 4 ఎ, 5 ఎ.

30. సిత్తన్నవాసల్‌నుంచి శాసనం (ఎ) దాని—అదే— ప 7 ఎ అరికామేడు. ఎ1, అం. 2, పటం 41, 15; మామండూర్, మహాలింగం ఎదురుగా 12, ప 14.

31. దానీ— ఆర్. పటం 9 ఏ;మధుర, కోశామ్ అంశాల కోసం పటాలు 8 ఎ చూడాలి. ఎ. ఇం. 32. పు 149, పటం చి పంక్తి 3; అదే 35 పట 6 బి, 3: పు 19, 15, బి 8.

32. ఎ. ఇం. 34 పు 20, పటం అం. 1

33. అదే 35 పు 25ం.

34. మహాలింగం —అదే— పు 117, 121.

35. ఇది "తొల్కాప్పియమ్" సూత్రం 14 లో సూచింపబడి ఉంది. చూడండి: మహాలింగం- అదే—పుట 118.

36. మహాలింగం— అదే— పు. 291—93, పటం 28, ఎ. ఆర్. ఐ. ఇ. 1911—12 పు. 10.

37. ఎ. ఐ. అం 2. పు 109—14 పటం 41; కాని మహాదేవన్ అరికేమేడున్ 'పుల్లి' ఉన్న ఉదాహరణ కింత చెప్తారు. 'సంగం' విధి వివరాలుఎక్కడ ప్రచురణ అయ్యాయో తెలుసుకొనలేకపోయాను. చూ: ఐరావతం మహాదేవన్ "తమిళ్ బ్రాహ్మీ ఇన్‌స్క్రిప్షన్స్" (మదరాసు 1970) పు. 7.

38. తొల్కాప్పియ రచయిత తొల్కాప్పియ

నార్ చెప్పిన సూత్రం అర్థం స్పష్టంగా తెలుస్తూనే ఉంది— ఏదయినా అకరానికి చుక్కపెడితే శబ్దం తగ్గి మాత్రనిడివి అసలు నిడివిలో సగం అవుతుంది. దక్షిణాదిలో వివిధ ప్రాంతాల రచనా పద్ధతులని లెక్కలోకి తీసుకుని పై సూత్రం నిర్వచించి ఉండాలి తొల్కాప్పియనార్. చూ: ఎమ్. రాఘవ అయ్యంగార్, "తొల్కాప్పియనారుమ్, పుల్లి ఎళుత్తుకళుమ్," ఆరాయుచ్చి— తొగుది.

39. భట్టిప్రోలు శాసనాలలో "క" లోని "అ" శబ్దాన్ని  గానూ "ఆ" ని  గానూ రాసి ఉంటుంది. ఒక అదనపు నిలువగీత ఉంటుందన్నమాట. ఆంధ్రప్రాంతపు శాసనాలలో ఈ పద్ధతి అనుసరించబడదు కాని కొంత ఆశ్చర్యం కలిగించేట్లుగానే "తమిళ—బ్రాహ్మీ" శాసనాలలో కనిపిస్తుంది. చూ: మహాలింగం— అదే— పు. 120. బుహ్లర్ భట్టిప్రోలు లిపికి నిర్ణయించిన కాలం నాకు సమ్మతమే కాని ప్రత్యేక ద్రావిడ లిపి ఆ కాలంలో ఉండేదనే అతని సిద్ధాంతంతో నేను ఏకీభవించలేను. చూ: ఎ. ఇం. 2, పు. 324—35. దాని భట్టిప్రోలు, నానేఘాట్ శాసనాలకి ఇచ్చిన కాల నిర్ణయం కూడా స్వీకరింపదగినది కాదు. చూ: పు. 69—70.

40. దాని— అదే— పు. 69.

41. సి. ఎస్. ఉపాసక్. "ది పాలాయోగ్రఫీ ఆఫ్ ది అశోకన్ బ్రాహ్మీ "(నలంద 1960) పు. 29—30.

42. మహాదేవన్— అదే— పు. 1—14.

43. నాగస్వామి— అదే.

44. తీరాంధ్ర ప్రాంతంలో, భట్టిప్రోలువద్ద, శాతకర్ణి 1 కి ఇంచుమించు సమకాలీనంగా ఖుబిరకుడనే శాతవాహనేతర పాలకుడు ఉండేవాడు. ఖారవేలుడు మైసోలస్ (మచిలీపట్నం) వద్ద పితుండ్రలో జరిగిన విధ్వంసాన్ని గురించిచెప్పాడు. దీనినిబట్టి తీరాంధ్ర ప్రాంతంలో పాతకాలాలలో ఎవరో పాలకుడు ఉండేవాడని గ్రహించవచ్చు. ఖారవేలుడి దక్షిణ దండయాత్ర అతని పాలనలో 11 వ ఏట జరిగింది. ఇది అతను విదర్భ (బెరార్) ఖాండేష్, అసక (అస్మక) ప్రాంతాలలో కొంత భాగం శాతవాహనుల నుంచి గెలుచుకున్న అనంతరం జరిగింది. గుంటుపల్లి శాసనంలో మహిషకాధిపతి అన్న బిరుదుకల మహామేఘ వాహనుడి ప్రసక్తి ఉంది కనుక ఖారవేలుడు కోస్తా ఆంధ్రప్రదేశంలో తన వంశాన్ని స్థాపించాడని వూహించవచ్చు. (ఆం. ప్ర. ప్రభుత్వం ఎపిగ్రాఫికల్ సీరీస్ అం. 3, (1968), పు. 1—3.) తీరాంధ్రదేశంకాని, దక్కను దక్షిణభాగంకాని శాతవాహన రాజులలో మొదటివారికింద ఉండేవనటానికి శాసనాల, నాణాల సాక్ష్యంలేదు. రాప్సన్, స్మిత్, భండార్కర్లు, గుర్తి వెంకటరావు, రామచంద్రయ్యలు చెప్పినది మనకి గుర్తుకి వస్తుంది. క్రమంగా బయటపడుతున్న సాక్ష్యాన్నిబట్టి శాతవాహనరాజులలో మొదటివారు దక్కను యొక్క పడమర, ఉత్తర భాగాలలో పైకి వచ్చారనీ, ఈ ప్రత్యంత ఆంధ్ర—కరాటక ప్రాంతాలు గౌతమీపుత్రశాతకర్ణి కాలంనుంచి శాతవాహనుల చేతికిందికి వచ్చి ఉంటాయనీ వూహించవలసి ఉంది. (కాంప్రెహెన్సివ్ హిస్టరీ ఆఫ్ ఇండియా 2, పు. 296—98) అయినా ప్రొఫెసర్ గుర్తి వెంకటరావు చెప్పినట్లు (ఎర్లీ హిస్టరీ ఆఫ్ డెక్కన్ 1 పు. 76) శాతవాహనులు జాతి ప్రకారం ఆంధ్రులేనన్న అభిప్రాయాన్ని మేము బలపరుస్తున్నాము. "శాతవాహన" అన్న పేరు వారి "కులం" పేరు అన్న అభిప్రాయాన్ని కూడా మేము బలపరుస్తున్నాము. పౌరాణికాలు ఆంధ్ర రాజులని వారి జాతి సంబంధాలని స్థూలంగా దృష్టిలో ఉంచుకుని పేర్కొన్నాయి. అది ప్రాచీనకాలంలో వీరు వింధ్యవాసులయి ఉంటారు. (ఇండియన్ ఏంటిక్వరీ 42, పు. 276). ముందు పశ్చిమ దక్కనులో అధికారంలోకి వచ్చి ఉంటారు. శాతవాహన కులం జన్మదేశం, రాజకీయ కార్యక్రమాల కేంద్ర ప్రదేశం మూసిక— అసిక— అస్మక, మూలక ప్రదేశాలు అయిఉండాలి— వారు ఆంధ్రులయినప్పటికీ. గోపాలాచారి (పి. హెచ్. డి. 2 పు. 299) వారిది పశ్చిమ దక్కను అన్నారు కాని ఈ అభిప్రాయంతో మేము ఏకీభవించ లేము. ఆంధ్ర జాతి పశ్చిమ దక్కన్లో ఎప్పుడో స్థిరపడిపోయి ఉండవచ్చు. శాతవాహనవంశం ఈ జాతి నుంచి ఉద్భవించి ఉండవచ్చు.

45. వెనుకవైపున ఉన్న గ్రీకు శాసనం కేవలం అలంకారంగా మారిపోయింది.

46. దేశంలో అందరికీ తెలిసిన లిపి బ్రాహ్మీ ఒకటే కనుక ఇది ఈ విధంగా ఉంది. కొన్ని అక్షర స్వరూపాల ద్వారా ప్రాంతీయ శబ్ద రూపాంతరాలని సూచించటం జరిగేది.


47. మనకి రోమన్ లిపి, ఇంగ్లీషు భాషవలెనే. బ్రిటిషుపాలన అదృశ్యం అయినప్పటికీ భారతదేశంలో మనం ఇంగ్లీషు భాష, రోమన్ లిపి అధికారాన్ని తప్పించుకొనలేకుండా ఉన్నాము. వ్యక్తుల మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు, సంభాషణలోనూ కూడా ఇంగ్లీషు ముఖ్యంగా ఉంది.

48. మహాలింగం— అదే— పు. 183—86.

49. మౌర్యుల తరువాతి, శాతవాహన కాలాలలో రాజులు సంస్కృతాన్ని శాసనభాషగా పోషించేవారు. సంస్కృతం ప్రభావం ప్రాకృతాలమీద ఉన్నట్లే బౌద్ధ, జైన మతసంస్థల ద్వారా ప్రాకృతం తమిళంమీద తన ప్రభావాన్ని చూపించేది.

50. తిరుమల రామచంద్ర, "మన లిపి పుట్టుపూర్వోత్తరాలు' (తెలుగులో) (విజయవాడ 1957), పు. 99—100. తెలుగు ప్రారంభదశలో "వేపూరు, నాగబు" వగయిరా మాటలు క్రీ. పూ. 1—2 శతాబ్దాలలో అమరావతి శాసనాలలో కనిపిస్తాయి. మేము మరికొన్ని ఉదాహరణలు ఇస్తాము. పండితులు వాటిని విమర్శనాదృష్టితో పరిశీలించ ప్రార్థన. అ) నెల్లూరు జిల్లా, కందుకూరు తాలూకా, మాలకొండ గ్రామంలో ఒక శిలా శాసనం ఉంది. దానిలో "అరువల (హ) కులస" అన్న పదాలు కనిపిస్తాయి. (ఎ. ఆర్. ఎస్. ఐ. ఇ. 1937—38, భాగం 2, అం. 531 పారాగ్రాఫ్ 1) ఇది సిరి— విరి సేతికి ఇవ్వబడిన పేరులలో ఒకటి. అతను "అరవకులా"నికి చెందిన వ్యక్తి. (మహాలింగం— అదే— అపెండిక్స్ 2, పు. 309, పటం 30. (ఆ) సాలిహుండంలో కాల్చకుండా ఎండినకుండ పెంకు ఒకటి దొరికింది. దీనిమీద క్రీ. పూ. 2 వ శతాబ్దానికి చెందిన తెలుగు రచన ఉంది. ఎవరో దాత వేయించిన శాసనం అయిఉండాలి. (ఇప్పుడు కాగితం 'చీటీ' అతికించినట్లే అప్పుడు పెంకుని 'చీటీ'గ వాడి ఉంటారు.) చదవగలిగిన అక్షరాలని బట్టి " . . . . నకుదానం" అన్న పదాలు ఉన్నట్లు తెలుసుకొనవచ్చు. (ఆర్. సుబ్రహ్మణ్యం, "బుద్ధిస్ట్ రిమెయిన్స్ టు ఎట్ సాలిహుండమ్" పు. 83, పటం 47, బొమ్మ 13, అం. 13 ఎ.) మరొక చోటు లాగే ఇక్కడా 'ద' అక్షరం తిరగబడి ఉంటుంది. పైన చెప్పిన గ్రంథంలో పటం 48. తవ్వకందారు మాత్రం అక్షరాన్ని "పా" గా చదువుతున్నాడు. తెలుగు అజంత భాష, అందుచేత షష్ఠీ విభక్తి ప్రత్యయం "కు" ముందు "న" అనే అక్షరం ఆగమంగా వస్తుంది. (ఇ) క్రీ. శ. 2—3శతాబ్దాలు ఇక్ష్వాకుల శాసనాలలో "తలవరి" లేక "తలవర" అక్షరాలు తటస్థపడుతూ ఉంటాయి.(ఎ. ఇం 31—ఎం—1, పంక్తులు 4, 5, M 6. పం. 3, 4, —అదే గ్రంథం—20, ఎ 2, పు. 6, 32., A—3, పం. 7.)" దీని అర్థం— సరిగ్గా తెలీదు కాని ఎవరో పెద్ద అధికారం కల వ్యక్తిగా లేక సామంతప్రభువుగా అర్థం చేసుకొనచ్చు' అని వోగెల్. "మహాతలవరి ఎండ్ మహాతలవర అర్ తలవరకారం," (ఎ. ఇం. 33, పు 149, పం. 5, 34, పు. 19, పం. 7.) తెలుగు, కన్నడ భాషలలో తలారి, తలవర పదాలకి గ్రామతలవరి అనే స్పష్టమయిన అర్థం ఉంది. ఈనాటికీ ఈ పదవులు ఉన్నాయి, కరణం, మునసబ్బుల కన్నా వారి అంతస్తు తక్కువే అయినప్పటికీ, ఇక్ష్వాకులకాలంలో ఈ బిరుదులో గ్రామతలవరులకి ఇచ్చి ఉండాలి. తలవరి భార్య పేరు 'తలవరి' అయి ఉండవచ్చు. 'మహాతలవర' అంటే ఎందరో తలవరుల మీద అధికారి అయిఉండవచ్చు. అతని భార్య 'మహాతలవరి' కావచ్చు. 'రాజు'కి ప్రారంభదశలో ఉన్న తెలుగులో "ఏలి" లేక "ఏలిక" అనే మాట వాడేవారు. "ఏలి ఏహావుల దాసమ్మక" (ఎ. ఇం.35, పు. 3, పం. 6—7). ఏలి శ్రీ మరొక సంస్కృత శాసనంలో కనిపిస్తుంది. (అదే 33, పు. 149, పం. 6). రెండు ఉదాహరణలలోనూ "రాజన్" పదానికి ఇవి రూపాంతరాలే. కొన్ని పదాలకి "శ్రీ" అన్న సంస్కృత ఉపసర్గ గౌరవార్థంగా వాడబడటం, స్థానిక తెలుగు దేశపదాలు ప్రాచీన శాసన సాహిత్యంలోకి ఎలాగ ప్రవేశించాయో సూచిస్తుంది. "ఏలి" అనే పదానికి "క" చేరిస్తే ఇప్పుడు కూడా "రాజు" అన్న అర్థమే వస్తుంది. "సమ్రాట్" అన్న అర్థం అంతగా ఉండదు. "ఏలిక"కి అతి ప్రాచీన రూపం అయిన "ఏలి" ఇక్కడ కనిపించినదనుకోవచ్చు.

క్రీ. శ. నాలుగవ శతాబ్దం అనంతరం శాసనాలలో ప్రారంభదశలో కనిపించే తెలుగు మాటల వివరాలకోసం ఆరుద్ర "సంగ్రహ ఆంధ్ర సాహిత్యము" 1 (తెలుగు, 1965) పు. 7—12 చూడాలి.



వ్యాసంలో వర్ణింపబడిన నాణెం
(రెండురెట్లు పెద్ద పరిమాణాలలో చూపబడుతోంది.)

అ ను బం ధం

రాజుపేరు	దొరికినచోటు	పరిమాణం	బరువు	ప్రచురణలు.
గౌతమీపుత్ర శాతకర్ణి	ఉజ్జయిని	0. 7 అం.	30 గ్రా	జె. ఎన్. ఎస్. ఐ. 8, భా 2, పు. 111—13, పటం 7, అం. 7. (బొమ్మకానిది).
,,	జోరాపూర్(దక్షిణ కోసల)	0. 6 అం.	27.9 గ్రా	జె. ఎన్. ఎస్. ఐ. 21, పు.107—09, పటం 6, అం. 1, 1 ఎ.
వాశిష్ఠీపుత్ర పులుమావి	భిల్సా	0.65 అం.	28 గ్రా	జె. ఎన్. ఎస్. ఐ. 14, పటం 1, అం. 1, 2.
,,	నాగార్జునకొండ	0.62 అం.	—	అచ్చు ముక్క (మట్టి): ఐ. ఎ. ఆర్. 1956—57, పు. 38, ప 61 (మధ్య)
వాశిష్ఠీపుత్ర శాతకర్ణి	బొంబాయి(ప్రిన్స్ ఆవ్‌వేల్స్‌మ్యూసియమ్.	0. 6 అం.	28 గ్రా	జె. ఎన్. ఎస్. ఐ. ప 2, అం 5, 6.
,,	హైదరాబాదు (బన్‌సన్‌రావు)	0. 7 అం.	28 గ్రా	జె. ఎన్. ఎస్. ఐ. 21, పు 11. ప 1, అం. 4.
,,	హైదరాబాదు (రామయ్య)	0.65 అం.	28 గ్రా	జె. ఎన్. ఎస్. ఐ. 30, పు. 74—79, ప 20, అం. 1.
గౌతమీపుత్రయజ్ఞశాతకర్ణి	సోపారా	0. 6 అం.	34 గ్రా	బి. ఎమ్. సి. ప7, ఇ 1.
,,	అమ్రేలి	0. 6 అం.	24.5 గ్రా	బి. ఎమ్. సి. ప 7, అం. 178.
,,	బరోడా	0.65 అం.	29.5 గ్రా	బి. ఎమ్. సి. ప 7, జె. బి.
,,	త్రిపురీ (రెండు నాణాలు)	0.59—62 అం.	34.8 గ్రా	జె. ఎన్. ఎస్. ఐ. 12, పు 127—33, ప. 10, అం. 8.
,,	పైఠాన్	0. 6 అం.	34 గ్రా	జె. ఎన్. ఎస్. ఐ. 26, పు. 98—99, ప 2, అం. 8.
,,	మీరట్	0. 6 అం.	24.5 గ్రా	ఉజ్జయిని, వి. ఎస్. వాకాంకర్ (విక్రమ్ విశ్వవిద్యాలయం) ఇచ్చిన సమాచారం.
,,	జొన్నగర్	—	—	ఎ. ఎస్. ఐ. ఆర్. 1913—14, పు. 213—14, ప 65, అం. 22.

గమనిక : 1. నాగార్జునకొండ, సోపారా, జొన్నగర్‌వి తవ్వకాలలోనుంచి తీసుకొన్న ఉదాహరణలు.

2. ఒక సెంటిమీటరు 0.39370 అంగుళాలతో సమానం.

అనువాదకుడి గమనిక : (1) అచ్చు కూర్పు సౌకర్యంకోసం రోమన్ అంకెలని మామూలు అంకెలలోకి మార్చటం జరిగింది. (2) ఇంగ్లీషులో "opp cit" అనే గుర్తుని "అదే" (అదే ఉదాహృత రచన) అన్న గుర్తుగా 'అనువాదం' చెయ్యటం జరిగింది. (3, 'ప్లేట్' అన్న మాటకి 'పటం', 'పేజి' అన్న మాటకి 'పుట' వాడబడ్డాయి. (4) వీలయినంతవరకు తెలుగు లిపి మాత్రమే వాడబడింది.

[ఈ వ్యాసంలో కొన్ని బ్లాకులుమాత్రమే ప్రచురించాము మిగిలినవి బ్లాకులు చేయుటకు వీలుకాలేదు.]

చెన్న పట్టణం

డా. చల్లా రాధాకృష్ణ శర్మ

నగరేశ్వరుడు చెన్నమల్లేశ్వరుడు
దయానీరధి పార్థసారథి
చల్లని తల్లి కల్పకవల్లి —
ఇంకా ఎంద రెందరో
విజయం చేసిన దేవతా నిలయం
మదరాసు మహా నగరం !

చెడి చెన్నపట్నం చేరమని
మడి కట్టుకున్నావా డెవడో
సెలవిచ్చాడు శ్రీరంగ నీతి.

వీధి కొక మద్యపు టంగడి
పేట కొక కాబెరా హోటలు
లెక్కలేని చలన చిత్రశాలలు
నెలకొన్న యీ రోజులలో
చెడని పట్టణం ఏ దున్నది ?

తినే బియ్యంలో రాళ్ళూ రప్పలు
అపరాలలో చెత్త చెదారం
వస్తువు లన్నిటా కల్తీ
కాన వచ్చే యీ రోజులలో
చెడని పట్టణం ఏ దున్నది !

స్వేచ్ఛా పరిణయం
స్వైర విహారం
నాగరికతా చిహ్నాలుగ

చె న్న ప ట్ట ణం

యువతీ యువకులు
భావించే యీ రోజులలో
చెడని పట్టణం ఏ దున్నది ?

విజ్ఞాన శాస్త్రం
విస్తరించే కొద్దీ
భయంకర మారణాయుధాలు
పిల్లలు పెట్టినట్లు,
ఉద్యోగుల జీతాలు పెరిగేకొద్దీ
బజారులో ధరలు పెరిగినట్లు,

ధర్మం నడుము వాల్చేకొద్దీ
మోసం పడగ విప్పేటట్లు
నాగరికత ననలు వేసేకొద్దీ
మంచి సెబ్బరలు జంటకవులై
సంచరించడం పరిపాటి !

అయినా
మా చెన్నపట్టణం
చెన్నైన పట్టణం
కొత్తవేషం దాల్చిన పాత పట్టణం !
ఆర్ష సంస్కృతికి ఆటపట్టు
అధునాతన ఫాషన్లకు ఉనికిపట్టు
సంగీత సాహిత్యాలకు కొలువు కూటం
సర్వ సంపదలకు కొటారం !

తిక్కయజ్వ - భేదములేని భక్తి

శ్రీ ఓరుగంటి నీలకంఠశాస్త్రి

'వైదికమార్గ నిష్ఠమగు వర్తనమున్ దగ నిర్వహించుచున్
భేదము లేని భక్తి మతి నిర్మలవృత్తిగఁ జేయుచుండు మ
త్పాద నిరంతర స్మరణ తత్పర భావము కల్మి నాత్మ సం
మోదముఁ బొందఁ గావ్యరసముం గొనియాడుచునుండు దెప్పుడున్.'

(విరాట. 1–15)

ఇది తిక్కయజ్వకు స్వప్నమునందు దర్శన మిచ్చిన పరమేశ్వరుఁడగు హరిహరమూర్తి యాతనిఁ గూర్చి పలికిన పలుకు. తిక్కయజ్వ యెల్లపుడుఁ గావ్యరసమును గొనియాడు చుండునఁట! ఈ కావ్యరస మాతనికి నాత్మ సంమోదముఁ బొందఁగాఁ గల్గినది. ఈ యాత్మానందము చిత్తమును నిర్మల వృత్తిగఁ జేయుచుండు పరమేశ్వర నిరంతర స్మరణ తత్పర భావము చేతను భేదము లేని భక్తిచేతను గల్గినది. అట్టి భక్తి, పాద స్మరణ తత్పరభావము, వైదికమార్గ నిష్ఠమగు వర్తనమును నిర్వహించుటచేఁ గల్గినవి.

తిక్కయజ్వ కావ్యరసమును గొనియాడుటకుఁ బరమేశ్వరుఁడు దెల్పిన కార్యకారణ భావ మిట్లొప్పుచున్నది. దీనిని మనము శాస్త్రోపపత్తులచే నుపపన్నముగావింప యత్నింతము. ఇందుఁ దెల్పఁబడిన విషయముల కన్నింటికిని నిదానములు రెండు. అవి వైదిక మార్గ నిష్ఠమగు వర్తనము, భేదములేని భక్తియును. అందుఁ దొలుత వైదికమార్గ నిష్ఠమగు వర్తన మనఁగా నేదియో విచారింపవలయును. వైదిక మార్గమనఁగా వేదమునందును దదనుసారులగు మన్వాది స్మృతులయందును దెలుపఁబడిన యైహికాముష్మికములకు సంబంధించిన మార్గము. ఇది శాస్త్ర నిర్ణయమును బట్టి ప్రవృత్తి మార్గమనియు నివృత్తి మార్గమనియు ద్వివిధముగా నున్నది. ప్రవృత్తి మార్గమునే కర్మ మార్గమని యందురు. ఇందు గర్భాధానాది షోడశ సంస్కారములు, అష్టకాది సప్తపాక యజ్ఞములు, అగ్న్యాధేయాది సప్త హవిర్యజ్ఞములు, అగ్నిష్టోమాది సప్తసోమ సంస్థలును గృహస్థునకు అవశ్యాచరణీయములుగా శాస్త్రముచే విధింపఁబడినవి. ఇది యుత్తమ ప్రవృత్తి మార్గమని దెల్పుటకే తిక్కయజ్వ 'వైదిక యజనా' (అశ్వ. 4–2–86) అను మున్నగు విశేషణములతోఁ బరమేశ్వరుని సంబోధించును.

ఇట్టి కర్మ సంతానములను బరమేశ్వరార్పణ బుద్ధితో ఫల నిరపేక్షముగఁ జేసినవారలు అధ్యాత్మ సంస్కారమును గల్గి చిత్తశుద్ధిని బడయుదురు. మనుజుని యుత్తమస్థితికి నిట్టి చిత్తశుద్ధియే యత్యావశ్యకము. ఈ యభిప్రాయమును 'కరణ ఫల పరిత్యాగ వ్రతోదాత్తచేతః పరిణత సుఖపీఠభ్రాజమాన' (కర్ణ. 3—401) 'అనపేక్షిత ఫలతా శోభన మహనీయ క్రియా విపాకాత్మక' (అశ్వ. 3—227) మున్నగు పారమేశ్వర సంబోధనములచేఁ దెల్పినాఁడు. చిత్తశుద్ధిని లోకసామాన్య వ్యవహారమున 'నిర్మల మనస్సు'ని యందురు. ఇది యంతయుఁ బ్రవృత్తి మార్గము.

ఇఁక రెండవ మార్గము ఉపనిషత్ప్రతిపాద్యము, జనన మరణ రూప సంసార దుఃఖములను దొలఁగఁ జేయునదియు నగు నివృత్తిరూప మోక్ష మార్గము.

మొదటి మార్గము ఫలాభి సంధి రహితముగ నాశ్రయింపఁ బడినచోఁ జిత్తశుద్ధిని గల్గించి రెండవ మార్గమునకు అది హేతువగుచుండును. కృత్స్న వైదిక కర్మాచరణముచే నుత్తమ సంస్కార విశిష్టుఁడగు తిక్కయజ్వ విషయమునఁ బరమేశ్వరునిచేఁ బ్రయోగింపఁబడిన 'మతి నిర్మలవృత్తి' వచనమునకు మోక్ష సామ్రాజ్యహేతువగు నిర్మలాంతఃకరణవృత్తినే యర్థముగా గ్రహించుట యుచితము. తిక్కన వాస్తవ స్వరూపమును గేతన దన దశకుమార చరితమునఁ జతుర్గోచరముగా నొనర్చినవాఁడు. ఆయజ్వ 'మహిత దక్షిణలైన బహువిధయాగంబుల నొనరించెను' (దశ. 1–92) 'సతత స్వాహాస్వధాది శబ్దద్వయ సంస్కృత హవ్యకవ్య సంతర్పిత మఖ శిఖి ముఖ నిలింప పితృ వర్గుఁడు' (దశ. 1–95) 'శ్రౌతస్మార్తకర్మ తత్పర మతి' (దశ. 2–1) 'వేదోదితకర్మ వ్రతుఁడు' (3–164) 'సతతాధ్వర క్రియాకర్మఠ పాణి పద్ముఁడు (5–134) 'మఖసంతోషిత మరుత్సమాజుఁడు' (5–135) ఆతని వైదికకర్మ నిష్ఠాపరత్వమును విశిష్ట వ్యక్తిత్వమును దెల్పునట్టి విశేషణ పరంపరలందుఁ గో కొల్లలు. తాదృశకర్మాచరణ ఫలముగా నాతఁడు 'వికారవిదూర చిత్తుఁడు (8–94) 'అస్తదోషుఁడు', 'ధర్మనిర్మలుఁడు', 'ధర్మవిచారుఁడు' 'విమలధీ సుశ్లోకుఁడు', 'నిర్మల మార్గవృత్తి రమణీయుఁడు', అంతరద్విషన్నిర్మథన ప్రభావ మహనీయ వివేక విశాలబుద్ధి' (దశ. 5–134) యు నయ్యెను. కావున నాతని 'మతి నిర్మలవృత్తి' మోక్షసామ్రాజ్య హేతువగు నిర్మాలాంతఃకరణవృత్తియే. సందేహము లేదు.

ఇఁక నిట్టి చిత్తశుద్ధితోపాటు ఆతఁడు 'భేదము లేని భక్తి' గలవాఁడు. చిత్తశుద్ధిగల్గినవానికట్టి భక్తి గల్గుటలో నచ్చెరువు లేదు. ఆ 'భేదము లేని భక్తి' యెట్టిదో విచారింతము.

'భక్తి' యను శబ్దము 'భజ' (సేవాయాం) అను ధాతువునకు 'క్తిన్' ప్రత్యయము చేరఁగా నిష్పన్నమైనది. సేవించుట, పొందుట యని సామాన్యార్థము. దీనినే శాండిల్య భక్తి సూత్రము 'సాపరాఽను రక్తి రీశ్వరే' (ఈశ్వరునియం దుత్తమానురక్తియే భక్తి యని నిర్వచించినది. తత్సూత్రవృత్తి ఆ సూత్రార్థమును—'పరమేశ్వర విషయ కాన్తః కరణవృత్తి విశేషః ఏవ భక్తిః' (పరమేశ్వర విషయకమగు నంతఃకరణ వృత్తివిశేషమే భక్తి) అని వివరించినది. ఇట్టి పరమేశ్వర భక్తి, 'ఉపాసన' శబ్దముచే లోకశాస్త్రములందు వ్యవహరింపఁబడుచున్నది. శ్రీకృష్ణభగవానుఁడు తన భక్తి యోగమున—

'మయ్యావేశ్య మనో యే మాం
నిత్యయుక్తా ఉపాసతే.'

'యేతు ధర్మ్యామృత మిదం
యథోక్తం పర్యుపాసతే
శ్రద్దధానా మత్పరమాః
భక్తాస్తేఽతీవమేప్రియాః'
(భ. గీ. 12–2, 20)

(నాయందుఁ జిత్తమునుంచి సతతయుక్తులై యుపాసించువారు నా భక్తులు; ధర్మ్యము అమృతము నగు విషయమును యథోక్తముగ నుపాసించువారలు నా కతిప్రియభక్తులు) అని భక్తిని ఉపాసన శబ్దముతో వ్యవహరించెను. అట్లే 'భక్త'శబ్ద పర్యాయముగా 'ఉపాసక' శబ్దము ప్రసిద్ధ వ్యవహారమును లోకమునఁ గనియున్నది. భక్తి స్వరూప మింతమాత్రముచేఁ దేట తెల్లము కాలేదు. ఇంకను గొంత వివృతి యావశ్యకము.

సహజముగా లక్కవలెఁ గఠినమగు చిత్తము సత్త్వగుణోద్రేకముచేఁగల్గిన భగవద్విషయక స్నేహము వలన, అనఁగా సేవ్య— సేవకాది తాపకభావములవలన ద్రవింపఁగా నందు భగవదాకారము ప్రవేశించును. స్థిరముగా నిల్చిన యందలి భగవదాకృతిని మనోవృత్తి ధారావాహికముగ నెల్లపుడు స్మరించుచు సేవాదుల కున్ముఖమగును. అట్టి స్థితియే భక్తి.

చిత్తద్రవ్యంతు జతువత్
స్వభావాత్ కఠినాత్మకమ్,
తాపకైర్విషయైర్యోగే
ద్రవత్వం ప్రతిపద్యతే' (భక్తిరసాయనము)

'ద్రుతే చిత్తే ప్రవిష్టాయా
గోవిందా కారతా స్థిరా,
సా భక్తిరి త్యభిహితా'
(భక్తిరసాయన)

ఇట్లే వేఱొకచోట—

'ద్రుతస్య భగవద్ధర్మాత్
ధారావాహిక తాంగతా,
సర్వేశే మనసో వృత్తిః
భక్తిరిత్యభిధీయతే.

అని పేర్కొనఁబడినది. ఇట్టి భక్తిగలవాఁడు దన యుపాస్య మూర్తిని సేవారూప క్రియా కలాపముతో బహుధా సేవించుచుండును. ఇది భక్తిసామాన్య స్వరూపము.

సత్త్వగుణ కార్యమగు నిట్టిభక్తి, చిత్త సంస్కారమును బట్టి ద్వైతభక్తి—అద్వైతభక్తి (భేద భక్తి—అభేదభక్తి) యని ద్వివిధముగా నుండును. దీనినే శిష్టులు—

'స్థూలా సూక్ష్మేతి ద్విధా
హరిభక్తి రుద్దిష్టా,
ప్రారంభే స్థూలా స్యాత్,
సూక్ష్మా తస్యాః సకాశాచ్చ.'
(ప్రబోధ చంద్రోదయము)

(స్థూలసూక్ష్మ భేదముచే హరిభక్తి ద్వివిధము; ఆరంభమున స్థూలమగు భక్తియే క్రమముగాఁ జిత్త పరిపాక వశమున సూక్ష్మ మగును) అని తెల్పిరి. ఇందలి స్థూలభక్తియే ద్వైతభక్తి. బాహ్యమగు భేదముతో నొప్పు నీ స్థూలభక్తియందుఁ గూడ నుత్తమ మధ్యమ భేదములు గలవు. అందుఁ గరచరణా ద్యవయవ విశిష్టమగు మూర్తి రూపము నర్చించుట మధ్యమ భక్తి. భక్తుని చిత్తపరిపాకమునుబట్టి యీ భేదము గల్గును. వస్తుతః కరచరణాది రహితమగు పరమేశ్వర రూపమును, గరచరణాది విశిష్టముగాఁ గల్పింపఁబడనిచో భావించుటకుఁ దగు మానసిక పరిపాకము తనకు లేకపోవుటచే నట్లు కల్పించి భావింప వలసివచ్చినది కావున నట్టి యాతని భక్తి మధ్యమ భక్తియే యగును. ఎవ్వఁడు అట్టి యవయవ కల్పనము లేకపోయినను బరమేశ్వరుని భావింపఁగలఁడో యట్టి యాతని చిత్తము మధ్యమ భక్తుని చిత్తము కంటెఁ బరిపక్వమయినట్లు భావింపవలసియుండును. కరచరణా ద్యవయవములు లేని రేఖా రూపములగు పారమేశ్వర చక్రములందును సాలగ్రామము నందును లింగమునందును బరమేశ్వర భావన గల్గి యర్చించు నట్టివారు స్థూల భక్తులలో నుత్తములు. వీరల చిత్తము కరచరణా ద్యవయవ రహితమగు ప్రతీకము నందుఁ గూడఁ బరమేశ్వర భావనము చేయఁగల సంస్కారము నందినది. ఉపాస్యదేవత తుల్యమైనను నుపాసకుని చిత్తశుద్ధినిబట్టి భావనా భేదము గల్గును. భావనా భేదముచేతనే ఫల భేదము గల్గును. ఈ విషయము భారతమునందే ద్రోణ పర్వమున నిరూపింపఁబడినది. అందు శివభక్తుఁడగు నశ్వత్థామ ప్రయోగించిన యాగ్నేయాస్త్రము అర్జునుని విషయమున వ్యర్థమగుటకు హేతువును వేదవ్యాస భగవానుఁడు ద్రౌణికిట్లు తెలిపెను—

'శుభ్రమగు నుర్విమృత్తిక సురుచిరంపుఁ
బ్రతిమ గావించికొని యందుఁ బరము నావ
హించి పూజావిశేషంబులెల్లఁజేసి
నీవు తొలిమేనఁ గొలిచితి నిష్ఠతోడ.'
(ద్రోణ. 5–416)

వారలు లింగాధిష్ఠా
నారూఢుంగా నొనర్చి యర్చించిరి భ
వ్యారాధన పరులై మును
గౌరీపతి నతుల నియమకల్పన వెలయన్.
(ద్రోణ. 5–417)

అందు లింగంబునందుఁ బూజించుట యర్చయందు (విగ్రహము) ఆరాధించుటకంటె ననేక గుణంబు లెక్కుడుగావున లింగార్చన పరులగు వారలను అర్చారాధకుడవగు నీకు నెట్లు జయింపవచ్చును ?' (ద్రోణ. 5—418).

దీనిని బట్టి కరచరణాది విశిష్టమగు మూర్తి నర్చించుటకంటెఁ దదాకార రహితమగు లింగాదుల నర్చించుట యుత్తమమని స్పష్టమయ్యెను. భగవంతునికిఁ గరచరణాది కల్పనము అర్చకుని యపరిపక్వ చిత్తము, అందు నిల్చుటకేగాని యది వాస్తవ రూపముగాదు. కావుననే తన్నుఁగూర్చి తపముచేసిన నారదునికి మహావిష్ణువు ప్రత్యక్షమయి తన విగ్రహస్తుతిని గావించుచున్న యాతనికిట్లు పల్కెను—

'మాయాహ్యేషా మయా
సృష్టా యన్మాం పశ్యసి నారద,
సర్వభూత గుణైర్యుక్తం
నైవం మాం జ్ఞాతు మర్హసి'.

(నీవు గాంచుచున్న యీ రూపము మాయా రూపము. ఇద్దానిని నా వాస్తవ రూపముగాఁ దెలియ వలదు) కావునఁ గరచరణాది విగ్రహమును మాత్రము గాంచి పరవసించు భక్తి యుత్తమభక్తి గాదని సుస్పష్టము. ఇట్టి స్థూలభక్తివలన నిత్యదేవతా ప్రతిమార్చనము, పరమేశ్వర భక్తులతో సేవా సమాగమము, ఈశ్వర కథా సంశ్రవణోత్సుకత సత్యవదనము మున్నగు సద్గుణములు గల్గును. ఇందు భక్తునికి ఆరాధ్య—ఆరాధక—ఆరాధన రూపమగు భేదము, దేవతా పార్థక్య భేదము నుండుటచే దీనిని భేదభక్తి యని వ్యవహరించిరి. ఇట్టి భేదదృష్టి తోడనే శివాధిష్ఠిత శైవ దర్శనము, భువనేశీ దేవతాధిష్ఠిత శాక్తదర్శనము, విష్ణ్వధిష్ఠిత వైష్ణవ దర్శనము, బ్రహ్మదేవతాధిష్ఠిత వైదిక దర్శనము, సూర్యాధిష్ఠిత సౌరదర్శనము, తారాధిష్ఠిత సౌగత దర్శనము అను నాఱు దర్శనములు పరఁగుచున్నవి. వీనినే షట్ సమయములని యందురు. ఆయా తంత్ర గ్రంథములను ప్రధానములుగాఁ జేసికొని యాయా దేవతా భక్తులు ఆయా దేవతలే సర్వదేవతోత్తములను దృష్టితోఁ బూజించు చున్నారు. ప్రధాన దర్శనములుగాఁ బ్రసిద్ధినందిన యీ యాఱేగాక గణపత్యాది దేవతలనుగూడ నట్టి దృష్టితోడనే పూజింపవలయునని బోధించు గాణాపత్య దర్శనానుసారులగు గాణాపత్యులు మున్నగువారలు గూడఁ గొందఱు గలరు. వీరలందఱు ద్వైత భక్తులే. వీరలందఱు దమచే నారాధింపఁబడు దేవతయే సర్వోత్తమమైనదని తలఁచుచు నొకప్పుడు అంతతో నాఁగక యితరదేవతలు స్వోపాస్య దేవతలకంటెఁ దక్కువవారని నిందించుట గూడఁ గలదు. ఇట్టి న్యూనాధికత్వ ప్రతిపాదనములే పరస్పర విరోధహేతువు లగు చుండును. భక్తిహేతువగు

సత్త్వగుణ మొకప్పుడు రజస్తమములచేఁ దిరస్కృతము కాఁగా నిట్టివాదములు బయల్వెడలు చుండును.

ఇఁక ద్వితీయమగు సూక్ష్మభక్తిని విచారింతము. నిర్మలినమగు దర్పణమునందుఁ బ్రతిబింబమువలె భక్తుల నిర్మలిన చిత్తదేశములందీ యభేదభక్తి (సూక్ష్మభక్తి) స్థూల భక్తిచేఁ గ్రమముగా జనించును. ఈ యభేద భక్తిగూడ నంతఃకరణ నైర్మల్య తారతమ్యముచే సామాన్య—మధ్యమ—ఉత్తమ రూపములతోఁ ద్రివిధముగా నుండును.

ఇందొక విషయమును బ్రధానముగా శాస్త్రోపపత్తులచే గ్రహింపవలసియున్నది. హార కటక రుచకాద్యలంకారములు భిన్నభిన్నములై చూపట్టినను సువర్ణ రూపమున నొక్కటేయైనట్లు ప్రయోజన భేదముచేతను రుచిభేదముచేతను నానా రూపములతోఁ గొల్వఁబడుచున్నను వాస్తవముచే నీ దేవతలందఱు నభిన్నులే యగుచున్నారు. శ్రుతి స్మృతి వాదములిట్లే బోధించు చున్నవి. అందుత్తమోపనిషదుపదేశము—

'వాచారంభణం వికారో నామధేయం
మృత్తికే త్యేవ సత్యం'
(ఛాం. 6.1.4)

(ఘట శరావాది వేఱు వేఱు పేరులు గల యీ వికారముల నృతములు. మృత్తిక యనున దొకటియే సత్యము). యాజ్ఞవల్క్య మహర్షి సత్యవచనము— 'ఇంద్రోమాయాభిః పురురూప ఈయతే. యుక్తా హ్యస్య హరయః శతా దశ'(బృహదారణ్యకము 2.5.19)

(పరమేశ్వరుఁడు దన మాయాశక్తిచే బహురూపుఁడై గోచరించుచున్నాఁడు) ఉపనిషత్తులే గాక ఋగ్వేదమంత్ర ప్రబోధమును గూడ మనము పరిశీలింతము. 'ఇంద్రం మిత్రం వరుణమగ్ని మాహురథో దివ్యః స సుపర్ణో గరుత్మాన్। ఏకం సద్విప్రా బహుధా వదన్తి, అగ్నిం యమం మాతరిశ్వానమాహుః' (ఋగ్వేద. 1—164—46)

(ఒకే దేవతను ఇంద్రమిత్ర వరుణాగ్ని గరుత్మద్యమ మాతరిశ్వులుగాఁ జెప్పుచున్నారు.)

శ్రుతివాదము లిట్లు పరఁగుచున్నను అర్థవాదములుగాఁ దంత్రములచే బోధింపఁబడు తత్తద్దేవతా పారమ్యమును యథార్థమని తలఁచెడి సామాన్యులకు వాస్తవ విషయమును బోధింపనెంచి పురాణములు దేవతల యనన్యత్వమునే గాక భేదభావములోని యనర్థమునుగూడ బోధించినవి. చూడుఁడు.

'శివాయ విష్ణు రూపాయ శివరూపాయ విష్ణవే।
శివస్య హృదయం విష్ణుః, విష్ణోశ్చ హృదయం శివః॥
(స్కాందోపనిషత్)

(శివకేశవు లభిన్నరూపులే) అట్లే—

'యా శ్రీః సా గిరిజా ప్రోక్తా యో హరిః
స త్రిలోచనః (వరాహపురాణము)

(లక్ష్మియే పార్వతి, విష్ణువే శివుఁడు)

ఇఁక భేద దృష్టిలోని యనర్థమును గనుఁడు—

'మద్భక్తః శంకర ద్వేషీ మద్ద్వేషీ శంకర ప్రియః।
తావుభౌ నరకం యాతః యావదా భూత సంప్లవం॥
యే భేదవాదం కుర్వంతి తేవై నిరయ గామినః।
హరిరేవ హరస్సాక్షాత్ హరఏవ హరిః స్మృతః'
(బ్రహ్మాండ పురాణము)

(శివకేశవులు భిన్నులని తలఁచుచు మద్భక్తుని ద్వేషించు శంకరభక్తుఁడు శంకర భక్తుని ద్వేషించు మద్భక్తుఁడుఁ విష్ణుభక్తుఁడు) వీరలందఱును నరకమునఁ బడుదురు)

వేదహీనముచేసి కేవల తంత్రాశ్రయణము వలన దేవతా భేదదృష్టి తన్మూలక పారమ్యము ప్రజలలో గాఢమగుటచేతనే కాఁబోలు కవి కుల గురుఁడుగూడఁ దన కావ్యములందు వ్యంగ్య రూపమున దేవతాఽనన్యత్వమును బోధింపవలసి వచ్చెను.

'ఏకైవ మూర్తిః బిభిదే త్రిధా సా
సామాన్య మేషాం ప్రథమావరత్వం''
(కుమార. 6—44)

(ఒకే పరమేశ్వరుఁడు మూఁడు విధములుగా (బ్రహ్మ—విష్ణు—మహేశ్వర) భేదించుటచే వీరలలో హెచ్చుతగ్గులందఱుకు సమానములే.)

'నమ స్త్రి మూర్తయే తుభ్యం ప్రాక్ సృష్టేః కేవలాత్మనే
గుణత్రయ విభాగాయ పశ్చాద్భేద ముపేయుషే'
(కుమార 2—4)

(తొలుతఁ గేవలాత్మ స్వరూపుఁడవై సత్త్వాది గుణముల కార్యమునకై భిన్నుఁడవై మూఁడు రూపములనందిన నీకు నమస్కారము.)

'తిసృభిః త్వ మవస్థాభిః మహిమాన ముదీరయన్
ప్రళయస్థితి సర్గాణాం ఏకః కారణ తాం గతః॥
(కుమార. 2.6)

(ఓ పరమేశ్వరా, శివకేశవ బ్రహ్మ రూపములతో నీ వొకఁడవే ప్రళయస్థితి ప్రజననములకుఁ గారణమగుచున్నావు.)

ఇట్లనంతములగు సూక్తులు దేవతాభేదము వాస్తవముగాదని నిరూపించినవి. ఈ విషయమునే భంగ్యంతరముగా ఎవ్వ రేదేవతను గొల్చినను అది యంతయు నా పరమేశ్వరునే చెందునని బోధించిరి.

'త్రయీ సాంఖ్యం యోగః పశుపతి మతం వైష్ణవమితి
ప్రభిన్నే ప్రస్థానే పరమిద మదః పథ్యమితిచ,
రుచీనాం వైచిత్ర్యాత్ ఋజు కుటిల నానా పథ జుషాం
నృణామేకో గమ్యస్త్వమసి పయసా మర్ణవ ఇవ' (మహిమ్నస్తవము)

(ఎన్నెన్ని వంకర త్రోవలను బ్రవహించినను, దిన్నని మార్గములఁ బ్రవహించినను, సాక్షాత్తుగాఁగాని పరంపరయా గాని నదులకు సముద్రమే గమ్యమైనట్లు, ఏయే రుచులతో నేయే దేవతలను గొల్చినను, వారలకందఱకును ఓ పరమేశ్వరా, నీవే గమ్యుఁడవు.)

ఇంతవఱకు నిరూపించిన విషయము:—ఉపాస్య దేవతకుఁ బ్రయోజనమును బట్టిగాని రుచిని బట్టి గాని గల్గిన వ్యావహారిక భేదమేగాని తత్త్వ రూపమున భేద మెంతమాత్రము లేదను నభేద దేవతా దృష్టి. ఇదియే 'సామాన్యాభేద భక్తి' యను నభేద భక్తి భూమికలలోని తొలి భూమిక. అభేద దృష్టి గలవారలకుఁ గూడ నభిరుచినిబట్టి భేద ముండునా యని పలువురు సందేహింతురు. కాని తప్పక యుండును. మహావిద్వాంసుఁడు విశ్వోపదేష్టయు నగు భర్తృహరియే యేమనెనో చూడుఁడు—

'మహేశ్వరే వా జగతా మధీశ్వరే
జనార్దనే వా జగదన్తరాత్మని
న వస్తుభేద ప్రతిపత్తి రస్తిమే,
తథాపి భక్తి స్తరుణేందు శేఖరే'
(భర్తృ. 3—84)

శివకేశవులు భిన్నులని తా నెన్నడును విశ్వసింపఁడుగాని తనకు మాత్రము తరుణేందు శేఖరుని యందే భక్తియఁట! అట్లే మహాకృష్ణభక్తుఁడగు లీలాశుకుఁడు తన స్వప్నమునందు మహావిష్ణువు శ్రీరామచంద్ర రూపముతో దర్శన మీయఁగా 'ఆ కోదండ శరములను విడిచి వేణువును జేతఁ బట్టినఁగాని నిన్ను నమస్కరింపన'ని కచ్చితముగఁ బల్కినాఁడు. తిక్కన గూడఁ దొలుత నిట్టి యభేద దృష్టిగలవాఁడే. శివకేశవులలో నాతనికి నన్యతర పారమ్యము లేక పోయినను నాతఁడు—''చిత్త నిత్యస్థిత శివుఁడు'' (దశకుమార. 1–3) పూజాతర్పిత రాజ శేఖరుఁడు (దశ. 1—100) ' సోమభృద్భక్తి మత్తుఁడు'' (దశ. 6—196) అశివ భక్తి యాతని మత్తునిగాఁజేయును. అంతమాత్రముచేఁ గేశవభక్తి శూన్యుఁడుగాఁడు.'శ్రీకాంతచరణ యుగళీకోక నద మధువ్రతుఁడు (దశ. 6—1) 'శ్రీ స్తనమండన మేదుర కస్తూరీ బహుళకాంతి—హరిచరణ కమలోపాస్తి కృతస్వస్తి' యే (దశ. 10—1) అయినను నాతనికిఁ బురమథనునియందు మక్కువ హెచ్చుగా నగపడును. అట్టి భక్తి తత్పరత్వముచే నిరీహతో సోమయాగము నాచరించి యాతఁడు ఇంకను విమల స్వాంతుఁడయ్యెను. అంతతో నాతనికి హరిహరులిద్దఱును దత్త్వదృష్టితోఁగాక స్వరూపమునఁగూడ నభిన్నులైరి. పూర్వము '' హరిహర పద్మగర్భులను... గొల్చి' (నిర్వ. 1—2) యను స్వరూపభేదమ్ముగూడ

ఆతని కిపుడు (భారత రచనా సమయమున) నిశ్శేష ముగ నదృశ్యమయ్యెను. ఆతఁడు తన యుపాస్యదైవ మును 'వినిరస్త సమస్త వికార' (విరాట. 3-238) 'షట్సమయ మహానుభావ' (విరా. 5—405) 'పురుషత్రయతా వివృతస్వభావ' (విరా. 5—405) అని విశాలదర్శనము సంబోధింప నారంధించెను. అయి నను ఈ భక్తిగూడఁ బైని పేర్కొనఁబడిన యభేద భక్తులలోని సామాన్యరూపమే. ఆరాధ్య—ఆరాధక—ఆరాధన యనెడి త్రిపుటీభేదమును నశింపఁజేయుటకు సాధనమగు భక్తిగల్గవఱకు నియ్యది సామాన్యభక్తియే యగును. తిక్కయజ్వమాత్రమట్టి త్రిపుటీభేదమును గూడ నతిక్రమించి నట్లు మున్ముందు నిరూపింపఁ బడును. కావునఁ దిక్కయజ్వ 'భేదములేని భక్తి' నింత మాత్రమే పేర్కొనుట యెంతమాత్రము సరి గాదు.

పై త్రిపుటీ భేదముగూడఁ గ్రమముగా క్షీణించి దేవతతో నభేదభావము నభ్యసించుటకు మహర్షులు సూక్ష్మమగు నొక యుపాసనా పద్య ననుగ్రహించిరి. అయ్యదియే యుత్తమోపాసన మార్గము.

ఉపాసనములు వైదికములనియుఁ దాంత్రికము లనియు ద్వివిధములుగా నున్నను ప్రకృత విచారము వైదికమార్గ నిష్ఠుఁడగు తిక్కయజ్వకు సంబంధించి యుండుటచే వైదికోపాసనమును గూర్చియే మనమిపుడు చర్చింతము.

(సశేషము)



వేమన వేదాంతము

శ్రీ పులిచెర్ల సాంబశివరావు

చూపులోని చూపుఁ జూడ నేర్చిన వాఁడు
చూపులోన నుండి చూచువాఁడు
చూడఁజూడఁ దన్నుఁ జూచును నిక్కము
విశ్వదాభిరామ వినురవేమ.

ఇది వేమన పద్యము. ఇట్టివి పెక్కున్నవి. అందు నిజమైన వేమన పద్యములను గుర్తించుట కష్టమే! క్లిష్టమైన భావములను వేమన చెప్పడు. ఈ పద్యము సూటిగ లేదు. ఏదో వేదాంతమిందున్నది. వేమన పద్యములుగా ప్రసిద్ధి చెందిన వానిలో నిట్టి పద్యములు వందల సంఖ్యలోనున్నవి: వానిలో కొన్నియైనను వేమన చెప్పినవే కావచ్చును. పై పద్యమున గూడార్థమున్నను అది సరళముగా సాగినది. కొంచె మాలోచించిన చాలును. అంతుచిక్కును. లోపలి చూపు అనగా అంతరంగమును చూచుట అని యర్థము. ఆత్మస్వరూపమును గాంచగలిగినవాడు పరమాత్మ స్వరూపమును జూడగలిగినవాడన్న మాట!

నిజమునకు వేమన వేదాంతికాదు. సుఖ దుఃఖములను చవి జూచిన సామాన్యమానవుడు. విరక్తుడై సంచరించుచు మానవాళికి దివ్య మార్గమును జూపిన దిగంబరకవి వేమన. పండితుడుకాడు. వేదముల నభ్యసింపలేదు. అందువలననే వేదాంతార్థములను సామాన్యునికి సుగమము చేయగల్గినాడు.

ఇతడు తనకు తెలియకుండనే అద్వైతార్థములను ఆటవెలదులలో నాంధ్రులకందించెను. బ్రహ్మ దర్శనమార్గము లుపదేశించినాడు. సర్వలోకము సచ్చిదానందాత్మకమని వివరించినాడు. సంవిత్స్వరూపమును తెలిపినాడు.

వేమన జీవితమే ఆయనకు అద్వైతమును బోధించినది. సత్త్వ రజస్తమోగుణాత్మకమగు ప్రకృతి స్థితియే సర్వస్వమని మొదట వేమన భావించినట్లు కథల వలన తెలియుచున్నది. అప్పు డజ్ఞానియై 'నేను' అనుదానిని తెలియ డయ్యెను. జీవితానుభవములే అద్వైతమును నేర్పగా జగత్తు అసత్యమనియు, బ్రహ్మము సత్యమనియు వేమన గుర్తించి యుండును. అనుభవములు నేర్పినపాఠములే ఆటవెలదులై వెలసినవి., ఆంధ్రుల రసనాగ్రములపై నాడినవి.

అద్వైతమతము ప్రకారము జగత్తు అసత్యమనుమాట సత్యమే! కాని నిత్య వ్యవహారమునందు జగత్తు అసత్యమని అద్వైతము చెప్పుటలేదు. పరమార్థమునందే అది యసత్యము! ఇది వేమనకు బాగుగ తెలియును. అందుకే లౌక్య మార్గములను ప్రబోధించినాడు.

అనువుగాని చోట నధికుల మనరాదు
కొంచెముండు టెల్లఁ గొదువ కాదు
కొండ యద్దమందుఁ గొంచెమై యుండదా
విశ్వదాభిరామ 'వినుర వేమ.

విరక్తుడైన వానికి లోకముతో నేమి పని? తగ్గి యుండినచో తప్పుగాదని చెప్పుట ఎందుకు? వేమన లౌక్య సంబంధములైన ఇట్టి పద్యములను లెక్కకు మిక్కిలి చెప్పెను.

దాసరయ్య తప్పు దండంబుతో సరి
మోసమేది తన్ను ముంచకున్న
నీచుఁడై చెడునటు నీచుల నమ్మిన
విశ్వదాభిరామ వినురవేమ.

తొత్తు తొత్తెగాని దొరసాని గాఁబోదు
అడచు టింతె దానికైన ఫలము
మిత్తికూళ్ల దొంగ మేలు నెట్లెఱుఁగురా
విశ్వదాభిరామ వినుర వేమ.

పరిశీలించినచో వేమన విరక్తుడేనా యనిపించును!

"ప్రజ్ఞానం బ్రహ్మ"

"అహం బ్రహ్మాస్మి"

"తత్త్వ మసి"

"అయమాత్మా బ్రహ్మ"

అను నాలుగు మహావాక్యములను వేమన ప్రత్యేకముగ నభ్యసింపకున్నను, ఆయర్థముల నవగతము చేసికొని యుండును.

నేను నీ వనియెడి నెత్తంపు మాటలు
మాని యుండు వాఁడె మాన విదుఁడు

తాను నేననియెడి తమకంబు మానరా
విశ్వదాభిరామ వినుర వేమ.

పరము పరమటంచుఁ బలుకుదు రందఱు
పరమునందు నేమి ప్రబల ముండుఁ?
బరము నందు నిండుఁ బరిపూర్ణుఁడే కదా!
విశ్వదాభిరామ వినుర వేమ!

సర్వ ప్రాణికోటియందు వెలుగుచున్న చైతన్యమే పరబ్రహ్మమని ఋగ్వేదీ యైతరీయోపనిషత్తులోని "ప్రజ్ఞానం బ్రహ్మ" అను మొదటి మహావాక్యము చెప్పుచున్నది. పైని చెప్పిన వేమన పద్యములును నావిషయమునే కదా చెప్పు చున్నవి! కర్తృత్వాద్యభిమానియగు జీవుడు వాస్తవముగా నాత్మానన్యము . రజస్తమోగుణప్రధానమే అవిద్య. అవిద్య ప్రతిబింబమే జీవుడు!

అఖిలా కారుఁడనంతుఁడు
సకలాత్మల యందు సర్వసాక్షియుఁ దానై
నిఖిలముల నిర్వికారుఁడు
నికరము బ్రహ్మమ్మనంగ నిజమురవేమా!

ప్రజ్ఞానం బ్రహ్మయను మహావాక్యమునీ కందము అందమైన వ్యాఖ్యానము జేయుచున్నది.

శుద్ధ సత్త్వగుణ ప్రధానము మాయ. మాయ యందు అద్వితీయమగు పరబ్రహ్మము ప్రతిబింబింతమైనపుడు ఈశ్వరుడందురు. వేమన ఇట్లనుచున్నాడు.

తన్ను వెదకి చూడఁ దానె యౌ జీవుండు
తత్వ మరయ నగును దానె యాత్మ
మన్ను మిన్ను లేదు మాయయు లేదయా
విశ్వదాభిరామ వినుర వేమ.

యజుర్వేదీయ బృహదారణ్యకోపనిషత్తులోనున్న అహం బ్రహ్మాస్మి అనువాక్యము కర్తృత్వాద్యభిమానియగు జీవుడు వాస్తవముగానాత్మానన్యమని తెలుపుచున్నది. 'అహంబ్రహ్మాస్మి' అని పలుకుట తేలికే!నిజముగా దాని పరమార్థమును దెలిసి పలికినపుడే ఆ వాక్యము సార్థకమగును. వేమన ఈ విషయము నిట్లు విమర్శించినాడు.

నేనను వచనంబు నీ వన గా వచ్చు
నీవు నేననబడు నిష్ఠదెళియ
నేను నీవె నేనన వచ్చురా
విశ్వదాభిరామ వినుర వేమ.

సామవేదీయ ఛాందోగ్యము పరబ్రహ్మమే ప్రతివ్యక్తి యందు సాక్షిరూపమున ప్రకాశించుచున్నాడు—తత్త్వమసి— అని చెప్పుచున్నది. ఈ వాక్యమునకు పెక్కు వేమన పద్య ములు ప్రతిబింబ ప్రాయములుగా నున్నవి. పలువిధము లైన ఆభరణము లుండవచ్చుగాక! బంగారమొకటే కదా! ఆహారములు వేఱైనను ఆకలి యొకటే కదా! పరమాత్ము డొక్కడే! మాయావికారము వలన నొక్కొక్కరిలో నొక్కొక్క విధముగ దర్శనమిచ్చుచున్నాడు. వేమనపలుకులు జూడుడు!

పని తొడవులు వేఱు బంగార మొక్కటి
పలు ఘటములు వేఱు ప్రాణ మొకటి
యరయఁదిండ్లు వేఱు టాకలి యొక్కటి
విశ్వదాభిరామ వినుర వేమ!

పరబ్రహ్మము హృదయాకాశమున సాక్షాత్కా ర యోగ్యము. 'అయమాత్మా బ్రహ్మ' అనునది అథర్వణీక మహావాక్యము. ఇది గ్రహించియే మనకవి విగ్రహారాధనను విమర్శించినాడు. హేళన చేసినాడు.

పలుగు రాళ్లఁ దెచ్చి పరగ గుడులు గట్టి
చెలఁగి శిలల సేవఁ జేయ నేల?
శిలల సేవఁ జేయ ఫలమేమి గల్గురా
విశ్వదాభిరామ వినుర వేమ.

సామాన్యులకు వేదాంతముతో నేమిపని? వారి కాత్మా నాత్మ భేద మనవసరము. తెలియదు. అన్నమయాది కోశపంచ కమే ఆత్మయని వారు భావింపవచ్చును. అది వారి యజ్ఞాన మునకు తార్కాణ. ఇవి యనాత్మలని వారికి తెలియదు. అహమిదం (ఇది నేను), మమ మేదం (ఇది నాది) అను భ్రాంతుల కాస్పదముగుటచే అన్నమయాది కోశ పంచకము ఆత్మకానేరవు! ఆత్మ వేఱు. దాని యునికిని ప్రత్యేకముగ, ప్రయోగాత్మకము నిరూపించుట దుర్ఘటము. తర్కముచే దానిని స్పష్టపరుపవచ్చును. తేలిక!

పంచకోశముల నెట్లు తెలిసి కొనుచున్నాము ? ఆత్మ యుండుట వలనే! కావున ఆత్మ పంచకోశముల కంటె భిన్న మైనది! పంచకోశములకు ప్రాధాన్య మిచ్చుట మూర్ఖుని పద్ధతి.

అల్ప సుఖము లెల్ల నాశించి మనుజుఁడు
బహుళ దుఃఖములను బాధపడును
పరమసుఖంబు నొంది బ్రదుకఁగనేరడు
విశ్వదాభిరామ వినుర వేమ.

వేమన విగ్రహారాధనమ కొన్ని పద్యములలో హేళన చేసినను, మఱి కొన్ని పద్యములలో దాని ప్రాధాన్యమును

గుర్తింపక పోలేదు. మెప్పులకు ముప్పదేండ్లు వివరించినను బ్రహ్మస్వరూపము తెలియదు. అట్టి వారికి విగ్రహారాధనమే మంచి మార్గము.

గుడులు దేవతలని గుర్తులు గావించ్రు
ముష్టి జాపతాము మూర్ఖనేల
మొప్పెలకును దారి మురియగ: జూపిరి
విశ్వదాభిరామ వినుర వేమ.

పంచకోశ సంబంధము లేనిచో జీవత్వమే లేదని వేమనకు తెలియును. అవసరమున్నంత ప్రాధాన్యము వాని కిచ్చుటలో తప్పు లేదు.

కలిమి కలిగెనేని గాముఁగాఁ జూతురు
లేమిచేత: జిక్క లేమ లధిపు
మదను వంటి వాని మాలఁగాఁ జూతురు
విశ్వదాభిరామ వినుర వేమ.

కులము గలుగు వారు గోత్రంబు గలవారు
విద్యచేత విఱ్ఱవీగు వారు
పసిఁడి గల్గువాని బానిస కొడుకులు
విశ్వదాభిరామ వినుర వేమ.

—అని వేమన మొత్తుకున్న దందుకే!

బ్రహ్మతత్త్వము గుర్తెరిగినవాడు బ్రహ్మమే యగును. అనగా "నేను బ్రహ్మ నెరుగుదును" అను ద్వైతభావమును పారద్రోలిన వాడు బ్రహ్మయగు నన్నమాట! వేమన ఇట్టి వాడే!

త్రికాలములయందు ప్రతిరోధము లేనిదే సత్యము. బ్రహ్మ సత్యత్వము, జీవబ్రహ్మ నన్యత్వము, జగన్మిధ్యాత్వము అను ఈ మూడే అద్వైత తత్వముల మూల సూత్రములు. వైరాగ్యము, జ్ఞానము, విషయోపరతి అను ఈ మూడును మోక్షోప యోగవరములు. వేమన బోధనలలో ప్రముఖముగ కన్పించున వివే! మచ్చునకు కొన్ని—

తిరిగి తిరిగి నరుఁడు ద్రిమ్మరికాఁగానె
యందువల్ల నేమి యధికమొప్పు
నంతరంగ మెఱిఁగి నప్పుడే శివుడౌను
విశ్వదాభిరామ వినుర వేమ.

పరగ బొందులు పది ప్రాణంబ దొక్కటి
పుష్పజాతులు పది పూజ యొకటి
పసుల వన్నెలు పది పాలన్ని యొక్కటి
విశ్వదాభిరామ వినుర వేమ.

పుట్టు పుట్టలేదె పుడమిని జనులెల్ల
పుట్టి గిట్టలేదె పూర్వు లెవరు?
పుట్టి గిట్టుటెల్ల వట్టి భ్రాంతులు సుమీ
విశ్వదాభిరామ వినుర వేమ.

కట్టెయందు నిప్పు గానని చంద మీ
తనువునందు నాత్మఁదగిలియుండు
మఱుగు దెలిసి పిదప మాంద్యానవలెనయా
విశ్వదాభిరామ వినుర వేమ.

సూక్ష్మముగా పరిశీలించినచో వేమన యోగిగానె ఆంధ్రులకు తెలిసెనని తెలియును. వేమనను మహాకవిని చేయుటకు పలువురు ప్ర య త్ని ం చు ట చూచుచునే యున్నాను. "అతని పద్యము లాంధ్రుల నాబాల వృద్ధముగ నాకర్షించుటయే కాక యందు ప్రవచింపబడిన నీతులు ధర్మములు ఆంధ్రుల దైనందిన జీవితమును దిద్ది తీర్చిన వనుటలో సందియములేదు. కావున వేమన కవిగానే లోకమున కుపయోగపడెను." అని బండారు తమ్మయ్యగారు వేమన చరిత్రలో వ్రాసిరి. "వేమనయోగిగా మనకుపయోగ పడలేదు" అని పండిత వంగూరి సుబ్బారావు పంతులుగారు 'వేమన' లో స్పష్టము చేసిరి.

ఇక్కడ నాదొక చిన్న సూచన.

వేమన పద్యములలో కవిత్వమున్నదని అంగీకరించినచో —తెలుగులో జెప్పబడిన ప్రతి నీతి వాక్యము, ప్రతి చమత్కారము, ప్రతి తత్త్వము కవిత్వమే యని మనమంగీకరింప వలసి వచ్చును.!

అందువలన నిచట తొందరపడి నిర్ణయము చేయ రాదు.

"వేమన రాజయోగి" అని శేషాద్రి రమణ కవులు వ్రాసిరి. "వేమన యందు బలవత్తరమైన గొప్ప గుణమున్నది. అదేదనగా శ్రద్ధ. తాను గొప్ప తత్త్వము నెరిగినను దృఢమైన నమ్మికకు తోడు బ్రతికియుండు లోపలదాని నంద ఱెఱుగునట్లు చేయవలయునను పట్టుదల గలవాడు." అని రాళ్లపల్లివారు వ్రాసిరి. వేమన పద్యములను జదివిన వారెవ్వరును ఈ వాక్యములను విశ్వసింపరు. వేమన తనకు గొప్ప తత్త్వము తెలియునని చెప్పలేదు! చెప్పినచో వేమన అజ్ఞానియై యుండును! మనము గౌరవింప బనిలేదు!

1920 ప్రాంతమున అచ్చయిన వేమన పద్యముల పుస్తకములలో వేమన యోగిగనే గుర్తింప బడినాడు. మన ప్రాచీనులు కవుల చరిత్రలలో వేమనను గూర్చి వ్రాయక పోవుటకు కారణమిదియే! వారి యజ్ఞానముచే వేమన కవిగా గుర్తింపబడలేదని భావించినచో నది మన యజ్ఞానమున కుదాహరణమగును.

వేమన తాను కవి గాదలచి పద్యములు చెప్పలేదు. తనకు తెలిసిన జ్ఞానము ప్రజలకు పంచదలచి సరళమైన భాషలో బోధచేసెను. విరాగిని దెచ్చి కవిగా జూప యత్నించు మనవారి తెలివితేటల నేమనవలె? బ్రహ్మజ్ఞానియైన వేమన తనను ప్రజలు 'మహాకవి' యందురని తెలిసినచో నసలు పద్యములే చెప్పకుండ ఉండెడి వాడేమో!

పాపము! వేమన! ! !

నివేదన

శ్రీ పి. విజయకుమార్

రమ్మ ! లతాంగి పోవుద మరాచక ధారుణి వీడి దేవ సౌ
ఖ్యమ్ముల దేల్చు నూహల జగాలకు, స్వాగతమిత్తురాడ, ని
త్యమ్మటు నుండు ప్రేమమయ ధామములం జరియించు వారు; పు
ష్పమ్ముల వర్ష డోలికల పాటలు పాడుచు నాట్యమాడుచున్.

నేనట కేగుదెంచుటకు నీ అవలంబన లేకయున్న ఏ
మేనియుగాదు పోయినను ఏలకొ వచ్చితి? పూలులేని, కా
డా ! నవమాధురీ కలమహత్వ సుధారస లోపపాన పా
త్రా ! నిలయంబిదా? యనుచు ధారుణిపై బడ కూలద్రోయరే !

కనుక త్వదీయహస్తమును కారుణికమ్మును చూపి చాపి వే
దన శమియించునట్లు నను, దాసుని నీపద పద్మ సంస్పృశా
ఘనతర భాగ్యమిమ్ము చిలుకా ! చెలికానిని చేరనిమ్ము, నీ
కనులను చూడనిమ్ము నవకమ్ముల వర్ణన సేయ నీయవే !

ఉమరు ఖయాము, గాలిబు మహోత్తమ ప్రేమికు లయ్యు నీచ లో
కమును తలంప నేరకయ కమ్మని ఊహల లోకమందు, ని
త్యము మధుపాన గోష్ఠికడ, అర్ధ నిమీలిత నేత్ర తాచు కో
పమున తిరస్కరించు తమ భామలకై తపియించి పోవరే?

మల్లెల కుప్పవోలె కనుమా ! చిరుగాలులు లాగుచుండ, జా
బిల్లి కదల్చుచుండగ నవీన శుభాకరమై వెలుంగు ఉ
త్ఫుల్ల వితాన తారకలు పొంగులు వార నభః పథంబునన్
చల్లని మేఘస్యందనము స్వాగతమిచ్చెను చూడుమా చెలీ !

లోయలు - శిఖరాలు

శ్రీ కలువకొలను సదానంద

ప్రొద్దు క్రుంకుతున్నవేళ—ఫారెస్ట్ బంగళా ఎదుట పేము కుర్చీలో—నేనూ మా ఆవిడా కబుర్లు చెప్పకుంటూ కూర్చున్నాం.

పడమటిదిక్కున సూర్యకిరణాలు—రుద్రభూమిలో గాయపడి కాలికి బుద్ధి చెబుతున్న సైనికులవలె క్రమేణా అదృశ్యమైపోతున్నాయి. చీకటి తెరలు నలు మూలలనుంచీ కమ్ముకుంటూ, ప్రకృతిసుందరికి నల్ల ముసుగు తొడుగుతున్నాయి. చల్లగా మృదువుగా శరీ రాల్ని తాకుతూ ఎక్కడికో ప్రయాణంచేస్తూన్న పిల్ల వాయువులు క్షణంలో గొప్పవేగాన్నందుకుని హోరుమని శబ్దంచేస్తూ అక్కడి వృక్షజాలాన్నంతటినీ కదిపివేయ సాగాయి. పాపం, కొద్దిక్షణాలక్రితం చెట్లకొమ్మల్లో కిచకిచలాడుతూ స్వేచ్ఛగా విహరిస్తూవుండిన చిలు కలు, గోరవంకలు, అడవిపావురాలు, ఏవేవో పిట లు ఇప్పుడు గాఢాంధకారంలో వాటి నివాసాలలోంచి తొంగి చూడ్డానిక్కూడా సాహసించలేకుండా వున్నాయి. వాటి మధుర ధ్వనులేవీ ఈ హోరుగాలిలో వినిపించడం లేదు.

కాస్సేపటికి చలికూడా ప్రారంభమయ్యేసరికి 'ఇక లోపలి కెళ్దాం పద' అంది మా ఆవిడ. ఇద్ద రమూ లేచి లోపలికి నడిచాము.

భోంచేద్దామంటే అప్పటికింకా ఏడుగంటలు కూడా కాలేదు. నిద్రపోవటానిక్కూడా సమయం కాక పోవటంచేత, మరోగంట ఎలా వెళ్లబుచ్చడమా అంటూ ఆలోచించసాగాను.

'అబ్బ, కాళ్ళు పీకుతున్నయ్ ..' అంది సర స్వతి నీరసంగా. నిజమే. ఆమాటకొస్తే నాక్కూడా కాస్త బడలికగానే వుంది.

హార్సిలీ కొండ చూడాలని చాలరోజులనుంచీ అనుకుంటున్నా, పరిస్థితులు అనుకూలించకపోవడం మూలాన ప్రయాణం వాయిదాపడుతూనే వుండేది.

...అసలు ఈ 'హార్సిలీ హిల్స్' అనే పేరు ఇటీవలికాలంనుంచే ఆంధ్రావనిలో వినిపిస్తూంది. ఆంధ్రలో ఒక్కగా నొక్క వేసవి విడిదిగా యిప్పుడే ప్రాముఖ్యత నందుకుంటోంది. మనదేశంలోని అతి సుందరమైన వేసవి విడుదుల్లో ఒకటిగా గణనకు రాకపోయినా, ఊటీ సిమ్లాలవలె ఆడంబరాలను అలం కరించుకోక పోయినా ఒక్కసారైనా వెళ్ళి చూడాలనే కుతూహలం రోజురోజుకీ పెంపొందసాగింది. ఆఖరికి మూడురోజుల సెలవుతో బయలుదేరాం. రైలు కుర బలకోట చేరుకునేటప్పటికి మధ్యాహ్నం పదకొండు గంటలయింది. అక్కణ్ణుంచి బస్సు ప్రయాణం ఎని మిదిమైళ్ళు. కొండ, సమీపిస్తూన్న కొద్దీ దట్ట మైన నీలిమబ్బులాగా కనిపిస్తుంది. ఊడలు దిగిన ఎత్తైన చెట్లు మసకమసకగ్గా కనిపిస్తాయి.

కొండమీదికి నాలుగుమైళ్ల ఇరుకురోడ్డు. రెండు మైళ్ళు ఎక్కిన తర్వాత కాస్త సమతలంగా వుంటుంది. జీపుల్లోకంటే, నడిచి వెళ్లడమే బాగుంటుంది.

ఇలా ప్రయాసతో, పట్టుదలతో కొండలూ పర్వతాలూ ఎక్కడం, శిఖరాగ్రాన్ని చేరుకోవడం దేనికి? చలిగాలి మంచు మొదలైన ఈతిబాధల్ని ఓర్చుకుంటూ అష్టకష్టాలు పడి ప్రపంచంలోని ఉన్నతోన్నత శిఖరాల్ని అధిరోహించడంలోని ఆంతర్యం ఏమిటి? ఇందువల్ల కలిగే ఫలితం ఏమిటి?

ప్రతి వ్యక్తీ తన జీవితాన్ని విజయవంతం చేసు కోవాలనే తాపత్రయపడతాడు. నిజంగా యింతకంటే న్యాయమైన కోర్కె యింకొకటి వుండదు. కానీ యీ కోర్కె నెరవేరడానికి ఎంతో శ్రమ పడవలసి వుంటుంది. ఎన్నో అవాంతరాల్ని దాటాల్సి వుంటుంది. దీని కంతటికీ తగిన సౌశీల్యం, సహనం, సుఖమైనా

దుఃఖమైనా-జయమైనా అపజయమైనా—సమానంగా భావింపగలిగినంతటి మనోదార్ఢ్యం—వీటిని అలవరచుకోవడం చాలా అవసరం. అటుపిమ్మట నెరవేరని ఆశయమంటూ వుండదు. ఎత్తైన పర్వత శిఖరాల్ని చేరుకోవడమనేది ఒక విజయచిహ్నం మాత్రమే! శిఖరాగ్రాన్ని చేరుకోగలమనే ఊహ ఎంతో ఉత్తేజాన్ని, తృప్తిని, ఆనందాన్నీ యిస్తుంది. ప్రతిఫలాపేక్షతో కాకుండా, ఈ సత్యాన్ని దృఢతరం చేయడానికే ఆది నుంచీ ఎందరో సాహసోపేతులైన వ్యక్తులు ఆకాశాన్నంటే శిఖరాలను చేరుకోవడానికి కృషి చేస్తూ వచ్చారు. ఎన్నోసార్లు అపజయం పొందినా, ఆ ప్రయత్నంలో ప్రాణాలు పోగొట్టుకున్నా, వారి కృషికెప్పుడూ భంగం కలుగలేదు.

తలుపు కిర్రుమన్న శబ్దం...

ఆలోచనా స్రవంతికి ఆనకట్ట!

'ఇదిగో బాబూ, పాలు!' అంటూ లోపలికొచ్చాడు బంగాళా వాచ్‌మేన్.

సుమారు ఏభై సంవత్సరాల వయస్సుగల శుష్క శరీరం. సగానికి పైగా నెరసిన వెంట్రుకలు. పైపెదవిని కొద్దిగా కప్పేస్తున్న మీసాలు. బిళ్లగోచీ, బనీను, కండువా, మాసిన తలపాగాతో అతివినయంగా నిలుచున్నాడతను పాలచెంబుతో. మధ్యాహ్నం మేము బంగళాను సమీపిస్తున్నప్పుడు కూడా యిదే వినయంతో మాకు ఎదురువచ్చాడు.

పాలచెంబు కిటికీ దగ్గరున్న బల్లమీద పెడుతూ 'ఇంకా భోంచేయలేదా, బాబూ?' అన్నాడు. ఇతరుల బాగోగులపట్ల ఆసక్తి, సేవాభావం ఆ గొంతులో నిండివున్నాయి.

'ఆకలి కావడంలేదు...ఇబ్బంది అనుకోకుండా ఒక సిగరెట్ ప్యాకెట్ తెస్తావా?' అని అడిగాను, రూపాయికాగితం తీస్తూ, 'అలాగే బాబూ!' అంటూ రూపాయి అందుకుని వెళ్లిపోయాడు.

అతని వాలకం చూస్తుంటే, ఏదో తీరని ఆవేదనను తనకు ప్రసాదింపబడిన యావదైశ్వర్యంగా భావించి భరిస్తున్నట్లు వ్యక్తమౌతోంది. ముడతలు పడ్డ అతని ముఖంలో శాంతము, సహనము మూర్తీభవించివున్నా—ఏవో విషాదచ్ఛాయలు తొంగిచూస్తూవేవున్నాయి. దీనికి కారణం ఏమై వుంటుందని కొంత సేపు ఆలోచించాను.

కొండలూ కోనలూ, జలపాతాలు, పచ్చిక మైదానాలు, నదీతటాలు, సముద్రతీరాలు—ఇలాంటి ప్రకృతి దృశ్యాల కౌగిళ్లలో ఎల్లప్పుడూ సౌందర్యం తాండవిస్తూ వుంటుంది. వీటిని చూచి ముగ్ధులు కావాలనీ, కన్నులపండుగ చేసుకోవాలనీ ఉవ్విళ్లూరుతుంటారు ప్రజలు. పైకంతో కొనలేనిది ఏదీ లేదనుకునే సంపన్నులకు వారి సంపద కూడా యివ్వలేని ఆనందాన్ని, శాంతినీ అందించగలిగిన నందనసీమలు ఈ సుందరప్రదేశాలే! మునుల తపస్సులకు, కవుల వర్ణనలకు, చిత్రకారుల ఆరాధనకు, ఆఖరికి ప్రేయసీ ప్రియుల శృంగార విహారాలకు సైతం యివే కట్టుగట్టులు! ఇక్కడ సౌందర్యానికీ సుఖానికీ తప్ప మరి దేనికీ తావులేదు.

ఇక్కడకూడా ఈ నిరాశాజీవులు ఎలా సృష్టించబడ్డారు ?

* * *

చివరంటూ కాలిన సిగరెట్టు చురుక్కుమని వేలు కరిచింది. భావజగత్తులోనుండి కూలిపడ్డాను.

ఇహ భోంచేదామని మా ఆవిడవైపు చూశాను. ఆవిడకప్పుడే గాఢంగా నిద్రపట్టేసింది. క్రితం రాత్రి రెండుగంటలనుంచీ సామాన్లు సర్దుతూ వుండడంచేత అంతగా బడలిపోయింది. 'సరూ !' అని పిలిచాను. లేవలేదు. నాలుగైదుసార్లు అలా పిలిచి తట్టి లేపడంతో విసుక్కుంటూ లేచి కళ్లు నులుముకుంటూ అలాగే కూచుంది. ఆవిడ మళ్లీ సోలిపోకముందే 'దేవిగారు భోంచేసి పడుకో కూడదా?' అన్నాను.

ఒకసారి ఆవులిస్తూ 'టైమెంతయింది?' అంది.

'తొమ్మిది !...ఆకలిగాలేదా?'

ఆవిడ అతికష్టంమీద ముఖం కడుక్కుని వచ్చేలోగా గ్లాసులో నీళ్లుపోసి, క్యారియర్ తీస్తూ సర్వర్ పనికి సిద్ధపడ్డాను.

'చాల్లే, ఏం పనిది? ఇలాతే!' అంటూ చిరుకోపం నటిస్తూ వడ్డించడం మొదలుపెట్టింది సరూ.

భోజనం పూర్తిచేసి, మూసిన కిటికీదగ్గరగా కుర్చీవేసుకుని 'మామ్' నవల తీసుకున్నాను.

పదిహేను పేజీలు చదివేలోగా 'చదవడం యిక చాలు. రేపు చదవొచ్చు.' అంటూ నిద్ర కళ్లతో ఓవల్టీన్ అందించింది సరూ.

'చాలా నీరసంగావున్నావు సరూ!' అన్నాను గ్లాసు అందుకుంటూ.

'అబ్బే, ఏంలేదు. తెల్లవారితే అంతా సరి పోతుంది' అంటూ పక్కమీదికి వెళ్లి పడుకుంది. ఆవిడకు నిద్రాభంగం కలుగకూడదని లైటు ఆర్పి మళ్లీ కుర్చీలో కూర్చున్నాను.

గదంతా చీకటి. ఏమీ తోచడం లేదు. లేచి చప్పుడు కాకుండా కిటికీ తెరిచాను. కిటికీగుండా చల్లని తెల్లని వెన్నెల గదిలోకి చొచ్చుకుని వచ్చింది. బయట ప్రశాంతత వెల్లివిరుస్తోంది. పూలమొక్కలు నిద్రపోతున్నాయి. చెట్లకొమ్మలు మెల్లమెల్లగా కదుల్తూ ఒకదానికొకటి తాకుతూ విడిపోతున్నాయి. ఆకాశంలో చంద్రుడు చిన్నిచిన్ని మబ్బులతో దాగుడు మూత లాడుతున్నాడు. దూరాన్నించి కీచురాళ్ల రొద అరిగి పోయిన గ్రామఫోనుపాటలా వినబడుతోంది.

ఈ రామణీయకతను తిలకిస్తూ యింకా కాసేపు మేల్కొనివుందామనుకుంటూవుండగా, సిగ రెట్టు జ్ఞాపకానికొచ్చింది. గంటన్నరక్రితం సిగ రెట్టుకని వెళ్లిన మనిషి యింకా రాలేదు. దుకాణం దగ్గర్లోనే కదా వుంది! బహుశా మరిచిపోయి వుంటా డేమో—అనుకున్నా.

ఇంతలో తలుపు నెట్టిన శబ్దం!

'క్షమించాలి బాబూ' ఆలస్యమయింది...... ఇంట్లో చంటిబిడ్డకు జ్వరం తగిలి మూడు రోజులైంది. చావుబ్రతుకుల్లో వుంది. ఆ పిల్ల తల్లి దిగులుపడి ఏడుస్తుంటే, దాన్ని ఓదా ర్చుతూ మీ సిగరెట్టు సంగతి మరిచిపోయాను...' అంటూ పొంగివచ్చే దుఃఖాన్ని ఆపుకుంటూ నేల మీద కూలిపడబోయాడు. గబాలున లేచి అతన్ని పట్టుకోగలిగాను. మెల్లగా అతన్ని కుర్చీలో కూచోబెట్ట డానికి ప్రయత్నించాను.

'వొద్దు బాబూ, వొద్దు' అంటూ నేలమీద కూర్చుని వెక్కివెక్కి ఏడువసాగాడు. కిటికీ వెలుతు రులో అతని కళ్లలోని నీటిబిందువుల్ని స్పష్టంగా చూడగలిగాను. అతన్ని చూస్తే, రెండు రోజులనుంచీ మంచినీళ్లు కూడా ముట్టుకోలేదని తెలుస్తోంది. క్యారియరులో అన్నం యింకా మిగిలుంది. కాస్త తిన మంటే ససేమిరా వద్దన్నాడు. బలవంతంమీద ఫ్లాస్కులో మిగిలిన గుక్కెడు ఓవల్టీన్ త్రాగించాను. కొంతసేపటికి కుదుటబడ్డాడతను.

'నే నెప్పుడూ యిలా అధైర్యపడలేదు. ఎన్ని కష్టాలున్నా భరించేవాడిని. ఎన్ని రోజులన్నా పస్తుండ గలను. కానీ ఆ పసికందు...దానిమీద నాకు పంచ ప్రాణాలు...అది దక్కకుంటే...' అంటూ కండువా మడిచి నోట్లో పెట్టుకుని మళ్లీ ఏడుపు ఆపుకో ప్రయత్నించాడు. అతన్ని ఓదార్చటం ఎలాగో తెలీక మౌనంగా చూస్తూ వుండిపోయాను. కొంతసేపటికి తేరుకుని 'వెడతాను బాబూ! మీకు శ్రమ కలి గించాను. ఇక పడుకోండి...' అంటూ పైకి లేవ బోయాడు.

ఎంత నిబ్బరం! అంతటి దీనస్థితిలో కూడా ఎప్పటి ధోరణిలోనే మాట్లాడగలగడం చూసి ఆశ్చర్య పడ్డాను. అతన్ని గురించి తెలుసుకోవాలనిపించింది.

'అయ్యో! అధైర్య పడకు. కష్టాలు వస్తుం టాయి, పోతుంటాయి వాటి అలజడికి తట్టుకో గలిగినవాడే మనిషి! పెద్దవాడివి, నీకు తెలియం దేముంది? ఒకరి కష్టాలు ఒకరితో చెప్పుకుంటే గుండె బరువైనా తగ్గుతుంది. అసలింతకూ నీపేరైనా తెలుసుకోలేదు నేను. ఏ వూరు మీది?' అని అడి గాను, వెళ్లబోతున్నవాణ్ణి వారిస్తూ.

'బాబూ! ఈ దౌర్భాగ్యుడి వూరూ పేరూ తెలుసుకున్నందువల్ల మీకేం లాభం? అయినా నామీద యింత దయ చూపిస్తున్నందుకు నాకు నిజంగా సంతోషంగా వుంది. నా పేరు నారాయణయ్య. అందరూ నారయ్య అనే పిలుస్తారు. మాది యిక్కడే మదనపల్లె దగ్గర ఓ పల్లెటూరు...' అంటూ తన చరిత్ర చెప్పుకొచ్చాడతను.

మామూలు కథే!

అతని తండ్రికి ఆ పల్లెటూళ్లో చక్కని పొలం వుండేది. ఏ కొరతా లేకుండా బ్రతికారు. కానీ నారయ్య తల్లి చనిపోయినప్పటినుంచీ అతని తండ్రికి జీవితంపట్ల ఆసక్తి నశించింది. జూదం అలవాటు చేసుకుని అప్పుల పాలయ్యాడు. చివరికి పన్నెండేళ్లయినా నిండని నారయ్యను ఒంటరిగా వదిలేసి కన్ను మూశాడు. అప్పటినుంచీ నారయ్య కష్టజీవుల జాబితాలో చేరిపోయాడు. చదువు సంధ్యలకు నోచుకోలేదు. ఆ వూళ్లోనే కూలీ నాలీ చేసుకుంటూ, పశువుల్ని కాస్తూ పెరిగి పెద్దవాడయ్యాడు. ఇరవైఏళ్ల వయస్సులో ఫారెస్టు వాచర్‌గా నౌకరీ సంపాదించాడు. ఒక పేదింటి పిల్లను పెళ్లాడి సంసారయాత్ర ప్రారంభించాడు. ఇద్దరు కూతుళ్లూ, ఒక కొడుకూ కలిగారు. పెద్దపిల్లకు పెళ్లయింది. ఒక చంటిపిల్ల కూడాను. కాని ఆమె పెనిమిటి పచ్చితాగుబోతు. అతడు పెట్టే యమయాతన భరించలేక పుట్టింటికి కొచ్చేసింది. తానెన్ని కష్టాలనుభవించినా, తన పిల్లలు సుఖంగా వుండాలని వెయ్యి దేవుళ్లకు మొక్కేవాడు నారయ్య. తన పెద్దకూతురు బ్రతుకిలా బండలు కావడంతో అతడెంతో కృంగిపోయాడు. రెండోపిల్ల పెళ్లి కెదిగింది. ఇక కొడుకు సంగతి చూస్తే, వాడి చదువు చట్టుబండలైంది. పదహారేండ్లు పైన వేసుకుని, పగ్గంతెగిన ఆబోతులా తిరుగుతున్నాడు. ఎప్పటికైనా ఈ కష్టాలన్నీ గడిచి గట్టున పడగలననే నమ్మకంతో ప్రాణాలు చిక్కబట్టుకుని బ్రతుకుతున్నాడు నారయ్య...

నారయ్య వెళ్లిపోయి చాలా సేపయింది.

నాకు నిద్రపట్టలేదు.

అతడు చెప్పుకొచ్చిన ప్రతివిషయాన్నీ పదేపదే నెమరు వేసుకుంటూ చీకట్లోనే కూర్చున్నాను.

ఆ చీకట్లోనే విన్నాను, అతని వృత్తాంతమంతా ఇలాంటి కథలలోని విషాద వాహినులను దర్శించడానికి వెలుతురు అక్కర్లేదు. హృదయంలోని చిన్న దీపకళిక చాలు!

నారయ్య తెచ్చిన సిగరెట్ ప్యాకెట్‌లో ఒక్క సిగరెట్టు మాత్రమే మిగిలింది. ఆఖరుసారిగా దాన్ని పీలుస్తూంటే, నారయ్యవంటి దౌర్భాగ్యుల కష్టాలన్నిటికీ కారణం—ఆర్థిక దురవస్థే ననిపించింది. అది తొలగిపోయిననాడు భౌతిక జీవితంలో దుఃఖమంటూ వుండదు.

లోకంలో అందరూ డబ్బు సంపాదించ గలిగితే ఎంత బాగుణ్ణు!

అయితే అందరూ సంపాదించలేరు.

కొందరే!

ఈ కొందరిలో రెండు తెగలు. 'ధన మూలమిదం జగత్' అనే ఆశయంతో తనకోసం సంపాదించే వాళ్లు కొందరు. 'త్యాగయా సాంభృతార్జయాత్' అనే ఆశయంతో పదిమందికోసం సంపాదించే వాళ్లు కొందరు. ఈ రెండో సూక్తిని శిరసావహించి శక్తివంచనలేకుండా కష్టపడి ధనరాసుల్ని పోగుచేస్తూ తమ జీవితాలను దేశసేవకు అంకితం చేయగలిగిన మహాత్ములే ప్రత్యక్ష దైవాలు! అటువంటి ఉద్ధారకులు కొందరున్నా చాలు, దేశంలో కష్టాలుండవు!...

* * *

'ఎనిమిది కావస్తూంటే, యింకా ఏమిటీ నిద్ర? లే!' అన్నమాటలు ఎక్కడో మరో లోకంనుంచి వినిపించినట్లయింది. మా ఆవిడ చేతిగాజులు చెవుల్లో స్వరాలు పలుకుతూంటే, కళ్లు తెరిచి చూశాను.

'లే, స్నానం చేద్దువుగానీ!' అంది మందహాసంతో.

'రాత్రంతా నిద్రపోలేదు. నువ్వు లేపకుండా వుంటే, పదిగంటలదాకా పడుకుని వుండేవాణ్ణి.' అన్నాను, లేచి కూర్చుంటూ.

'ఎలా పడుతుందీ నిద్ర?...ఇంకో ప్యాకెట్టు సిగరెట్లు కాల్చలేక పోయావ్?' అంటూ టూత్ బ్రష్ అందించింది.

స్నాన పానాదులన్నీ ముగిసిన తర్వాత, నారయ్య దుస్థితిని గురించి చెబుతున్నాను సరస్వతితో. ఇంతలో ఒక జీపు బంగళాముందు ఆగింది. వాకిలిగుండా చూశాను. నీలిరంగు సూటులోవున్న యువకుడొకడు, ఓ పాతికేళ్ల అప్సరసా జీపులోంచి దిగారు. వారి

వెంట తోడేల్లాంటి కుక్క ఒకటుంది. నౌకరుకూడా వున్నాడు. నౌకరు సామాన్లను ఒక్కటొక్కటే దించే సరికి నారయ్య పరిగెత్తుకుంటూ వొచ్చి పక్కగది తాళాలు తీశాడు. వాళ్ళంతా లోపలికి వెళ్ళారు.

అప్పటినుంచీ ఓ అరగంటదాకా ఏవేవో మాటలు వినిపిస్తూనే వున్నాయి. ఒక్కోసారి బిగ్గరగా మాట్లాడుతున్నారు.

'చూడండీ, గోపీ చాలా అలసిపోయాడు... రంగా! గోపీకి పాలు తాపు...' అంటోందా స్త్రీ కంఠం.

'రంగా! ముందు భోజనం సిద్ధంచెయ్యి. తొందరగా భోంచేసి, విశ్రాంతి తీసుకోవాలి' అంటున్నాడా యువకుడు.

'వాళ్ళవెంట చిన్న పిల్లలెవరూ లేరే...మరి గోపీ గోపీ అని ఎవర్ని పిలుస్తున్నారు? అంటూ నా వైపు చూసింది సరస్వతి.

'సరిగ్గా నీ సందేహమే నాకూ పట్టుకుంది. చూద్దాం, వుండు...' అంటూ లేచివెళ్ళి వాకిట్లో నుంచున్నాను. అతడు వరండాలో నిలుచుని, అక్కడి పూల మొక్కల్ని, క్రింద తమ జీపు ప్రయాణించిన రోడ్డుని తిలకిస్తున్నాడు.

ఆశ్చర్యం!

ఎవరతను? నా బాల్య మిత్రుడు పరశురామేనా?!

వెంటనే 'పరశురాం!' అని పిలిచాను.

అతను వెనక్కి తిరిగి చూశాడు.

'అరె!...శంకరం!...ఎక్కడున్నావురా? తమాషాగా వుందే! రారా లోపలికి!' అంటూ తుఫానులా వచ్చి మీదపడి, అమాంతంగా లోపలికి లాక్కెళ్ళాడు.

'శాంతా! వీడెవడో తెలుసా? నా బాల్య స్నేహితుడు—శంకరం! ప్రస్తుతం రైల్వేగార్డుగా వుంటున్నాడు...కదూ, ఒరేయ్? ఇవిడ నా భార్య.'

తల వూపాడు.

'నమస్తే!' అందామె చిరునవ్వు ఒలకబోస్తూ.

రెండు చేతులూ జోడించి ఆమెకు ప్రతి నమస్కారంచేస్తూ 'ఉండండి, మా ఆవిణ్ణి తీసుకొస్తాను...' అన్నాను.

...నేనూ పరశురాం—కలిసి చదువుకున్నాం. ఉదర పోషణార్థం నేను రైల్వేలో చేరాను. అతను మాత్రం బి. కాం. చదువుకుని విశాఖపట్నంలో ఏదో బ్యాంకులో చేరాడు. మంచి అందగాడు. ఎదుటి వ్యక్తుల్ని యిట్టే ఆకర్షించగల మాట తీరు వున్నవాడు. బ్యాంకు ప్రొప్రయిటరుగారమ్మాయి రూపంలో అదృష్టం కలిసొచ్చింది. ఆమె హృదయాన్ని దోచుకున్నాడు. ఆమెను పెళ్ళి చేసుకున్నాడు. అతడిప్పుడు ఆ బ్యాంకు మేనేజరు...

మా ఆవిణ్ణి తీసుకొచ్చి పరిచయం చేయబోయాను. పరిచయం చేసుకోవడమనే అనుభవం ఆవిడకిదే మొదటిది కావటంచేత సిగ్గుతో తలవంచుకొంది. కాస్త సిగ్గయినా తొలగించాలని 'సరూ! వీరు మన స్నేహితులు. వీరికి మనమంటే చాల అభిమానం. వీరికి నమస్కరించు!' అన్నాను. ఆమె తలనొంచుకుని 'నమస్కారం అన్నయ్యా!...నమస్కారం అక్కయ్యా!' అంది.

పాపం, ఆమె పరిస్థితి నాకు జాలి గొలిపింది. సిగ్గుతో సతమతమౌతూన్న అమాయకురాలిచేత సంస్కారం పేరిట అలవాటులేని పని చేయించినందుకు నేనే లోలోపల సిగ్గుపడ్డాను.

'అలా నిల్చున్నారేం, కూర్చోండి!' అని ఆతనంటూవుంటే సరస్వతి సంకోచిస్తూ వుంది. 'పర్వాలేదులే చెల్లాయ్, కూర్చో!' అన్నాడతను. ఆవిడ కూర్చోక తప్పింది కాదు. నలుగురం సోఫాల్లో కూర్చున్న పిమ్మట నౌకరు కమ్మని కాఫీ అందించాడు.

'ఈ వేళ కిక్కడే భోంచేయాలి అందరూ. తెలిసిందా?' అన్నాడు పరశురాం. పద్దంటే విడిచిపెట్టడు గనుక కాదనలేకపోయాము. భోజనం రెడీ కావటానికి మరో గంటయినా పట్టవచ్చు. ఆతోగా

శాశ్వతానికి పూనుకున్నాం. సరస్వతి మాత్రం వంచిన తల ఎత్తడంలేదు.

మా సంభాషణ ఒక చిన్న సభగా తయారయింది. రాజకీయాలు, సినిమాలు, పత్రికలు, స్త్రీ స్వాతంత్ర్యం, సంస్కృతి, అలంకారాలు, ఆదర్శాలు... ఒక్కటా? లెక్కలేనన్ని విషయాలు!

మా సంభాషణలో శ్రీమతి రాధాదేవిదే పైచేయి!

'ఈ నవనాగరిక యుగంలో కూడా స్త్రీలు వంటింట్లో దాసీల్లాగా పడివుండడం చాలా శోచనీయం. మన స్త్రీలు పొద్దస్తమానము భర్తకు, పిల్లలకు వెట్టిచాకిరీచేస్తూ, సంస్కారం లేక తమ జీవితాల్ని వ్యర్థం చేసుకుంటున్నారు...

'స్త్రీ అంటే ఒక ఆటవస్తువుగా భావించే రోజులు గతించాయి. స్త్రీకి కూడా ఆశయాలూ అభిరుచులూ వుంటాయి. జీవితమంతా ఊడిగంతో గడుపుతూంటే, ఆమె ఆశయాలు కార్యరూపం పొందేదెల్లాగు?...'

సరస్వతి నా వైపు అయోమయంగా చూస్తున్నదల్లా, 'వింటున్నారా సరస్వతిగారూ!' అన్న రాధాదేవిగారి పిలుపుకి ఉలికిపడింది.

'పాశ్చాత్యదేశాల్లో స్త్రీలు మనకంటే ఎంతో ముందుకుపోయారు. అసలు వాళ్ల దేశాల్లో పిల్లలకి తల్లితో ఎట్టి సంబంధమూ వుండదు. పిల్లల్ని కని పెట్టుకుని వుండటానికి ప్రత్యేకమైన నర్సులు వుంటారు. వంటచేయటం, బట్టలుతకటం వగైరా అసభ్యకరమైన పనులు వాళ్లకు లేవు. వాళ్లెప్పుడూ శుభ్రంగా వుంటూ, చిత్తం వచ్చినట్లు తిరుగుతూంటారు. అక్కడివాళ్లు తమ విలువైన కాలాన్ని సద్వినియోగం చేసుకోటానికి స్నేహితులతో కలిసి క్లబ్బులకు వెళ్లవచ్చు. ఆ దేశాల స్త్రీలను చూసి మనం నేర్చుకోవలసింది ఎంతో వుంది...'

ఆమె వాగ్ధాటికి అబ్బురపడుతూ, బెల్లం కొట్టిన రాయిలా కూర్చున్నాను. పాశ్చాత్య దేశాల స్త్రీలను గురించి పాశ్చాత్యులకంటే ఎక్కువగా తెలుసుకోవడం నోటిమాటలా?

'ఆదర్శాలు ఒక్క పురుషులకేనా? స్త్రీలకూ వుండొచ్చు సవాలక్ష! మాట వచ్చింది కనుక చెబుతున్నాను. నేను మాత్రం, చచ్చినా నా ఆదర్శాలను చంపుకోను. నామటుకు నేను సౌందర్యమంటే పడిచస్తాను. అందాల పోటీలంటే నాకు ఆరో ప్రాణం. బొంబాయిలో జరిగే కుక్కల అందాల పోటీలో ప్రతిసారీ పాల్గొంటాను. ఈఏడు గోపీని తీసుకువెళుతున్నాను. మా గోపీ మీకు నచ్చాడా?' అంటూ తనకు దగ్గరగా కూర్చున్న కుక్కవైపు చూసింది రాధాదేవి.

సరస్వతి కళ్లు ఆశ్చర్యంతో వేగుచుక్కల్లా వెలిగాయి.

నా దృష్టి కాస్సేపు కుక్కమీద నిలిచింది. అది నా వైపు తీక్షణంగా చూస్తోంది. ఏ క్షణాన్నయినా ఎగిరి మీద పడేటట్టుంది.

గోపీని మాతో కరస్పర్శ చెయ్యమంది రాధాదేవి. వెంటనే ఆ కుక్కలేచి తన ముంగాలిని నా చేతిలోవుంచి, మళ్లీ యథాస్థానంలో కూర్చుంది.

'కుక్కలు ఎట్టి కష్టాలయినా ఎదుర్కోగలవు. ఇవి ఆకలి బాధనుసైతం లెక్కచేయకుండా తిరుగుతూ వుండగలవు. మనలాంటి చదువుకున్న వ్యక్తులు కుక్కల్ని పెంచడం ఎంతో ముఖ్యం.'

మనుష్యులకు వర్తింపజేసుకుంటే, కుక్కల్ని గురించి ఆమె చెప్పిన మాట అక్షరాలా నిజం. ఆకలితో బాధపడే మనుషులు కూడా ఆకలి బాధను సహించడం ఒక్కటే పరిష్కార మార్గం. మానవుడు యుగాల తరబడి కరువు కాటకాల్లో ఆకటిచిచ్చును చల్లార్చుకోవటానికి ఈ మార్గాన్నే అవలంబిస్తున్నాడు కదా!

సరిగ్గా ఈ సమయానికే ఆకలి కొద్ది కొద్దిగా కట్టుత్రాళ్లు విప్పుకుంటోంది. పన్నెండు గంటల కల్లా భోజనం సిద్ధమైంది.

తాంబూలాలు వేసుకుని మా గదిలోకివెళ్లి

కాస్త విశ్రాంతి తీసుకున్నాము. సాయంత్రం ప్రయాణ సన్నాహాలు పూర్తి చేసుకుని, సెలవు తీసుకుందామని పరశురాం వద్దకు వెళ్ళాను. 'ఏమంత తొందర? ఎల్లుండిదాకా మాతో కలిసి వుండలేవూ?' అన్నాడు. మరోలా అనుకోవద్దని, మరునాటి ఉదయమే డ్యూటీలో చేరాలని చెప్పగా సరే నన్నాడు. తనే మమ్మల్ని జీపులో స్టేషన్‌దాకా తీసుకెళ్లి దిగవిడిచి వస్తానన్నాడు.

చల్లని సంజవేళ జీపులో కూర్చున్నాం ముగ్గురం. వెనక మా ఆవిడ, ముందు సీట్లో మే మిద్దరిమూను. నారయ్య మమ్మల్నిచూస్తూ కొద్ది దూరంలో నుంచున్నాడు. అతన్ని దగ్గరకు పిలిచి ఐదు రూపాయలివ్వబోయాను. తీసుకోవటానికి వెనకాడుతూ 'నా కెందుకు బాబూ?' అన్నాడు. బలవంతాన అతని చేతిలో పెట్టాను.

'పాపకెలా వుంది నారయ్యా?'

'అలాగే వుంది బాబూ!'

జీపు బయలుదేరుతుండగా రెండు చేతులూ జోడించాడు నారయ్య.

అతడి పంచప్రాణాలూ అయిన ఆ చంటిపిల్ల జబ్బు నయమవుతుందో, కాదో?

అతడి పెద్దకూతురు కాపురం బాగుపడుతుందో, లేదో?

చిన్నమ్మాయి పెళ్లి చేస్తాడో, చెయ్యలేడో?

అతడి కొడుకు ప్రయోజకుడు కాగలడో, లేడో?

కష్టాలు గడిచి గట్టెక్కుతాడో, లేక ఆ కష్టాల్లోనే మునిగిపోతాడో?

అన్నీ ప్రశ్నలే!

ఈ ప్రశ్నలన్నిటికీ సరైన సమాధానాలు చెప్పుకోగలనా నేను?

జీపు కొండదిగి లోయలో పయనిస్తోంది. అక్కడక్కడా పాత రోడ్డు స్థానంలో కొత్త రోడ్డు వేస్తున్నారు. మిట్టపల్లాలు ఏకం చేస్తున్నారు. రాళ్లను పగల గొడుతున్నారు. వీళ్లంతా కష్టజీవులు! పొద్దస్తమానమూ శ్రమిస్తున్నా, వీరిలో ఏ ఒక్కరూ గొప్పవారు కాలేకపోతున్నారు. పోనీ, ఈ బాహిరదృష్టికి వీరి ఔన్నత్యమైనా అవుపిస్తున్నదా? లేదు! ఇదే ఒక సినిమాలోనైతే వీరిని చూచి అంతా జాలిపడేవారే! కవులకైతే వీరి శ్రమను గుర్తించామన్నందుకు తాపీగా ఓ కథో, ఖండకావ్యమో రాసేవాళ్లే! కానీ ప్రత్యక్షంగా చూచిన వాళ్లందరూ వీరిని చూచీ చూడనట్లు, తామరాకుమీద నీటి బొట్టులా అంటీ అంటనట్లు వుంటారు. నకిలీ దైన్యంపట్ల వున్నంత అనుకంప ప్రత్యక్షదైన్యంపట్ల లేదు. ప్రపంచంలో యింతకంటే ఆత్మద్రోహం మరొకటి వుండదు.

కష్టజీవులే. ప్రపంచానికి కొత్త దారులు చూపించారు. పైరుపచ్చల్ని సృష్టించారు. పట్టణాలను నిర్మించారు. దేవాలయాలూ దుర్గాలూ కట్టారు. మహానదులను లొంగదీసి ఆనకట్టలు వేశారు. వీరు స్వార్థరహితులు. త్యాగధనులు. లోకకల్యాణానికి అఖండ జ్యోతుల్ని వెలిగించడం, ఆ జ్యోతులకు తాము వత్తులై కాలి నుసియై పోవడం—యిదే వీరి చరిత్ర! అందుకేనేమో, విశ్వకవి అన్నాడు—శ్రమలోనే భగవంతు డున్నాడని!

'ఏమిట్రా, అంత గాఢంగా ఆలోచిస్తున్నావ్?' అన్నాడు పరశురాం.

'కష్టసుఖాలను గురించి.'

'ఏముంది వాటిని గురించి ఆలోచించటానికి?'

'ఏమీ లేదా?'

పరశురాం నవ్వాడు.

'నువ్వు అదృష్టవంతుడివి పరశురాం!' అన్నాను.

'ఎందుకూ?'

'కష్టసుఖాలు ఆలోచనలోకి రానంత సుఖంగా బ్రతుకుతున్నావ్. ప్రతివాడూ నీయంత సుఖంగా వుంటే బాగుండును.'

పరశురాం ముఖంలో మళ్లీ అదే నవ్వు. అతడు నిశ్చలంగా యిలా చెప్పసాగాడు.

'శంకరం! జీవితంలో సుఖపడటం, కష్టపడటం—వీటికి నిజంగా ఎలాంటి ప్రాముఖ్యతా యివ్వ తాడు. ప్రపంచంలో ఎక్కడైనాసరే, మంచీ చెడూ దూరదూరంగా లేవు. రెండూ పక్కపక్కనే వుంటాయి. హాలాహలం లేకుండా అమృతం పుట్టదు. నీడ పడకుండా దీపం వెలగదు. శిఖరాలు లేకుండా లోయలుండవు. జీవితంలో కష్టసుఖాలు కూడా యింతే! అయితే మనిషికి అసంతృప్తి సహజం. ఈ అసంతృప్తికి కారణం—ఒకరు యితరుల కష్టాలను తెలుసుకోటానికి బదులు తమతమ సుఖదుఃఖాలనే సాక్ష్యంగా తీసుకుని ఎవరికి తోచిన అభిప్రాయాలను వారు ఏర్పరచుకోవడమే! నా విషయంలో నీ అంచనా తప్పు. మా ఆవిడ వాలకం చూశావు గదా?.. భార్యాభర్తల ప్రేమానురాగాలమీద నాకు నమ్మకంలేదు. ఇది నా వ్యక్తిగతాభిప్రాయం మాత్రమే సుమా!...అయితే నా మనస్సుకు ఎలాంటి బాధా లేదు. నా అనుభవంలో జీవితాన్ని గురించి నేను తెలుసుకున్నదల్లా ఒక్కటే...

'జీవితమనేది అత్యంత సుందరమైనది. సుఖమైనా, కష్టమైనా — అనుభవించటానికే కష్టాలున్నాయని ఈ అందమైన జైలులోంచి పారిపోలేము గదా? మనిషి సుఖదుఃఖాలను సమన్వయం చేసుకున్నప్పుడే జీవితానికి నిండుదనం!'

స్టేషన్ చేరుకునేసరికి పొద్దుపోయింది.

మరో పది నిమిషాల తరవాత 'వెళ్లొస్తాను శంకరం! అప్పుడప్పుడూ ఉత్తరాలు రాస్తూండు'... అంటూ నన్ను గాఢంగా ఆలింగనం చేసుకొన్నాడు పరశురాం. 'వెళ్లొస్తానమ్మా చెల్లాయ్' అంటూ జీపు పోనిచ్చాడు.

'చిత్రమైనవాళ్లే యిద్దరూ!' అంటూ బుగ్గ నొక్కుకుంది సరస్వతి.

కొద్ది క్షణాల్లోనే కనుచూపు మేర దాటిపోయింది జీపు. జీవితానికి ప్రతికృతిలా దూరంగా వెన్నెల ఒడిలో లోయలూ, శిఖరాలు!



సినిమా సంగీతం:
శ్రీ పెండ్యాలతో శ్రీనివాస్ గోష్ఠి

సంగీత శాస్త్రంలో పాండిత్యాన్ని సంపాదించిన కొద్దిమంది సంగీత దర్శకులలో పెండ్యాల నాగేశ్వర రావుగారు ఒకరు. 'స్వరం, స్వరక్రమం, స్వరసమ్మేళనం' యొక్క ఔచిత్యాన్ని, సినిమా సంగీతంలో వాటిని వుపయోగించే పద్ధతిని ఆయన వివరించారు. సినిమా సంగీతం ఎలా వుండాలి, ఎలా వున్నది, ఏ రకం జనాకర్షణీయంగా వున్నది అనే సంగతులపై ఆయన కొన్ని అభిప్రాయాలను వెలిబుచ్చారు.

పాశ్చాత్య సంగీత ప్రభావం ఎంతవరకు మన చిత్రాలపై పని చేస్తున్నదో కూడా ఆయన చెప్పారు. గాత్ర సంగీత ప్రాధాన్యత, వాద్య సంగీత విశిష్టతను గూర్చికూడా ఆయన కొంత చర్చించారు.

సంగీతంగూర్చి ఏర్పడిన కొన్ని సంశయాలకు పెండ్యాల విపులంగా, వివరంగా సమాధానాలు యిచ్చారు.

* * *

ప్ర. భారతీయ సంగీతంలో స్వరాలక్రమం, (Melody) ప్రధానం. మీ వ్యాఖ్య?

జ: నిజమే. స్వరం, అంటే స్వకీయముగా రంజింప చేయునది, అని అర్థము. అట్టి అనేక స్వరముల కలయికతోనే రక్తి సృష్టింపబడింది. ఆ కలయికను శాస్త్రకారులు 72 మేళకర్తలుగా విభజించారు. ఆ మేళకర్తలద్వారా శాస్త్రీయ పద్ధతిన ఆరాధించి, అనేక వేల మేళములను (Permitations and combinations) ద్వారా విభజించి, వానికి 'రాగములు' అని పేరుపెట్టారు. రాగము అంటే రసమునుండి పయనించునది అని అర్థము చెప్పుకొన వచ్చును. ఆ రాగముల, స్వరముల ద్వారా అనుభవైక వేద్యములైన గుణములనుచూచి, వాటికి వివిధము లైన నామకరణములు చేశారు. ఉదాహరణకు: 'శంకరాభరణము—శంకరునికి ఆభరణము వంటిది. స్వరముతో పోల్చుకొనవచ్చును. 'హంసధ్వని—హంసధ్వని, ఆ రాగములో వుంటుందన్న మాట. 'షణ్ముఖప్రియ'—కుమారస్వామికి ప్రియమైనది. 'కల్యాణి'—శుభప్రదమైనది. ఇలా ఏదో ఒక గుణమును ప్రతిరాగముతోను అనుభవైక వేద్యముగా దర్శించి, నిర్ణయించారు.

ఇతర ప్రక్రియల అవసరం లేకుండా, స్వయం సమర్థములైన రాగముల ద్వారా రక్తిని సాధించినందువల్ల, భారతీయ సంగీతంలో స్వరయుక్తమైన 'రాగమే' ప్రధానాంశమైనది.

ప్ర: సినిమా సంగీతంలో మాత్రం, స్వరాల సమ్మేళనం (Harmony) ప్రధానం. అయినా గాత్రం లేని సినిమా సంగీతం లేదనవచ్చును. రేడియోలో కూడా ఎక్కువ భాగం గాత్ర సంగీతమే సినిమా సంగీతంగా వినిపిస్తుంది. దీనికి కారణం ఏమిటి?

జ: సినిమా సంగీతానికి వైవిధ్యం (Variety) ముఖ్యం గనుక, పాశ్చాత్య సాంప్రదాయమైన 'హార్మనీ' వివిధ వాద్య సమ్మేళన (Orchestration) ద్వారా సాధించి ఆ వైవిధ్యాన్ని అందచేస్తున్నారు. గాత్రంలేని సినిమా సంగీతమే గాదు, ఏ శాస్త్రీయ సంగీతం కూడా లేదనవచ్చు. సంగీతానికి ప్రధానాంగం గాత్రమే. గాత్రమున పలికిన భావములు ఏ వాద్యములోను పలకవు. సంగీతానికి గాత్రం రాజైతే, వాద్యములు పరివారములు. అదీకాక, సంగీతమునకు సాహిత్యమునకు అవినాభావ సంబంధము. అయితే, సాహిత్యము లేనిదే సంగీతములేదు అని ఏమియు లేదు; కాని సినిమాలలో, రేడియోలలో మనం వినేది, సంగీతముద్వారా గేయమే కనుక, గేయములోని భావము ఉచ్చారణ ద్వారానే తెలియును కనుక, దానికి ఆధారము గాత్రమే కనుక,

మనము సినిమాలతో, రేడియోలతో గాత్రము ద్వారానే సంగీతం వింటున్నాము. విదేశీ చిత్రాలలో ప్రత్యేకంగా 'సంగీత చిత్రాలు' తీస్తారు. అప్పుడు మాత్రమే పాట లుపయోగిస్తారు వారు. మామూలుగా చిత్రాలు తీసినపుడు—ఆ దృశ్యా న్ననుసరించి నేపథ్య సంగీతమే వాడబడుతుంది. వివిధ వాద్య సమ్మేళనతో అదే వారికి ముఖ్యం. మన భారతీయ సంగీతంలో రాగభావ తాళయుక్తమైన సాహిత్యం మాధుర్యమైన బాణీ (Tunes) ల ద్వారా పాడటమే ప్రత్యేకత.

ప్ర : మొత్తంమీద తెలుగు సినిమాలలో ఏ ప్రాంతం, లేక దేశంయొక్క ప్రభావం ఎక్కువ?

జ : మన ఆంధ్ర నాటకరంగం సంగీతపరంగా వుచ్ఛదశలోవున్న రోజులనుండికూడా మహారాష్ట్ర సంగీత ప్రభావం మన సంగీతంపై వున్నది. అది హిందూస్థానీ శాస్త్రీయ సంగీతమునుండి వుద్భవించినది. అది లలితమై సుశ్రావ్యమై, సులభ సాధ్యమైనందువల్ల—ముందుగా మన తెలుగు నాటకరంగంపై, తదుపరి ఇతర దక్షిణ రాష్ట్రాలపై తన ప్రభావం చూపింది. బెంగాలీ సంగీతంకూడా కొద్దిగా చోటు చేసుకుంది. మన చిత్రాల సంగీతానికి నాంది—నాటకరంగమే కనుక సహజంగానే ఆ రాష్ట్రాల సంగీతపు ప్రభావం మన చిత్రాలపై వున్నది. ఇవిగాక, ఇటీవల కాలంలో హిందీ చిత్రాలద్వారా పంజాబీ జానపద (ఫోక్‌లోర్ మూసిక్) సంగీతంకూడా మన చిత్రాలలో ప్రవేశపెట్టబడింది. ముఖ్యంగా ఢోలిక, ఆ రాష్ట్రపు వాద్య విశేషము.

ప్ర : తెలుగుదేశంలోని జానపద సంగీతాన్ని తెలుగు సినిమా సంగీత దర్శకులు ఎవరు, ఎందుకు, ఎక్కువగా వాడుతుంటారు?

జ : జానపద సంగీతం ముఖ్యంగా శ్రోతలకు తేలికగా నోటికి పట్టుబడి, తిరిగి పాడుకోవడానికి వీలుగా, వున్న బాణీలు, సాహిత్యముకల్గి యున్నందువనూ, తెలుగు ప్రజలు అట్టిపాటలు సినిమాలలో వినేసరికి, ఏదో తమకు ఆత్మీయమైన పాట వింటున్న అనుభూతినిపొంది, తిరిగి, తిరిగి, మళ్లీ, మళ్లీ చిత్రాలు చూస్తున్నందువనూ, విధిగా అలాంటి పాటలు దాదాపు ప్రతిచిత్రంలోనూ ఒకటి, రెండైనా ప్రవేశపెడుతున్నారు సంగీత దర్శకులందరూ, సన్నివేశాలు అనుమతిస్తే.

ప్ర : మన చిత్రాలలో పాశ్చాత్య సంగీత ప్రభావం ఎంతవరకు వున్నది?

జ : మన తెలుగు చిత్రాలలో పాశ్చాత్య సంగీత ప్రభావం బాగానే వున్నదని చెప్పాలి. అసలు ఈ సంగీతపు ప్రభావం ప్రప్రథమంగా కలకత్తా న్యూ థియేటర్సువారి చిత్రాలలో ప్రవేశపెట్టబడ్డది. విదేశీయ 'ఆర్కెస్ట్రేషన్' పద్ధతి, అప్పటినుండే ప్రారంభమైంది. ఒక రకంగా యావద్భారతదేశంలో, కలకత్తా న్యూ థియేటర్సు తర్వాత తెలుగు చిత్రాలలోనే పాశ్చాత్య సంగీతం వినిపించిందని చెప్పాలి.' ఆ క్రెడిట్ మన శ్రీ యస్. రాజేశ్వరరావుగారికి దక్కుతుంది. ఆయన తన బాల్యంలో కలకత్తా న్యూ థియేటర్సు గాయక నటులైన 'సైగల్'వద్ద వుండినందున, ఆ పాశ్చాత్య సంగీత ప్రభావం ఆయన కబ్బింది. ఆయనే తర్వాత తను సంగీత దర్శకత్వం చేసిన కీ॥ శే॥ శ్రీ గూడవల్లి రామబ్రహ్మంగారి ఇల్లాలు, చిత్రంలో ప్రప్రథమంగా పాశ్చాత్యరీతి 'హార్మొనైజేషన్', ప్రవేశపెట్టి విజయం సాధించారు. తర్వాత ఆయన, 'చంద్రలేఖ' మున్నగు ఎన్నో చిత్రాలలో ఆ సాంప్రదాయాన్ని వాడారు. తరువాతనే హిందీ చిత్రాలలో కూడా (Western Orchestration) ప్రవేశపెట్టబడింది. అంతవరకూ హిందీ చిత్రాలలో, హిందూస్థానీ శాస్త్రీయ, లలిత సంగీతపు బాణీతో వాద్య ప్రక్రియ కూడా భారతీయమే. రాజేశ్వరరావుగారు వాడిన రోజులలో పాశ్చాత్య శాస్త్రీయ సాంప్రదాయాన్నే ఎక్కువగా వాడారు. ఇటీవల కాలంలో, అమెరికా 'పాప్' సంగీతం హిందీ చిత్రాలద్వారా మన చిత్రాలలోనికి ప్రవహించింది. కొంత పశ్చిమ ఆసియా దేశాల సంగీతం కూడా మన సంగీతములో చోటు చేసుకోకపోలేదు.

ప్ర : కర్ణాటక సంగీతం నేటి చిత్రరంగంలో తక్కువగా వుండటానికి కారణం ?

జ : కర్నాటక సంగీతంలో పవిత్రత పాలెక్కువ. ఏదైనా ఒక భక్తి సన్నివేశమో, మరొక భక్తి శృంగార సన్నివేశమో అయితే అచట వాడవలసిన సంగీతం అది. అట్టి అవసరంగల కథ వున్నప్పుడు తప్పక ఆ సంగీతం వాడి తీరాలి. ఇప్పుడు మనం చూస్తున్న చిత్రాలలో అంత అవస్తలేదు అందువల్లనే శాస్త్రీయ కర్నాటక సంగీతం తక్కువగా విపిస్తున్నది.

ప్ర : చిత్ర విజయానికి సంగీతం ఎంతవరకు బాధ్యత వహిస్తుంది?

జ : బాగా బాధ్యత వహిస్తుంది. భారతీయులు కథను ఎంత ఆసక్తిగా ఆసిస్తారో, తగిన పాటలను కూడా అంతగా ఆసిస్తారు. మన భారతీయులు మొదటినుంచీ సంగీత ప్రియులు. సంగీతమంటే చెవి కోసుకుంటారు. చలన చిత్రాన్ని ఒక ప్రముఖ వినోద సాధనంగా (Entertainment) భావిస్తారు గనుక, అందరి సంగీతాన్ని కూడా అట్టి సాధనంగానే భావిస్తారు. తాము ఖర్చుపెట్టిన డబ్బుకు మంచి కథను ఎల్లా వాంఛిస్తారో, అంతకు ఏ మాత్రమూ తక్కువగాని స్థాయిలో నాలుగుమంచి తియ్యని పాటలను కూడా ఆసిస్తారు. అదే పాటలను తిరిగి తాము స్వయంగా పాడుకో గోరుతారు. సాధ్యమైనంతవరకు ఆ రకంగా (Box Office Value) పాటలలో వుంటే, మొత్తం చిత్రం రక్తికి నేపధ్య సంగీతం అవసరం. సన్నివేశపు లోతులలోనికి ప్రేక్షకుని తీసుకునివెళ్లి మైమరపింప చేస్తుంది. ఆ ప్రక్రియ ఆ రకంగా సంగీతం లేకపోతే చలనచిత్రమే లేదు అని చెప్పొచ్చు.



ఆనంద మాధవము

శ్రీ అన్నాప్రగడ శ్రీరామమూర్తి

వెన్నటిదాక నీ ప్రకృతి పుణ్యపవిత్రి శిరస్త్రభూషయై
యున్నది పేదరాలివలె—నొక్కవడిన్ మఱి మారిపోయె సం
పన్న గృహంబులో గృహిణి మాదిరి జిల్గుల యాకుపచ్చ చీ
రన్ నవసొమ్ములన్ సొగసు రంజిలగా, హరిగేహినింబలెన్—

హైందవత చూపు పెద్ద ముత్తైదు వట్లు
సహజమైన యలంకృతుల్ సందడింప
నీ ప్రకృతి కాంత గృహ మలంకృత మొనర్చె
భువి వసంతోత్సవమ్ము కాబోలు నేడు !

పౌరోహిత్య మొనర్చె రామచిలుకల్—ప్రత్యగ్ర వర్ణాళిచే
కూరెన్ మంగళతోరణమ్ములుగ పక్షుల్ కొన్ని మ్రోగించె పెం
పారన్ మంగళతూర్యముల్—ప్రజల కింపౌ బాణిలో పాట క
చ్చేరుల్ చేసెను కోకిలల్—ప్రకృతి రాజీవాక్షి గేహంబులో.

ఈ కోలాహలమందు మానవుల కిస్సీపాత్ర లేదాయెనే
యీ కౌతూహలమందు భాగమును లేదే—యక్కటా జీవ యా
త్రా కర్మిష్ఠులు భోగభాగ్యకరణ ప్రారంభ నిర్నిద్రులై
మూకీభావము దాల్చి రీ బహుకళా పూర్ణోత్సవంబందహో !

ఒక విరజాజిమొగ్గ—తళుకొత్తిన సుందరి లేత నవ్వులో
ప్రకటితమూర్తియౌ రదన వైఖరి నున్నది—భృంగ గాయకుం
డొకడు స్వరంబుతోడ భ్రమణోద్యమ తత్పరుడయ్యె భూమి వీ
డకు మధుమాసరాజ నవతాళము సంభ్రమహర్ష హేతువై.

ఆమ్రపల్లవ శాఖపై నధివసించి
నొక్క కోయిల పాడుచు నున్నదపుడు
ప్రతి కుహూకుహూ నాదంబు పద్యమగుచు
నా శ్రుతుల నిట్లు పరివర్తనంబు చెందె.

సంశోధిత మహాభారతము -

ఆనుశాసనిక పర్వము-(2)

కళాప్రపూర్ణ నిడుదవోలు వేంకటరావు

[గ త సం చి క త రు వా యి]

గ్రంథస్థ విషయ విచారణ

గ్రంథ పీఠికలు

ఆదిసభా పర్వములు గల ప్రథమ సంపుటము తప్ప, తక్కిన ఆరు సంపుటముల యందును—నాయా పర్వములకు సంబంధించిన వ్యాసములు ఉపోద్ఘాతములు—పీఠికలు గలవు. వాని వివరములు—

1 వ		సంపుటము ఆదిసభా పర్వములు	
2 వ	,,	ఆరణ్య పర్వము— ఉపోద్ఘాతము ఎఱ్ఱాప్రెగడ	78పుటలు
3 వ	,,	విరాటోద్యోగ పర్వములు Tikkna Somayaji (English) తిక్కన వంశము కాలము తత్కాల పరిస్థితులు	87 ,,
4 వ	,,	భీష్మ ద్రోణ పర్వములు మహాభారతము-యుద్ధ తంత్రము మహాభారతము—ఇతి హాసము, తత్సందేశము	44 ,,
5 వ	,,	కర్ణ, శల్యసౌప్తిక స్త్రీ పర్వములు ఉపోద్ఘాతము (పర్వ విషయములు) తిక్కన సోమయాజి ఇతివృత్త నిర్వహణ— రసపోషణ	66 ,,
6 వ	,,	శాంతి పర్వము— శాంతి పర్వము మహాభారతము— శ్రీ వైష్ణవ మతము	68 పుటలు
7 వ	,,	ఆనుశాసనిక పర్వము— ఆనుశాసనిక పర్వము మహాభారతము ఉపాఖ్యానములు కవిత్రయ భారతము ఛందః ప్రయోజనము	65 ,,
			408

ప్రస్తుత సంశోధిత ముద్రణ దృష్ట్యా పరిశీలించిన నీ 408 పుటలలో నొకటి రెండు విషయములు తప్ప, తక్కినవన్నియు ననావశ్యకములు. సంశోధిత ముద్రణమనగా, నిదివఱకు ముద్రితమైన ప్రతిని శోధించుట. ఆంధ్ర మహాభారతమునకు నీ వఱకు ముద్రణములున్నను ఆ ముద్రణలకు మూలమైన తాళపత్ర ప్రతులను సేకరించి, పాఠములను సంగ్రహించి వానిని ప్రచారములోనున్న ముద్రణలో సంతరించుటచే ప్రస్తుత ముద్రణము సంశోధిత మహాభారత ముద్రణమైనది.

పాఠభేద ప్రదర్శనమే గాక మూలముతో, ననువాద మెంతవఱకు సరిపోయినది అని పరీక్షించుటయు, సంశోధిత ముద్రణము లక్ష్యమే—ఇందువలన సంశోధిత ముద్రణ లక్షణములు రెండు.

(1) పాఠభేద ప్రదర్శనము.

(2) మూలము—అనువాద విచారణ.

వీనిలో పాఠభేద విమర్శనము చేయుట—పండితుల కర్తవ్యము గావున సంశోధిత ముద్రణ ధ్యేయము

సాధారణముగా మూలము— అనువాదము వీనిపైననే యుండును. నేటి సంశోధిత ముద్రణమున పాఠభేదము లన్నియు ప్రదర్శనము గావించుట యెంతయు నభి నందింప దగినది. ఏలననగా అది బహుకాలము, వ్యాసంగముచేసి ఫలితములు ప్రకటింపవలసిన పరిస్థితి గలది. ఇందుకొన్నిపట్ల మాత్రమే. మూల పాఠము లను మార్చి చూపినారు.

భండార్కరు సంస్కృత మహాభారత సంశోధిత ముద్రణమున పై హేతువుచేతనే పాఠభేద ప్రదర్శనము మాత్రమే గావించి ప్రతిపర్వమునకు, పీఠికా ప్రాయముగా, ఆ పర్వతాళప్రతులలలోను ముద్రితములో నున్న కథాభేదములను విషయ విపర్యాసములను—పునరుక్తములను మాత్రమే చర్చించినారు. ప్రస్తుత సంపాదకు లీ పద్ధతిననుసరించిన ఎంతో బాగుగా నుండెడిది.[1]

మూలము— అనువాదము

సంస్కృత భారతమునకు తెలుగు భారత మనువాదము గావున—సంశోధిత ముద్రణమున—తెలుగు భారతము, మూలము నెంతవఱకు ననుసరించినది, మూలకథలో నే యే మార్పులు గావించినది మున్నగు విషయములు చర్చించుట యత్యావశ్యకము. ఈ సంశోధిత ముద్రణమున పుట యడుగున నచ్చటచ్చట మాత్రమే మూలమునకు—అనువాదమునకు గల భేదములు సూచింపబడినది. ఇందువలన సాధించిన ప్రయోజనమంతగా గానరాదు. గ్రంథములో పుట యడుగున సూచించుటకు మాఱుగా, ప్రతిపర్వమునకు పీఠికారూపమున సమగ్రముగా, నా పర్వము సంస్కృత మూలము. తెలుగు అనువాదపద్ధతి వివరించిన నీ సంశోధిత ముద్రణ మింకను లోకోత్తరముగానుండెడిది.

నేటి మహాభారత విమర్శనలయం దిట్టి మూలానుసరణ వివరణము విధిగా గావింపవలసిన యవసరము చాలగా నున్నది. ఇంతవఱకు కవిత్రయ కవితా వైదుష్యము—భాషావ్యాకరణచ్ఛందో విశేషములు. విపులముగా విమర్శితములైనవి కాని మూలముతో సంప్రతించి విమర్శించిన గ్రంథములు రెండుమాత్రమే వచ్చినని[2] కాని వీనికి ప్రాధాన్యములేదు. కేవలము పాశ్చాత్య విమర్శనాదృష్టితో వ్రాయబడిన భారత విమర్శనములకే ప్రచారము లభించు చున్నది.[3]

ఆంధ్రభాషాసౌధమునకు మూలస్తంభాయ మానమైన తెలుగు భారతము ప్రత్యేక విశిష్టత—ఈనాడు భారతవర్షమునకంతకు చాటవలసిన యావశ్యకత యున్నది. ప్రస్తుత సంశోధితముద్రణము పీఠికాదులకై వినియోగింపబడిన 408 పుటలు. మూలానువాదపరిశీలనకే ఉపయోగింపబడినయెడల అది భావిపరిశోధనకు, భారత విమర్శనకు నత్యంతసహాయకారిగా నుండెడిది. కాని యట్టి పని జరుగలేదు.

ఆనుశాసనిక పర్వము
మూలము—తిక్కన యనువాదము

మహాభారతమున ఆనుశాసనికపర్వము 13 వ పర్వము.

క: ఒనరుఁ త్రయోదశ పర్వం
బనగా నను శాసనాద్యమగు పర్వయుగం
బున మేలై విబుధ శ్రే
ణి నుతంబై యానుశాసనిక పర్వమిలన్.
(ఆది. 1–160)

నన్నయ్య తిక్కన పర్వములలో పేర్కొని నట్లుగా నిందును—పర్వ విషయములు తెలిపినాడు—

---

1. సంశోధిత ముద్రణమున పాఠభేదములు మూలానుసరణము మాత్రమే ప్రదర్శించి- మహాభారతమునకు సంబంధించిన సాహిత్య విమర్శనంతయు ప్రత్యేకముగా నొకే సంపుటముగా ప్రకటించిన నీ ముద్రణమునకది సంపూర్ణత్వ మాపాదించి యుండెడిది.

2. 1. కీ. శే. కోరాడ రామకృష్ణయ్య — ఆంధ్రభారత కవితా విమర్శనము. (తిక్కన విరాటపర్వము)

2. డాక్టరు దివాకర్ల వేంకటావధాని— నన్నయ భారతము.

3. కళాప్రపూర్ణ విశ్వనాథ సత్యనారాయణ గారి–నన్నయ్య ప్రసన్న కథాకలితార్థయుక్తి—ఇందు మూలప్రసక్తిలేదు. సరికదా సంశోధిత మహాభారత ముద్రణము వెలువడిన తరువాత గ్రంథనామమే తప్పైనది. నన్నయది ప్రసన్నకథాకవితార్థయుక్తిగాని ప్రసన్న కథాకలితార్థయుక్తి కాదు.

అని 'మఱియు పితామహుండగు గాంగేయు వలన— సర్వధర్మ నిశ్చయంబును, దాన విధులును, నాచార విధులును, ధర్మరాజెఱుంగుటయుఁ బు(త్రాను శాసనంబును - భీష్మ స్వర్గారోహణంబునను వృత్తాంతంబుల నొప్పి—పంద్రెండువేల శ్లోకంబులు గలిగి'— అనునవి—

168 అధ్యాయములను—పంద్రెండువేల శ్లోకములను గలిగిన యీ ఆనుశాసనిక పర్వము తిక్కన యిట్లనువదించినాడు.

ప్రథమాశ్వాసము	388	గద్య పద్యములు
ద్వితీయా ,,	478	,,
తృతీయా ,,	347	,,
చతుర్థా ,,	451	,,
పంచమా ,,	484	,,
	2148	

నన్నయ 12,000 శ్లోకములని చెప్పెనను4— సంశోధిత సంస్కృత మహాభారత ముద్రణము—(భండార్కరు) ప్రతియందు 6700 శ్లోకములు 168 అధ్యాయములు గలవు. కావున తిక్కనకు మూల మీ ప్రతియే యని నిర్ణయింపవచ్చును.

మూ లా ను స ర ణ ము

పై సంస్కృతాంధ్ర శ్లోక గద్య పద్యములను పరిశీలించినచో తిక్కన మూలము మూడవ వంతు మాత్రమే తెనుగు చేసినట్లు కాననగును. అట్టిచో నాత డే యే భాగములను విడిచిపెట్టెను—అనునది తెలిసికొనవలసియున్నది. ఈ సందర్భమున—భండార్కరు ప్రతియందు లేని యొక యుపాఖ్యానము గూర్చి మనము చర్చించుట యావశ్యకము.

గ రు త్మ ం తు ని క థ
సౌపర్ణోపాఖ్యానము

మహాభారతాది పర్వమున — సౌపర్ణోపాఖ్యానము అను పేర గరుడోపాఖ్యానము గలదు. అది మూలములో నచ్చట నున్నది. నన్నయ పర్వసంగ్రహము దెలుపుచు—ఆదిపర్వమున—'ఉచ్చైశ్రవో జన్మంబును సౌపర్ణోపాఖ్యానంబును, నాస్తీక చరితంబును' — అని దీనిని వివరించినాడు. కనుక, ఈ కథయే తిరిగి ఆనుశాసనిక మందుటచే నిది ప్రక్షిప్తమని యభిజ్ఞుల యభిప్రాయములు5—అయినను నిందలి కథ విష్ణు మాహాత్మ్య ప్రతిపాదక మగుటచేత తిక్కన దీనిని ఆదిపర్వముననున్నను తానును ప్రత్యేకముగా రచియించినాడు—ఒకే కథను నన్నయ తిక్కన లిరువురు నేయే రీతులుగా దిద్ది తీర్చిరో పరిశీలించుటకు నీ సౌపర్ణోపాఖ్యానము సరియైన ఘట్టముల్.

ఇట్లు మూలములోలేని కథను చేర్చినను తిక్కన విడిచిపెట్టిన భాగములలో ముఖ్యమైనవి.

విష్ణుసహస్ర నామములు
శివ సహస్ర నామములు

విష్ణు సహస్ర నామములు విష్ణు మాహాత్మ్యాభివర్ణనము శివసహస్ర నామములు—శివ మాహాత్మ్యాభివర్ణనము కలిసి రమారమి వేయి శ్లోకము లున్నవి. తిక్కన వీనిని కొన్ని పంక్తులలో ముగించినాడు. ఇట్లే శాంతి పర్వమున - శివసహస్ర నామములను పూర్తిగా తెనిగింపక విడిచిపెట్టినాడు.7 ఇట్లు తిక్కన సహస్ర నామములు, తెనుగు చేయక విడిచిపెట్టుటలో నెంతో గంభీరార్థమిమిడి యున్నది.

సహస్ర నామములు దేవతాస్తుతులు. వైదిక వాఙ్మయమునకు సంబంధించినవి. అవి పారాయణ యోగ్యములు. వానిలో సహస్ర నామములు వ్రత కల్పములలోనేకాక, దేవాలయములందును గృహములందును

---

4. నన్నయ శ్లోక సంఖ్య దాక్షిణాత్య సంస్కృత భారత ప్రతులనుండి గ్రహింపబడినది. భండార్కరు ప్రతి సంఖ్య—ఔత్తరాహిక ప్రతులనుండి గ్రహింపబడినది.

5. 'ప్రక్షిప్తభాగము—ఈ పర్వమునందు విస్తారముగా చోటు చేసికొన్నట్లు కనిపించును' శ్రీ లక్ష్మీరంజనముగారి—ఆనుశాసనిక పర్వము. పీఠిక—10 పుట.

6. చూ. సంశోధిత మహాభారత ముద్రణము శాంతిపర్వము. నా సమీక్ష—భారతి అక్టోబరు—1973.

7. ఈ సంపుటముననేగల మహాభారతము—ఉపాఖ్యానములు అన్న వ్యాసమున నీ సౌపర్ణోపాఖ్యాన ప్రసక్తిలేదు.

పూజలలో నియతములు–కాబట్టి అట్టి దేవతాత్మకములు, మంత్రాత్మకములు నైన సహస్ర నామములను–కేవలము, లౌకికమగు సాహిత్య కావ్యమున దేశ భాషలో ననువదించుటచేత దాని మాహాత్మ్యమునే కాక వానివలని ఫలమును లభింపక పోవునన్న మహాదాశయముతో తిక్కన వీనిని యాంధ్రీకరింపలేదు.

ఈ హేతువుచేతనే విరాటపర్వ ప్రారంభమున తిక్కన దుర్గాస్తవమును తెనిగింపక విడిచిపెట్టినాడు. ఇక, భీష్మ పర్వమున—వేదాంత గ్రంథములకు మకుటాయమానమగు భగవద్గీతను తిక్కన తెలుగు చేయలేదని విమర్శకులు వ్రాసినారు. కాని పై కారణమే దానికి ప్రత్యుత్తరము. భగవద్గీత భారతమందున్నను అది ఆధ్యాత్మిక సంబంధమైనది–దానిని పారాయణము చేయువారు నేడును నున్నారు.

తిక్కనయే గాదు నన్నయయు దేవతానామములు ప్రసక్తమైనప్పుడిట్లే చేసినాడు. ఆరణ్యపర్వప్రారంభమున ధర్మరాజు ఆహారమునెట్లు సమకూర్తునని విచారించుచుండగా ధౌమ్యుడు సూర్యునారాధింపుమని యుపదేశించెను. అప్పుడు ధర్మరాజు సూర్యునష్టోత్తర శతనామములు పఠించి యాతని వరము వడసెను. సంస్కృతమూలనున్న యీ యష్టోత్తర సూర్యనామములకు నన్నయ ఒక్క లయగ్రాహి వృత్తమున మాత్రమే వ్రాసెను. (అర. (3–40)

తెలుగుభారతము ఇతిహాసముకాదు. అది మహాకావ్యము—'కవి వృషభులు మహాకావ్యమనియు' అని నన్నయ (ఆది. 1—30) కావున లౌకిక రసభావ సందర్భములు గలిగిన కావ్యమున నవిచేర్చినను పఠితల దృష్టి కావ్యరసభావవర్ణనలపై నుండునుగాని దేవతానామావళులయందుండదు. ఇట్టి కావ్యదృష్టియు వీనిని విడుచుటకొక హేతువై యుండును.[8] మన ప్రాచీన సాహిత్యవిమర్శనమున నేడు ప్రచురముగానున్న పాశ్చాత్య విమర్శనాదృష్టికంటె, సంప్రదాయదృష్టి యే ప్రధానముగా నుండవలెననియు, నందువలననే. మన కావ్యవిశిష్టత–కవితాతత్త్వము సువ్యక్తమనియు దెలుపుటకే పై విషయ మింతగా విస్తరించుట సంభవించినది. విమర్శకులు సాదరముతో గ్రహింతురుగాక.

శైవమతములు – సంప్రదాయములు

తెలుగున ప్రాచీనసాహిత్యము, శైవ వైష్ణవ మత భేదములచే రెండు పాయలుగా వ్యాప్తమైనదని అందును శైవమతము ప్రాథమికమై, 'శివకవి యుగము' అనుపేర ఒక వాఙ్మయ యుగమేర్పడినదనియు, ఆంధ్రవాఙ్మయచరిత్రకారులందఱును నిర్ణయించిన విషయము. అయినను, మహాభారతమున ముఖ్యముగా, నన్నయకాలమున, నీ శైవవైష్ణవ మతము లెట్లున్నవి? ఆ వెనుక తిక్కన, ఎఱ్ఱనల కాలమున నెట్టి పరిణామములను బొందినవి? యన్న యంశము లీ వఱకు నాంధ్రభారత విమర్శనములందు ప్రసక్తమైనట్లు కానరాలేదు. ఈ సంశోధిత మహాభారత ముద్రణమున నట్టి మత ప్రసక్తి పీఠికలలో నుండుట ప్రశంసనీయమైనది.

సంశోధిత మహాభారతము శాంతిపర్వ పీఠికలో వైష్ణవమతమునుగూర్చి 'శ్రీ వైష్ణవమతము—మహాభారతము' అన్న శీర్షిక యున్నట్లు నీ వఱకు తెలిపియున్నాను.9 అట్లే ఈ ఆనుశాసనిక పర్వమున, పీఠికలో 'శైవమతము మహాభారతము' అన్న విషయము ప్రస్తావింపబడిన యెడల, అది సాహిత్య విమర్శనమున కెంతో దోహద మొనర్చియుండెడిది—ఈ పర్వమునందే శైవమతమును గూర్చి తెలుపవలసిన యావశ్యకతకు నింకొక కారణమున్నది. దానివి వివరించు చున్నాను.

---

8. దేవతాస్తోత్రములున్నను శ్లోక రూపముగానున్న వానిని పద్యములలో యథామాతృకముగా ననువదింపక నొక దండకముగా వానిని రచించి సాహిత్యమున వానికి స్థానము గడించిన కీర్తి నన్నయది. (చూ. ఆరణ్యపర్వము—కిరాతార్జునీయఘట్టము. ఇచట శివస్తుతి మూలమున శ్లోకములతోనుండ—నన్నయ తెలుగున దండకముగా రచించినాడు. (అర 1–324) ఇట్లే శ్రీనాథుడు నైషధమున శ్లోకరూప సరస్వతీ స్తుతిని దండకముగా రచించినాడు.

(నైష 4—137)

9. సంశోధిత మహాభారతము. శాంతి పర్వము–సమీక్ష. భారతి సెప్టెంబరు – 1973 పుట. 33.

అనుశాసనికపర్వమున చతుర్థ, పంచమాశ్వాసము లలో విశేషభాగము, శివసంబంధమైనదేగాక, శైవ మతసంప్రదాయములను, దెలుపునది. ఇందలి విషయ ములను చూచిన నిది స్పష్టము.

చ తు ర్థా శ్వా స ము

1) హర సనత్కుమార సంవాదప్రకారము.

2) సనత్కుమారుడు శివునకు దేహాంతర్గత దైవతములం దెల్పుట.

3) ,, ,, సాంఖ్యయోగము తెలుంగొలించుట.

4) ఉమామహేశ్వర సంవాదంబను నితిహాసము.

5) శివుడు పార్వతికిఁ దన శ్మశానవాసితకుఁ గారణము సెప్పుట.

ప ం చ మా శ్వా స ము

6) శివుడు పార్వతికి వర్ణాశ్రమాచారంబుల తెలుంగొలించుట.

7) శివుడు పార్వతికి తపస్స్వరూపంబు జెప్పుట.

8) శివుడు పార్వతికి రాజత్వ మహిమాతి శయంబు జెప్పుట.

9) శివుడు పార్వతికి వర్ణకర్మపరిపాకంబుల తెలుంగొలించుట.

10) శివుడు పార్వతికి నాయుర్వృద్ధి క్షయం బులకుఁ గారణంబులు సెప్పుట.

11) శివుడు పార్వతికి స్వప్నాదుల తెలుగొలి గించుట.

12) శివుడు పార్వతికి మానసవాచిక కాయికము లను త్రివిధపాపంబుల దెల్పుట.

13) శివుడు పార్వతిని దానఫల విశేషంబుల నెఱింగించుట.

14) శివుడు పార్వతికి ధర్మ విశేషంబుల తెలు గొలిగించుట.

15) శివుడు పార్వతికి సాంఖ్యప్రకారంబు దెలుపుట.

16) శివుడు పార్వతికి ఆత్మసాయుజ్యప్రాప్తి సాధనంబులు దెలుపుట. 10

17) పార్వతి శివునకు పతివ్రతాధర్మముల తెలుగొలిగించుట.

18) పార్వతి శివునకు పతివ్రత కనర్హములైన ధర్మంబుల దెలుపుట.

పై శీర్షిక లన్నియు 406 పద్యములలో నొక ఆశ్వాస పరిమితిని గలిగియున్నవి. వాని యన్నిం టిలో 'శివుడు పార్వతికి ఆత్మసాయుజ్యప్రాప్తి సాధ నంబులు దెలుపుట' అనునది ముఖ్యమైనది. అందు ఆరాధ్య శైవ మతమునకు ప్రధానములైన—

పాశుపతవ్రతము- లింగార్చన

అను రెండును తెలుపబడినవి.[11]

శివ ప్రాధాన్యము నిరూపించు నీ శైవమత సంప్రదాయిక విషయములు—రెండును సంస్కృత మూలమున నున్నవే—అయినను క్రీ. శ. 1050 ప్రాంతమున నన్నయ కాలమున నీ సంప్రదాయములు తెలుగుదేశమున వ్యాప్తములో లేవు. నన్నయ కాల మున—శివుడు—బ్రహ్మ విష్ణుమహేశ్వరులను త్రిమూర్తు లలో నొకడు. ఇది యాతని—భారతాద్య శ్లోకముననే గానవచ్చుచున్నది. తరువాత, కథా మధ్యమున, శివ ప్రసక్తి వచ్చినపుడును, శివుడు లింగస్వరూపుడుగా వర్ణితుడు కాలేదు. పౌరాణికముగా ప్రచురములైన శివ నామములే ప్రయుక్తములైనవి.[12] నన్నయ కాలమునాటి శైవము పౌరాణిక శైవము.

తిక్కనకాలము—భక్తిప్రధాన శైవము

నన్నయ క్రీ. శ. 1050 ప్రాంతమువాడు. తిక్కన క్రీ. శ. 1250 ప్రాంతమువాడు కాన వా రిర్వురకు నడుమ రెండువందల యేండ్ల ఎడ మున్నది. ఈ రెండు శతాబ్దులలోను తెలుగుదేశమున—

10. ఈ శీర్షిక విషయసూచికలో ముద్రితము కాలేదు.

11. ఈ రెండింటిని గూర్చి — అతిసంగ్రహ ముగా—శ్రీ లక్ష్మీరంజనముగారి పీఠికలో దెలుపబడినవి— (చూ. పుట. 24.)

12. ఆరణ్యపర్వము 1—324. కిరాతార్జు నీయ ఘట్టము—అర్జునుడు శివుని స్తుతించు ఘట్టము—దండకము—తెనుగున ప్రథమ దండకము శివ పర మగుట గమనింప దగినది.

భక్తి ప్రధానమై, శివపారమ్యమును నిరూపించు ఆరాధ్య శైవ సంప్రదాయము—విస్తరిల్లినది. ఇది శ్రీపతి పండిత శివలెంక మంచెన పండితులచే ప్రతిపాదితమై మల్లికార్జున పండితుని కాలమున నాతనిచే, శ్రుతి స్మృతి పురాణాగమేతిహాస ప్రమాణముల మూలమున—ఆరాధ్య సంప్రదాయముగా — సిద్ధాంతీకరింపబడి—ప్రచారములోనికి వచ్చినది. ఇది శ్రీపతి పండిత, మంచెన పండిత, మల్లికార్జున పండితులను పండిత త్రయముచే ప్రవర్తిల్ల జేయబడినది గావున దీనికి 'పండిత సంప్రదాయము' అని పేరు గలిగినది.

ఆరాధ్యశైవసంప్రదాయము - పాశుపతము

ఈ ఆరాధ్యసంప్రదాయమునకే వీరమాహేశ్వర సంప్రదాయమని మఱియొక పేరు. ఈ శైవసంప్రదాయమునకు మూలమైనది. పాశుపతసిద్ధాంతమే—దీనిని పండితారాధ్యుడు తన [13]శివతత్త్వసారమున వివరించినాడు. (పశుపాశపతిజ్ఞానము 20 నుండి 30 పద్యములు) ఈ సిద్ధాంతమిది. 'జీవులు పశువులు—ప్రకృతి వికృతి బంధము పాశము. శివుడా రెండింటికి పతి కావున శివుడు పశుపతి — శివయోగమువలన పాశము వీడగనే జీవుడు పతియైన శివునితో నైక్యమగును' ఇదే 'లింగాకృతినున్న శివుని గొలువవలయునని లింగస్వరూపవిరహితముగ శివుని మహిమ నెఱుగ తరముగాదని లింగస్వరూపమున శివపారమ్యము ప్రతిపాదితమై, శివభక్తి మాహాత్మ్యము ప్రపంచింపబడినది. (పంచమాశ్వాసము 265—273 పద్యములు)

పాల్కురికి సోమనాథుడు తన పండితారాధ్య చరిత్ర మూలమున నీ వీరమాహేశ్వర సంప్రదాయమున బరగిన ఆరాధ్య సంప్రదాయమును సర్వాంధ్ర దేశమున చిరస్థాయి గావించినాడు.

తిక్కన—ఆరాధ్యశైవము

తిక్కన నిర్వచనోత్తర రామాయణమున, తాను 'మహేశ్వరాంఘ్రి కమలధ్యానైకశీలుండనని యీ ఆరాధ్య శైవ సంప్రదాయమే తెలిపినాడు.[14] భారత రచనా కాలమునాటి కాత డద్వైతియై హరిహరతత్త్వము ప్రతిపాదించినాడు. భారతమున మాత్రము—మూలము ననుసరించి— పాశుపత వ్రతము—లింగార్చన — యీ అనుశాసనిక పర్వమున—విస్తరించినాడు. కాని భారతమున ప్రతిపాదించిన పాశుపతవ్రత సిద్ధాంతమునకు—తిక్కనకాలమునాటి పాశుపతవ్రత సిద్ధాంతమునకు భేదమున్నది.

భారతమున - పాశుపత మత సిద్ధాంతము—బ్రహ్మచర్యవ్రతులై, ముండిత శిరస్కులై గాని జడలు ధరించి గాని—భిక్షాశనులై లింగార్చన చేయుట. (అనుశాసనికము 5—264 మొదలు 274 పద్యములు) తిక్కన కాలమున—పాశుపతులు, గృహస్థులై—వేదోక్తముగ భక్తిప్రపత్తులతో శివలింగార్చన చేయుట—శివపారమ్యమును శివభక్తిని వ్యాప్తము చేయుట—నియతమైనది.[15]

పండితారాధ్యుడు—శివపారమ్య ప్రతిష్ఠాపనకై హరిహర తత్త్వమును ఖండించియున్నాడు.[16] తనకు ముందే సాహిత్యమున హరిహరతత్త్వము ఖండితమై యుండుటచేత నా తత్త్వమును, తిక్కన సాహిత్యముననే, పునఃప్రతిష్ఠితము చేసియున్నాడు.[17] ఈ విషయము విస్తరించుట కిది యదను కానందున నింతటితో విరమింతును.

---

13. శివతత్త్వసారము—నా విపుల సటీకా పరిష్కరణములతో ముద్రితము. ప్రచురణ కర్తలు: శ్రీ ముదిగొండ సుబ్రహ్మణ్యశర్మగారు. కృష్ణా పత్రికా కార్యాలయము, తెనాలి.

14. కేతన—తన దశకుమార చరిత్రమున—నీ విషయము స్పష్టపఱచినాడు.

15. చూడుడు శివతత్త్వసారము—54, 56 పద్యములు.

16. చూడుడు పండితారాధ్య చరిత్ర, వాద ప్రకరణము.

17. పండితారాధ్యు డెట్లు, హరిహర తత్త్వమును ఖండించినది, తిక్కన దానిని భారతమున నెట్లు ప్రతిపాదించినది. మొదలగు విషయము లన్నియు విపులముగా—నా 'తెలుగు కవుల చరిత్ర 'తిక్కన—ఎఱ్ఱనల యుగము' అను గ్రంథమున తెలిపినాను. అది అముద్రితము—తిక్కనపై, పండితుని శివతత్త్వసార ప్రభావ మెంతవఱకు గలదో, ఆ విషయము నిది నిరూపించును.

ఆనుశాసనిక పర్వము
అనువాద సరణి

తిక్కన — యీ పర్వమునను, ధర్మములను తెలుగు చేయుపట్ల, మూలము ననుసరించియున్నాడు. కొన్నిచోట్ల కావ్యధర్మము ననుసరించి, మూలమును కొంత పెంచినాడు. అన్నింటికి నుదాహరణము లిచ్చుటకు నవకాశము లేదు. ఒక్కొక్కదాని కొక యుదాహరణ.

మూలానుసరణము—

శ్లో. అదైవం దైవతం కుర్యు
దైవతం చాప్య దైవతమ్
యమిచ్ఛేయు స్సరాజాస్యా
ద్యోనేష్ట స్సపరా భవేత్ 33 అ. 17 శ్లో.

క. దైవంబున దైవము గన
దైవము దైవముగఁ జేయ ధరణీ దివిజుల్
భూవర ! శక్తులు వినువా
రే వానికి కూర్తురతఁడధీశత నొందున్
(2—141)

మూలమునకు పెంపకము—సుదర్శన సౌందర్య వర్ణన—

శ్లో. తస్యా జజ్ఞేతదా నద్యాం
కన్యా రాజీవలోచనమ్ 2 అ. 19 శ్లో.

....

శ్లో. నామ్నా సుదర్శనా రాజన్
రూపేణాపి సుదర్శనా
తాదృగ్రూపా సనారీషు
భూత పూర్వా యుధిష్ఠిర 2 అ. 20 శ్లో.

దుర్యోధన సుతాయాదృ
గ భవర్వర వర్ణినీ...... 2 అ. 21 శ్లో.

తిక్కన. సీ. చిగురుటాకులు గాసి సేయు నీ యడుగులు
చెలువంబు చూడ్కులఁ జేర్చికొనియె
మారేడుపండుల గారాము చెఱచు నీ
యెలవన్నుగవ వేడుకలఁ బొనర్చె
నునుదీవ జీరికిఁ [18]గొనని నీమైదీవ
మురిపంబు డెందంబు మరులు కొలిపె
నెఱచందురుని సిగ్గు పఱుపంగఁ జాలునీ
మెమ్మోము దాలిమి వమ్ము చేసె

గీ. నాతి నీకునై పెక్కు బన్నములు వడితి
నంగజుని చేతి [19]వల్లభివగుము నాకు
నావుడును సిగ్గు గదిరి యాననము వాంచి
యలఁతి యలుఁగున నిట్లను నా లతాంగి.
(1—50)

ఈ సందర్భమున తిక్కన పెంపకమునకు మూలమున్నదని పై పద్యము క్రింద యీ క్రింది జ్ఞాపిక గలదు.

48.1. 'ఇచ్చట తిక్కన సోమయాజి చేసిన సుదర్శనా సౌందర్య వర్ణనకు మూలము చిత్రశాలా ప్రతియందు లేదు. అచ్చట మిక్కిలి సంగ్రహముగా నీ వృత్తాంతము తెలుపబడినది...కాని కుంభకోణ ప్రతియందు అగ్నిదేవుడు సుదర్శనా సౌందర్య వర్ణనమును విపులముగా చేసినట్లున్నది...పి. పి. యస్. శాస్త్రి ప్రతియందును. ఈ ఘట్టము పెంపుదలతో నున్నది.'

దీనినిబట్టి దాక్షిణాత్య సంస్కృత భారత ప్రతులలో తిక్కన పెంపకమునకు మూలమున్నదని తెలియుచున్నది. ఇందువలన—తిక్కన భారతమును—మూలముతో నెంత సూక్ష్మముగా, నిశితముగా పరిశీలింపవలెనో వ్యక్తమగుచున్నది. తిక్కన భారతము తెలుగున వెలసిన తరువాత నిందలి రచన సంస్కృత మూలములోనికి చేరినదన్న విమర్శకాభిప్రాయము నీ పట్టున—సమీక్షింపవలసియున్నది. (చూడుడు—ఆంధ్రభారత కవితా విమర్శనము.)

గ్రంథ విస్తరభీతిచే నింకొక్క వ్యాస విమర్శనము గావించి యీ సమీక్షను ముగించుచున్నాను.

కవిత్రయ భారతము—ఛందః ప్రయోజనము

పై శీర్షికతో నొక వ్యాసమిందున్నట్లు ముందు వివరించితిని[20] పేరునుబట్టి యిది మహా

---

18. 'జీరికి గొనిన' అను పాఠము సరికాదు. 'గొనని' అని యుండదగును.

19. 'వల్లభ' ,, ,, ,, వల్లభి—అని యుండదగును. శాసనములలో సాహిత్యములో 'వల్లభి' అని ప్రయుక్తము.

20. వ్యాసకర్త— శ్రీ కోవెల సంపత్కుమారాచార్య.

భారతమున ఛందస్సులను పర్యవేక్షించునది — కాని విషయమునుబట్టి చూచిన— నిది మహాభారతము నంతటికి సంబంధించినది గాన— నీ వ్యాసము— చివరి సంపుటమునం దుండవలసినది—అయితే— ఈ సంపుట మున నిది ప్రకటితమైనను నిందలి 24 పుటలలోని యంశము లన్నియు విమర్శనీయములుగా నున్నవి — ప్రతివిషయము విమర్శించుటకు స్థలావకాశమునుబట్టి వీలుకాదు కావున కొన్నింటినిమాత్రమే విమర్శించు చున్నాను.

(1) పుట. 29. 'ఈనాటికిని మార్గ దేశి విషయమొక వివాదాంశముగానే యున్నది. స్థూలముగా చెప్పికొన్నచో సాహిత్యమునకు సంబంధించిన ఇతరాంశ ముల విషయమెట్లున్ననూ, ఛంధస్సునకు సంబం ధించినంతవరకు మార్గఛందస్సులనగా సంస్కృతము నకు సంబంధించినవని దేశిచ్ఛందస్సులనగా దేశీయ (ప్రాంతీయ)మైన భాష తెలుగు ఛందస్సులని చెప్పి కొనవచ్చును.'

తెలుగుసాహిత్యమున ప్రాచీనకావ్యములలో శివ కవుల కృతులలో మార్గదేశి ప్రసక్తి యున్నది. కాని తెలుగు ఛందోలక్షణ గ్రంథములలో దేనియందు మార్గ దేశిచ్ఛందస్సుల ప్రస్తావమున్నది ?

అదేపుట—'నన్నయగారికన్న ముందే తెలుగులో సంస్కృతీయ వృత్తములూ రెండు ప్రవేశించినవి. ప్రవేశించిన వనుటకు క్రీ. శ. 1000 ప్రాంతమున విరియాల కామసాని వేయించిన గూడూరి శాసనము ప్రమాణము - ఈ శాసనమున మూడు చంపకమాలా పద్యములు రెండు ఉత్పలమాలా పద్యములు ఉన్నవి.'

చంపకమాల, ఉత్పలమాల, రెండును సంస్కృ తీయ వృత్తములు కావు — అవి సంస్కృతమున లేవని— అవి అపూర్వవృత్తములని యీవఱకే నిశ్చ యింపబడిన విషయము[21] క్రీ. శ. 848–892 ప్రాంతముల తెలుగుదేశము పాలించిన గుణకవిజయా దిత్యుని శాతలూరి శాసనము గల యీ క్రింది చంపక మాల— సంస్కృతమున గలదు.

'అరినృప వాజివారణ పదాతి
మహాభ్ర విరామ మారుతః
వరకరికార సుస్థిత సిభారుచి
నాశత భానుసన్నిభః

గురుతరదీన భాగవత మానవ
మానితి కల్పపాదపః
వరకరిగల్ల భూమిప భుజాసిరి
హాజి భువి ప్రహాసతే[22]'

దీని ననుసరించియే రాజశేఖరుడు మాఘుడు చంపకమాల సంస్కృతమున వ్రాసిరి.[23] ఇక ఉత్పల మాలకు సంస్కృతమున ప్రయోగమే లేదు. కావున నివి రెండును సంస్కృత వృత్తములు కావు.

(2) పుట 30. 'ఖ్యాతవృత్తము లారింటిలో శార్దూల విక్రీడిత స్రగ్ధరా మహాస్రగ్ధరలకు సంస్కృత మునందే విరివిగా ప్రయోగమున్నది. మత్తేభ విక్రీడిత మునకు చాల తక్కువ.'

అసలు సంస్కృతమున, మత్తేభ విక్రీడితము నకు ప్రయోగమున్నదా? లేదు. అది చంపకోత్పలముల వలె—సంస్కృత వృత్తము కాదు. మత్తేభమును, సంస్కృతములో సృష్టించిన వాడు—దాక్షిణాత్య కవి యగు రవి కీర్తి—ఆతడు రెండవ పులకేశి అయిహోలు శాసనకర్త. ఆ శాసనకాలము క్రీ. శ. 634 ఆ మత్తేభ మిది.

వరదా తుంగతరంగరంగ విలసత్
ధ్వంసావళీ మేఖలాం
వనవాసీమవ మృద్నతః సురపుర
ప్రస్పర్థినీ సంపదా
మహతాయస్య బలార్ణవేన—పరితః
సంచారి తోర్వీతలమ్
స్థల దుర్గంజల దుర్గతామి వగతం
తత్తత్క్షణే పశ్యతామ్.

పై మత్తేభమున సంస్కృత భాషలో వ్రాయ బడినది. అందుచే యతిప్రాసలు లేవు. సంస్కృతమున

21. సంస్కృతమున రెండపూర్వవృత్తములు— ప్రసిద్ధ సంస్కృత సాహిత్య పరిశోధకులు శ్రీ ఈయుణ్ణి వేంకట వీరరాఘవాచార్యులుగారు.

ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక. సం. 28. సం. 2 పుటలు 105–11. (1939)

22. తెలుగుకవుల చరిత్ర—పుట 26.

23. రాజశేఖరుడు మాఘుడు—గుణకవిజయా దిత్యుని తరువాతివారు. క్రీ. శ. 10 వ శతాబ్దివారు.

దీని కీ శాసనము తరువాత ప్రయోగము లున్నట్లు పరిశోధకులు తెలుపలేదు.

దీని ననుసరించి కన్నడ కవులు—తొలుత—కన్నడ ఛందస్సులో పద్యమునకు నియతమైన 'ప్రాస'ను పాటించి మత్తేభవృత్తము వ్యాప్తికి దెచ్చిరి.24 మత్తేభ వృత్తము సంస్కృతము కాదని సారాంశము—వ్యాస కర్త లిది గమనింపలేదు.

(3) పుట. 47. 'ఇది యిట్లుండగా నన్నయ గారు ద్విత్వమకారమునకు బిందుపూర్వక బకారమునకు ప్రాస చెల్లించినారని

ఇమ్ముగ సర్వలోక జను లెవ్వనియేని
ముఖా మృతాంశు బిం
బమ్మున నుద్భవంబయిన భారత
వాగ మృతంబు కర్ణ రం
ధ్రమ్మను నంజలిం దవిలి త్రావుదు
రట్టి మునీంద్రలోక వం
ద్యుం బరముం బరాశర సుతుం
బ్రణమిల్లి కరంబు భక్తితోన్.
(ఆది 1—77.)

అను పద్యము చూపబడుచున్నది — ఎవరు చూపినను ఇదే పద్యము. అని వ్రాసి ఇంచు— ఇమ్మ రూపాంతరములను చర్చించి— ఆ వెనుక నిట్లు వ్రాసి నారు.

'ఈవిధముగా చూచినచో ఈ పద్యమున ప్రాస విశేషమేమియునుండదు — ఇదిగాక — ద్విత్వమకారము నకు బిందుపూర్వక మకారమునకు ధ్వనిసామ్యము లేదు— ఇదిలేని ప్రాసనన్నయగా రుపయోగించలేదు. కావున పై పద్యమున ఉన్నదనుకొనబడు ప్రాస ఉండుటకు వీలులేదు.'

పై వాక్యములన్నియు నసంబద్ధములు. పరస్పర విరుద్ధములు.

మొదటిది— 'ఈ పద్యమున ప్రాసవిశేష మేమియు నుండదు' అన్న వాక్యము తీసికొందము— వ్యాసకర్తల యభిప్రాయము ననుసరించి— పై పద్య మున—

ఇంబుగ—
బంబను
ధ్రంబను వం
ద్యుంబరముం—

అనియే యుండుననియు నందు ప్రాసవిశేష మేమియులేదని గదా: కాని చూడుడు — వ్యాసకర్తలు మఱచిపోయినారు గాని, వారే— పరిష్కరించి ప్రక టించిన కూచిమంచి తిమ్మకవి సర్వలక్షణ సార సంగ్రహమున25— నీ పద్యమునందు విశేష ప్రాస మున్నదని యిట్లుదాహరింపబడినది.

ఆ. బమలు బిందుపూర్వకముగ జమిలి మాకు
నిలుపజెల్లుప్రాసములన భేద
మొదవు కృతుల లళల(కుడురాజ కోటీర
దురిత దూర పీఠపుర విహార!)

ఉ. ఇమ్ముగ సర్వ.........బిం
బంబున............రం
ధ్రంబను.........వం
ద్రుంబరముం......... (ఆది 1—77)

ఉ. అమ్మఖవాజి పాండుతనయా..... ...మో
వం బసివెట్టి.........పత్తురా
గ్రంబున.........నమి
త్రంబయి... (జైమిని భారతము 7—145)

తిమ్మకవికి ముందప్పకవియు నీ మకారద్విత్వ బిందుపూర్వక బకారప్రాస (మ్మ—౦బ) మున్నదని— యిట్లు లక్షణము చెప్పినాడు.

ప్రా స మై త్రి ప్రా స

గీ. గట్టి బిందువు మీఁది బకారమునకు
జమిలి మా ప్రాసమైత్రినా జరుగుచుండు

---

24. చూడుడు నా ఆంధ్ర కర్ణాటక సార స్వతములు—పరస్పర ప్రభావము అను గ్రంథము— పుట 23.

25. ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీ ప్రచు రణ— పరిష్కర్త లీ గ్రంథమునకు లక్షణ సార సంగ్రమను పేరుతో ప్రకటించుట సరికాదు— కూచి మంచి వంశీయులలో దీని పేరు సర్వలక్షణ సార సంగ్రహమనియే గ్రంథస్థమై యున్నది— ఈ అకా డమీ ప్రచురణ మూలమున నా గ్రంథముయొక్క విశిష్టత యంతయు విస్మృతమైనది. దీనినిగూర్చి ప్రత్యేకముగా వ్రాయుచున్నాను.

కమ్మతావులు వెదజల్ల నంబుజములు
శంబరారాతి చేతి వాలమ్ము లనఁగ.

(3—343.)

అప్పకవి దీనికి నాలుగు స్వంత లక్ష్యముల నిచ్చి నాడు.[26] అప్పకవికి ముందు చిత్రకవి పెద్దనయు, నాతనికిముం దనంతుడును—దీనికి లక్షణము చెప్పి నారు. అనంతుని భోజరాజీయమున దీనికి లక్షణ మున్నది. ఇంతమంది లాక్షణికులు—పై భారత పద్య మున—మ్మ—ంబకారములకు—ప్రాస మున్నదని తెలుపు చుండగా నీ ప్రాసయందు విశేష మేమియులేదని వ్రాయుట యవి మృశ్యకారిత్వము.

రెండవది. 'ద్విత్వమకారమునకు బిందుపూర్వక మకారమునకు ధ్వని సామ్యము లేదు.' అనగా— 'మ్మ—ంమ్'. 'ంమ'కు ధ్వని సామ్యము లేదని యర్థము. ఈ వ్రాత పైదానికన్న విపరీతము—అప్పకవి ధ్వని సామ్యమున్నదని చెప్పి—యిట్టి 'మ్మ' 'ంమ' ప్రాసకు లక్షణము చెప్పినాడు.

అనునాసిక ప్రాసము

గీ. తమకు తాము ద్విత్వంబులై తనరు నవియు
పూర్ణబిందుల డాపల బొరయు నవియు
గలసి యనునాసిక ప్రాసము లను పేర
సమలమరు కావ్యములయందుఁ దమకుఁ దాము

3—340.

....

క. తమ్ములను మల్లికా కుసు
మమ్ము లమరువాది పత్రమాలికలను భ
క్తిం మమ్మర సంహరు పూజలు
సంమదమున సలుప గలుగు సకలార్థంబుల్.

3—342.

కూచిమంచి తిమ్మకవి—ఈ ప్రాసకు—నన్నయ భారతమునుండి రెండు లక్ష్యములు—ప్రౌఢకవి మల్లన రుక్మాంగద చరిత్రనుండి యొక లక్ష్యము నుదాహ రించియున్నాడు. ప్రస్తుత వ్యాసకర్తలిట్లు—తాము పరిష్కరించి ప్రకటించిన గ్రంథము రెండవమాఱు మఱచుటయే గాక—అందు తామేది వ్రాసిరోకూడ విస్మ రించినారు—ఆ గ్రంథములోనే సమీక్షణము—35 వ పుటలో నిట్లున్నది—

'కుంమొనసి—తోబాటు 'కున్మొనసి' అని ప్రయో గింపబడెననుటకు వీలున్నది. కాని తా. ప. ప్రతులలో బిందుపూర్వక మకారరూపమే ప్రయుక్తముగా భావింప బడుతున్నది. మరియు బిందుపూర్వక, ద్విత్వమకార ముల ఉచ్చారణలో ధ్వని స్వామ్య మధికము.'

ఇట్లు 1970 లో వ్రాసిన గ్రంథ పరి ష్కర్తలు— నేడీ సంశోధిత మహాభారతమున క్రీ. శ. 1972 లో—

'ద్విత్వమకారమునకు బిందుపూర్వక మకార మునకు ధ్వనిసామ్యములేదు' అని యెట్లు పరస్పర విరుద్ధముగా వ్రాసిరో దురూహ్యము.

వ్యాసకర్తలకు—అనునాసిక ప్రాసమనగా నేదియో ప్రాసమైత్రి ప్రాసయనగా నేదియో అవగాహన కాక పోవుటచే పై సమీక్షణములో దీనిని గూర్చిన 32 నుండి 48 పుటలవఱకు గల పుటలు వ్యర్థము లైనవి—

(4) పుట 48. 'తిక్కనగారొక ప్రత్యేకమైన ప్రాసను ప్రయోగించినారు—అది యిది. 'ద్యూతక్రీడకు కొండొక నేర్తునే'— దీనినిగూర్చి కొంత చర్చించి యిట్లు వ్యాసకర్తలు వ్రాసినారు—'కూచిమంచితిమ్మనవి 'నేర్చున్'[27] నేర్చున్' అనువాటికి రేఫలోపములను చెప్పి నేతున్, నేచున్, అనురూపములు సాధించినారు. ఈ [28]సాధింపు తిక్కనగారి రక్షింపునకే యేమోమరి.'

26. ఈ ప్రాసకు లక్ష్యము లప్పకవీయము నందే యున్నవని—అప్పకవీయ భావప్రకాశికాకారులైన విద్వాన్ రావూరి దొరసామిశర్మగా రెఱుంగరు. వీనిని ప్రథమముగా నేను డాక్టరు పాటిబండ మాధవశర్మ గారి షష్టిపూర్తి సంచిక—(అక్షరార్చన) యందు— నన్నయ యతిప్రాసలు అను వ్యాసమున నిచ్చినాను.

చూడుడు — నా అప్పకవీయ తృతీయాశ్వాస వ్యాఖ్య.

27. ఇచ్చట 'నేర్తున్' అని యుండవలెను. ముద్రణదోషము— నేతున్ అనునది 'నేర్తున్' అను దానికిగాని నేర్చునకు రూపాంతరముకాదు.

28. 'సాధింపు'గాదు— సాధింపు— ముద్రణ దోషము.

వ్యాసకర్త అప్పకవీయమునైన పరిశీలింపక వ్రాసినదిది. అప్పకవి, తిమ్మకవికిముందే— రేఫలోపము అను శీర్షిక క్రింద—

క. ద్యూతక్రీడకు కొండొక
29నేతున్. (విరాట 1–196)

క. కాచికొనివచ్చి తగనా
నేచిన యట్లతఁడు. (మేన. 1–213)

అను తిక్కన ప్రయోగముల నిచ్చియే యున్నాడు. మఱియు నీ పుటయందే 'ఈ ప్రయోగమునకు ప్రమాణ మలభ్యము. మఱి ఇట్టి ప్రాసప్రయోగము కూడ అన్యత్ర లేదు.' అన్యత్ర ప్రయోగము లున్నవో లేవో పరిశీలింపకుండ—యిట్టి వ్రాత వ్రాయుట ఎంతమాత్రమును సరికాదు. 'నేతు' అను రూపమునకు—తిక్కనది గాక—యీ క్రింది రెండు ప్రయోగములు గలవు.

(1) ద్వి. నీ తలంపంతయు నిర్జరవైరి
నేతునే నెఱుగంగ.........

రంగనాథ రామాయణము — పుట. 344.
ఆంధ్ర విశ్వకళా పరిషత్ప్రకటితము.

(2) క. నేతును మంత్రము లందఱ
నేతును తద్రిపుల ప్రేవు లీ రణమునకున్

ప్రబంధ రాజవిజయ వేంకటేశ్వర విలాసము— 778 పద్యము.

నేచునకు రెండు ప్రయోగములు.

(1) ఉ. నేచియు నేరకుండియును—
తక్కిన పాదములు—చూచిన-తోచె, చూచు
దశకుమార చరిత్ర (3—40)

(2) క. నీ చే దారత్యంతము
నేచు కొనం గలరు......
వరాహ పురాణము—(12–77)

ఇవి యిప్పటికి—పదునైదేండ్ల క్రితమే ప్రకటితమైనవయిన వ్యాస కర్తలు చూడకుండుట వింత!

పై వానిలో 'నేచు'నకు కేతన దశకుమార చరిత్రలోని ప్రయోగము, తిక్కన భారతముకన్న ముందుదని యెఱుంగునది.

(5) 48 పుట—'దండక మొక విచిత్రమైనది. పాద విభజన లేదు కాబట్టి ఇది యీ పద్య విభాగమున చేరదు. మఱి గణముల ప్రయోగ ముండును గాన ఇటు వచన విభాగమున చేరదు.' దండకము వచన విభాగమున చేరదని—ఛందశ్శాస్త్రము

---

29. నన్నయయు నిట్టి ప్రాస ప్రయోగించినాడు. 'నిత్యసత్యవచను మర్త్యమరాధిపాచార్యు' (మత్యమరాధిపాచార్యు)— భార. ఆది. 1–9

30. భాషా పరిశోధన యతిప్రాస తత్త్వము—Annals of Oriental Research-Madras University—Vol. XV. 1958.

చూ. నా అప్పకవీయ తృతీయాశ్వాస వ్యాఖ్యానము.

చదువు ప్రతి ప్రాథమిక విద్యార్థికిని తెలియును. వ్యాస కర్తలకు తెలియదు. దీనినిబటి వ్యాస కర్తల ఛంద శ్శాస్త్ర పరిజ్ఞాన మింకను బాల్యదశ దాటలేదని గ్రహింపవచ్చును. ఇట్టివారు—మహాభారతము—ఛంద ప్రయోజనము—అను వ్యాసము వ్రాయుట కెట్లుద్య మించిరో దురూహ్యము.

తక్కిన ఛందోలక్షణ గ్రంథముల మాట యటుండ నిచ్చి వ్యాసకర్తలు ప్రసిద్ధమైన అప్పకవీయ మును గూడ చూడనట్లున్నది. అప్పకవీయమున చతుర్థాశ్వాసమున—దండకము పద్యములలో మాలికా వృత్తములలో చేరునని యిట్లు తెలుపబడినది.

గీ. మాలికా వృత్తములనంగ మఱియునైదు
దనరు నిరువదియాఱు చందముల మించి
యల లయగ్రాహి లయవిభాతి లయహారి
గదసహజ! త్రిభంగియు దండకంబులనఁగ

(4–246)

ఇంకను విమర్శింపవలసిన విషయములున్నను విస్తరభీతిచే విరమించుచున్నాను—

పై విషయములను పర్యాలోచింపగా నీ ఆను శాసనిక పర్వగ్రంథ సంపాదకులీ వ్యాసము నెంత మాత్రము పరిశీలింపలేదని విశదమగుచున్నది—సంశోధిత మహాభారతమువంటి యుద్గ్రంథమున నీ సంపుట మున — పై వ్యాసముండుటవలన—నీ ముద్రణోన్నత స్థాయిత్వమునకు భంగము కలుగుచున్నది—

సంపాదకులిది గుర్తింతురుగాక —

[సమాప్తము]

జూలూకవి ఆస్వాల్డ్ మ్షాలి

శ్రీ గార్డెన్ వింటర్

అనువాదం : శ్రీ ఎ. వి. ప్రసాద్

ప్రసిద్ధ జూలూకవి ఆస్వాల్డ్ మ్షాలి ఇదివరలో గిన్నెలు కడిగి, నేలతుడిచి జీవనం చేసేవాడు. పొట్టిగా, గుత్తంగా చిన్నగడ్డంతో ఆస్వాల్డ్ ఎంత సాధారణంగా కన్పిస్తాడంటే ఆయన మాకు బజారులో తటస్థపడితే పట్టించుకోకుండా వెళ్లిపోయేవాడు. మృదుభాషి, నెమ్మదస్తుడు అయిన 33 ఏండ్ల ఆస్వాల్డ్‌కు తన స్వదేశం దక్షిణ ఆఫ్రికాలో ఎంతో పలుకుపడి వున్నది. శ్వేతజాతీయులు అధికారం చలాయిస్తున్న ఆ దేశంలో వర్ణవిచక్షణకు వ్యతిరేకత తెల్పేవారిలో ఆయన ప్రముఖుడు.



జూలూకవి—శ్రీ ఆస్వాల్డ్ మ్షాలి

అయితే ఆస్వాల్డ్ రాజకీయవాది కాదు. ఆయన కేవలం ఒక కవి, రచయిత మాత్రమే. రెండేళ్ల క్రితంవరకు ఆయనపేరు ఎవరికీ తెలియదు. జోహాన్స్‌బర్గ్‌లోని ఒక ప్రకటన సంస్థలో ఆయన మెసెంజర్ బాయ్‌గా పనిచేస్తుండేవాడు. చిన్న స్కూటర్‌మీద పార్శిళ్లు తీసుకవెళ్లి ఇచ్చి వస్తుండటం ఆయనపని. వారానికి ఆయన సంపాదన 7 పౌండ్లు.

పోలియోతో వికలాంగుడైన లయొనెల్ అబ్రహమ్స్ అనే శ్వేతజాతి రచయిత, విమర్శకుడు ఆస్వాల్డ్‌ను అతని మనోభావాలను పద్యరూపంలో వెలువరించమని కోరాడు. దానితో ఆస్వాల్డ్ జీవితం హఠాత్తుగా మారిపోయింది.

'సౌండ్స్ ఆఫ్ ఎ కౌ హైడ్ డ్రమ్' పేరుతో ప్రచురింపబడిన ఈ సంపుటి ఎవరూ ఊహించనంతగా ప్రజామోదం పొందింది. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్ ఈ పుస్తకాన్ని ప్రచురించింది. ఇందులో 66 పద్యాలు వున్నాయి. వర్ణవిచక్షణ విధానంవలన దక్షిణ ఆఫ్రికాలోని కోటీ 50 లక్షల ఆఫ్రికన్లకు కలుగుచున్న అప్రీతికరమైన అనుభవాలను కొన్నిటిని ఆయన ఈ పద్యాలలో తెల్పారు.

ఆస్వాల్డ్‌కు రాజకీయాలతో సంబంధం లేకపోయినప్పటికీ, శ్వేతజాతీయుల సున్నిత భావాలను తాకేట్లు ఆయన రచన చేయగలిగాడు. వ్యంగ్యంగా, చేదుతీపితో, హాస్యంగా ఆయన వెలిబుచ్చిన అభిప్రాయాలు, శ్వేతజాతీయులను ఇంతకుముందు వారు ఎరుగని ఒక ప్రపంచాన్ని పరిచయం చేశాయి. కసిగాని, ప్రతీకారవాంఛగాని ఈ పద్యాలలో కన్పించవు. ఇందువలన శ్వేతజాతీయులు వీటిలోని భావాలను

వాస్తవమైనవిగానూ, విమర్శ నిజాయితీ కూడినది గానూ అంగీకరించారు.

విపరీతమైన ఖరీదువున్న ఆస్వాల్డ్ చిన్న గ్రంథం 17 వేల కాపీలు అమ్ముడుపోయింది. ప్రపంచంలో ఏ కవికైనా ఇంత అదృష్టం పట్టటం చాలా అరుదు. పైగా దక్షిణాఫ్రికా శ్వేతజాతీయుల జనాభా 35 లక్షలు మాత్రమే. శ్వేతజాతీయులు ఈ పుస్తకం కోసం త్రొక్కిసలాడారు. ఈ పుస్తకాన్ని ప్రస్తుతం 5 వ సారి ప్రచురిస్తున్నారు. దక్షిణాఫ్రికాలో ఒక పద్యసంపుటివలన ప్రచురణకర్తకు లాభం రావడం ఇదే ప్రథమం. ఆస్వాల్డ్‌కు గూడా 1500 పౌండ్లు రాయల్టీలు వచ్చాయి.

సంపుటిలోని ఒక పద్యంలో 26 పదాలు మాత్రమే వున్నాయి. నల్లజాతి పనివారి భావాలను ఇది సూక్ష్మరూపంలో ప్రతిబింబిస్తుం దనవచ్చు.

'కామందూ, నేను నీకు అపరిచితుడిని
కాని నాగోడు వింటావా ?
నీ ఇంటివెనుక చావిడిలో బ్రతికే
అనామకుడిని నేను'

శ్వేతజాతీయులలో నూటికి 90 మంది, తమ నౌకర్ల ఇంటిపేర్లు తెలుసుకొనాలనే ఉత్సుకత చూపించరని, ఇది దృష్టిలో వుంచుకొని ఈ పద్యం రాశానని ఆస్వాల్డ్ చెప్పారు.

ఈ సంపుటికి ప్రపంచవ్యాప్తంగా పేరు రావడంవలన జోహెన్స్‌బర్గ్‌లోని లిబరల్ వార్తా పత్రిక 'ది రాండ్ డెయిలీ మెయిల్' తమకు కాల మిస్ గా పనిచేయమని ఆస్వాల్డ్‌ను కోరింది. తన నల్లజాతి ప్రజలు భయాలను, నిరాశలను వెల్లడించేందుకు ఆయన ఈ అవకాశాన్ని వినియోగించు కుంటున్నాడు.

అయితే ఆశ్చర్యకరమైన దేమంటే ఆస్వాల్డ్‌ను దక్షిణాఫ్రికా ప్రభుత్వం సహించి వూరుకొనటం. ఆయన పుస్తకానికి పెద్ద పేరువచ్చి దేశంలోని పత్రిక లన్నీ ఆయనను గురించి మొదటిపేజీలలో వ్రాసినపుడు భద్రతాధికారులు ఆయనను పిలిపించి రెండుగంటలు ఇంటర్‌వ్యూ జరిపారు. తాను 'కమ్యూనిస్టు ప్రేరణతో' పనిచేస్తున్నామో కనుగొనటానికి మాత్రమే వారు ప్రయత్నించారని ఆస్వాల్డ్ చెప్పారు. అండర్‌గ్రౌండ్ ఉద్యమంతో తనకుగాని, తన కుటుంబానికిగాని సంబంధం లేదని తెలుసుకున్న అనంతరం వారు సుఖంగా ఊపిరి తీసుకున్నారని ఆయన అన్నాడు. ఆయన విద్రోహ రాజకీయ ఉద్దేశ్యాలులేని వ్యక్తిగా ప్రభుత్వం గుర్తించిందని అనుకోవచ్చు.

ఆస్వాల్డ్, భార్య మార్గరెట్, వారి 15 నెలల కుమార్తె, పౌలెట్‌లో నివసిస్తున్నారు. 'సువర్ణ నగరం'గా పేరు పొందిన జోహెన్స్‌బర్గ్‌కు అవసరమైన 10 లక్షల నల్లజాతి కార్మికులు నివసించే టౌన్‌షిప్ లలో ఇది ఒకటి. ఆస్వాల్డ్ నివసించే అగ్గిపెట్టంత ఇంటికి స్నానాలగదిగాని, కరెంటుగాని లేదు.

ఆస్వాల్డ్ విశ్వవిద్యాలయాలలో విద్యాభ్యాసం చేయలేదు. ఆయనకు ఆ స్తోమతు లేకపోయింది. తన పుస్తకానికి ఒక ప్రజామోదం లభించటం ఆయనకు చాలా ఆశ్చర్యం కలిగించింది. దేశంలో రాజకీయ సాంస్కృతిక రంగాలలో ముఖ్యమైన మార్పులు జరుగ వచ్చునని శ్వేతజాతీయులు గుర్తిస్తున్న 'సరియైన సమయంలో' తన పుస్తకం వెలువడంవలన అది అంతగా విజయవంతమయిందని ఆయన తేలికగా కొట్టివేస్తాడు.

ఏకశిలగావున్న వర్గ విచక్షణా విధానం కదిలి పోతున్నదని, శ్వేతేతర జాతీయుల జీవన పరిస్థితులలో వచ్చే 5 ఏండ్లలో పెద్ద మార్పులు శాంతియుతంగా జరుగనున్నాయని ఆయన గట్టిగా నమ్ముతున్నాడు.

(ఫోరం వరల్డ్ ఫీచర్స్)

ఆంధ్రప్రదేశ్‌లో విద్యుచ్ఛక్తి

డా॥ ఎమ్. ఎల్. కాంతారావు

ఆర్థికంగా వెనుకబడిన భారతదేశంలోని రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ ఒకటని అందరకు తెలిసిన విషయమే. ఈవిధంగా ఆంధ్రప్రదేశ్ వెనుకబడడానికి కారణాలు అనేకం. కాని వాటిలో విద్యుచ్ఛక్తి కొరత ముఖ్యమైంది. చౌకగా, విరివిగా విద్యుచ్ఛక్తి లభించక పోవడమనేది ఆంధ్రప్రదేశ్‌కు ఈనాటి సమస్యకాదు. గత 30, 40 సంవత్సరాలుగ ఇది సమస్యగానే ఉంది. ఈ విద్యుచ్ఛక్తిలేమి, విద్యుచ్ఛక్తి ఉత్పాదనకు అవసరమైన సహజవనరుల లోటువలన ఏర్పడింది కాదు. విద్యుచ్ఛక్తిని జనింపచేయడానికి సాధారణంగా నీరు, బొగ్గు, నూనెలు మున్నగునవి ఉపయోగపడతాయి. ప్రస్తుతకాలంలో యురేనియమ్ పరమాణువులను విచ్ఛిన్నం చేయుటవలనకూడ విద్యుచ్ఛక్తిని ఉత్పత్తి చేస్తున్నారు. వీటినే పరమాణు (న్యూక్లియర్) విద్యుచ్ఛక్తి కేంద్రాలంటారు. ఆంధ్రప్రదేశ్‌లో పుష్కలంగ నీరు, బొగ్గు లభ్యమౌతాయి. ఒక్క ఆంధ్రప్రాంతంలో లభించే నీటిద్వారానే, 15 లక్షల కిలోవాట్ల విద్యుచ్ఛక్తిని చేయువచ్చునని అంచనా వేయబడింది. కొత్తగూడెం, రామగుండం బొగ్గు ఉత్పత్తికి ప్రఖ్యాతిచెందిన ప్రాంతాలు. అణువిద్యుత్ కేంద్రాలను స్థాపించడానికి అనువైన ప్రదేశాలున్నాయి. అయినప్పటికి భారతదేశంలోని చాలా రాష్ట్రాలకన్నా విద్యుచ్ఛక్తి విషయంలో ఆంధ్రప్రదేశ్ వెనుకబడి ఉంది.

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామికంగా వెనుకబడి ఉండడానికిగాని, వ్యవసాయరంగంలో చాలినంత అభివృద్ధిని సాధించక పోవడానికిగాని విద్యుచ్ఛక్తి కొరత ముఖ్యకారణం. ఆంధ్రరాష్ట్రం ఏర్పడకముునుపు కూడ, సంయుక్త మద్రాసు రాష్ట్రంలోని ప్రశస్తమైన జలవిద్యుచ్ఛక్తి కేంద్రాలయిన పైకారా, పాపనాశనం, మెట్టూరు ప్రాజెక్టులవలన ఆంధ్రేతర ప్రాంతాలకు మేలు కలిగిందేగాని ఆంధ్రప్రాంతానికి కాదు. 1951 లో ఆంధ్రప్రాంతపు తలసరి విద్యుచ్ఛక్తి వినియోగం 2.5 యూనిట్లు కాగా అవశిష్ట మద్రాసు రాష్ట్రంలో తలసరి విద్యుచ్ఛక్తి వినియోగం 16 యూనిట్లు. మైసూరులో 44 యూనిట్లు ఉండేది. ప్రథమ పంచవర్ష ప్రణాళిక ప్రారంభంలో ఆంధ్రప్రాంతంలో విద్యుచ్ఛక్తి ఉత్పాదన కేవలం 21,400 కిలోవాట్లు (21 మెగావాట్లు) ఉండేది. ఇది 1956 నాటికి 62,200 కిలోవాట్లకు (62 మెగావాట్లు) పెరిగింది. కాని ఇది మద్రాసు రాష్ట్రంలోని విద్యుచ్ఛక్తి ఉత్పాదనకంటె చాల తక్కువ. 1954 లో ఆంధ్ర, మద్రాసు ప్రాంతాలు విద్యుచ్ఛక్తి పరిశ్రమల విషయంలో ఏవిధంగా ఉండినది ఈ క్రింది పట్టిక సూచిస్తుంది.

వివరణ	ఆంధ్రప్రాంతం	మద్రాసు	ఇండియా
1. విద్యుదుత్పాదకశక్తి	34,517 కి.వా	2,41,570	24,93,996
2. వెయ్యిమంది జనాభాకుగల సగటు ఉత్పాదకశక్తి	1.68 కి.వా	6.62	6.89 కి.వా
3. చదరపుమైలు విస్తీర్ణానికి గల సగటు ఉత్పాదకశక్తి	0.54 కి.వా	3.75 కి.వా	1.96 కి.వా
4. ఫ్యాక్టరీలలో పనిచేయు కార్మికుల సంఖ్య	96339	301035	25,28026

మూలం :— ఇండియా 1956.

20 సంవత్సరాలనాడుకూడ ఆంధ్రప్రాంతంలో విద్యుచ్ఛక్తి ఉత్పాదన చాల తక్కువగా ఉండినదని విద్యుచ్ఛక్తి విరివిగా లభింపకపోవడంవల్ల పారిశ్రామికీకరణం కూడ దెబ్బతిన్నదని పై పట్టికనుండి గ్రహింపవచ్చు.

ఆంధ్రప్రదేశ్‌లో పుష్కలంగా నీరు ఉత్పత్తి... చేయవచ్చు. ఆంధ్రప్రదేశ్ మొత్తంలో సుమారు 2,500 మెగావాట్ల జలవిద్యుచ్ఛక్తి ఉత్పాదనకు (60 శాతం లోడ్‌ఫాక్టరీ) అవకాశం ఉంది. బొగ్గు ఉత్పత్తిచేసే రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ నాల్గవ స్థానాన్ని ఆక్రమిస్తుంది. ఈ రాష్ట్రంలో సుమారు 100 కోట్లటన్నుల బొగ్గు లభిస్తుందని అంచనా. కొత్తగూడెం, రామగుండం...

1950–1970 మధ్య ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 340 కోట్ల రూపాయలు విద్యుచ్ఛక్తికై పెట్టుబడి పెట్టబడింది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రణాళిక లకై పెట్టిన పెట్టుబడిలో ఇది దాదాపు 33 శాతం. అయినప్పటికి కాలం గడుస్తున్నకొద్ది విద్యుచ్ఛక్తి కొరత పెరుగుచున్నదే కాని, తగ్గడంలేదు. విద్యుచ్ఛక్తి డిమాండ్‌కు, విద్యుదుత్పాదనశక్తికి మధ్యగల అంతరం 1971–72లో 228 మెగావాట్లుకాగా 1972–73 లో 358 మెగావాట్లు గత 3,4 సంవత్సరాలుగ విద్యుచ్ఛక్తి ఉత్పాదకశక్తిలో గణనీయమైన పెరుగుదలలేదు. కాని విద్యుచ్ఛక్తికి డిమాండ్ మాత్రము సంవత్సరమునకు 15 శాతము పెరుగుచున్నది. విద్యుత్తు ఉత్పత్తి శక్తి డిమాండ్‌కంటే 1.4 రెట్లు పెరిగినగాని విద్యుత్తుకొరత తప్పదు, 1973–74 లో విద్యుచ్ఛక్తి డిమాండ్ 884 మెగావాట్లు అయిన ఇది 1988–89 నాటికి 4250 మెగావాట్లకు పెరుగునని అంచనా వేయబడినది. అంటే విద్యుదుత్పాదనశక్తి 1988–89 నాటికి కనీసము 5500 నుండి 6000 మెగావాట్లకయినా పెరగవలెను.

1970–71 లో భారతదేశంలోని తలసరి విద్యుచ్ఛక్తి వినియోగం 81 యూనిట్లు కాగా ఆంధ్రప్రదేశ్‌లో ఇది 50 యూనిట్లు మాత్రమే. దక్షిణాది నాలుగు రాష్ట్రాలలో, తలసరి విద్యుచ్ఛక్తి వినియోగం ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే తక్కువ. 1970–71 లో తలసరి విద్యుచ్ఛక్తి వినియోగం మహారాష్ట్రలో 153 యూనిట్లు, పంజాబ్‌లో 140, తమిళనాడులో 130, మైసూరులో 101 కాగా ఆంధ్రప్రదేశ్‌లో 50.5 యూనిట్లు మాత్రమే ఉండినది. అంతేకాదు నాల్గవ పంచవర్ష ప్రణాళిక అంతానికి భారతదేశపు విద్యుచ్ఛక్తి ఉత్పాదన శక్తి లక్ష్యం సుమారు 23000 మెగావాట్లు కాగా ఆంధ్రప్రదేశ్ లక్ష్యం 888 మెగావాట్లు మాత్రమే. అంటే భారతదేశపు లక్ష్యంలో 3.8 శాతము మాత్రమే. అంతేకాదు హర్యానా మున్నగు రాష్ట్రాలలో అన్ని గ్రామాలకు, పట్టణాలకు విద్యుచ్ఛక్తి సౌకర్యాలు విస్తరింపబడగా, 1972 మార్చినాటికి విద్యుచ్ఛక్తి సౌకర్యంగల పట్టణాలు, గ్రామాలు ఆంధ్రప్రదేశ్‌లో 34 శాతం మాత్రమే. విద్యుచ్ఛక్తి ఉత్పత్తి తక్కువగా ఉండుటయేగాక, విద్యుచ్ఛక్తిని ఒక ప్రాంతమునుండి వేరొక ప్రాంతమునకు పంపుటలోకూడ విద్యుచ్ఛక్తి నష్టశాతము ఆంధ్రప్రదేశ్ లోనే హెచ్చుగా నున్నది. 1968–69 లో నష్టశాతము 26. దీనిని కనీసము 14 కైనా తగ్గించవలెనని ప్రణాళికా సంఘము సూచించియున్నది.

రాష్ట్ర ఆర్థికాభివృద్ధి భవిష్యత్తులోనైనా ఉజ్వలంగా ఉండాలంటె, విద్యుచ్ఛక్తి ఉత్పత్తిని తగినంతగా పెంచడానికి సత్వరం కృషి చేయాలి. విద్యుచ్ఛక్తిని పంపుటలోగల నష్టాన్ని తగ్గించాలి. గ్రామీణ ప్రాంతాలకు ముఖ్యంగ కరువుప్రాంతాలకు, వెనుకబడిన ప్రాంతాలకు విద్యుచ్ఛక్తిని సప్లయి చేయాలి. పెద్దఎత్తున కేంద్ర ప్రభుత్వం సహాయము చేయకపోయినచో ఆంధ్రప్రదేశ్ విద్యుచ్ఛక్తి విషయములో పొరుగు రాష్ట్రముల స్థాయినైనా చేరుకొనుట కష్టము. ఐదవ పంచవర్ష ప్రణాళికలో రాష్ట్ర ప్రభుత్వము సుమారు 450 కోట్ల రూపాయలను ఖర్చుపెట్టినను, కేంద్రప్రభుత్వముకూడ సుమారు 500 కోట్ల రూపాయల పెట్టుబడిగల అణువిద్యుచ్ఛక్తి కేంద్రమును, సూపర్ థర్మల్ కేంద్రములను స్థాపించవలెను. శ్రీశైలము, దిగువసీలేరు ప్రాజెక్టులకు కావలసిన ద్రవ్య వనరులను వెంటనే సమకూర్చడం ఎంతైనా అవసరం. జలవిద్యుచ్ఛక్తి ప్రాజెక్టులు, అణువిద్యుచ్ఛక్తి ప్రాజెక్టులు థర్మల్ విద్యుచ్ఛక్తి ప్రాజెక్టులు స్థాపించుటవలన విద్యుచ్ఛక్తి ఉత్పత్తి విస్తృత ప్రాతిపదికపై జరుగును. విద్య, విద్యుచ్ఛక్తి, పరిశ్రమలు లేకుండా ఆధునిక రాష్ట్రాలు మనలేవని, విద్యుచ్ఛక్తి లేని రాష్ట్ర భవిష్యత్తు అంధకార బంధురమని గ్రహించి, విద్యుచ్ఛక్తికి ప్రణాళికలలో అత్యంత ప్రాధాన్యాన్నివ్వాలి.

కలగూరగంప

పండిత రాయల వెక్కిరింపులు

నవంబరునెలలో పండిత రాయల వెక్కిరింపులపైఁ గొన్ని యనుమానములు పత్రికా ముఖమున తెలియఁ జేయఁబడినవి. వానిపై డిసెంబరునెలలో మహీధర నళినీమోహన్‌గారు సమాధాన మొసంగిరి. వారి విమర్శకు నా సమాధానము తప్పక ప్రచురింప ప్రార్థన.

1. ధూర్త—శ్లేషగా రెండర్థాలు వచ్చునట్లు వ్రాసినానని యన్నారు. తథాస్తు. మూలమున పండిత రాయలు 'ధుత్తూర! ధూర్త! అని రెండు పదముల నేల ప్రయోగించిరో పాఠకులు గమనింప ప్రార్థన.

2. 3 లలో పదములు వదలిన నర్థము చెడిపోయే ప్రమాదము లేదన్నారు. ఇది సత్యమా? మూలార్థ మెట్లవగత మగునో తెలియరాకున్నది.

4. 6–7. మక్కికి మక్కి యనువాదము చేయలేదని నా యర్థము గాదు. కొన్ని పదములు— కొన్ని ప్రయోజనవంతములు నర్థవంతములు నైనవి విడువబడినవే యని నా భావన.

5. యతిభంగమని వ్రాసినాను. కాదు 'అఖండ యతి' యని ఢంకా బజాయించి భీమకవి యండ గొన్నారు. కాదనను. అఖండయతి నాధారము చేసికొని దానినే ధారాళముగాఁ బ్రయోగించుట యంత యుచితము గాదు. అందులో సొగసు—సౌకుమార్యము లోపించును. ఎల్లపుడు దానినే ప్రయోగించుట కవితా పాటవమునకు మంచిది గాదని నా తలంపు. ఇట్లఖండ యతి ప్రయోగించి పద్య రచన చేయగలవారెందరో యున్నారు. పాండిత్యము—రచనాశక్తి లేనివారి కది యాలంబన కాఁగలదు. అన్యులద్దాని నంటిపెట్టుకొనుట భావ్యము గాదని మనవి.

నళినీమోహన్‌గారి యనువాద మనుమోదముగా నున్నది. అది ప్రత్యక్షర సత్యము—నా యీానుడిని సౌహార్దముగా స్వీకరింతురని మనవి.

—శ్రీ పాతకోట రాధాకృష్ణమూర్తి.

కీ. శే. శ్రీమాన్ రామచంద్రాచార్య రామదాసయ్యంగార్ల ప్రసంగ స్వరూపము

1974 ఫిబ్రవరి భారతిలో కలగూరగంపలో నెల్లూరు వాస్తవ్యులు శ్రీమాన్ నేలటూరు రామదాసయ్యంగారు మరణించిరన్న దారుణ వార్త ప్రకటించ బడినది. అందులో వారి అభ్యస్త విద్యాదులు పేర్కొనబడినవి. దానిలో 'శ్రీ రామదాసయ్యంగారు శ్రీ విక్రాల రామచంద్రాచార్యుల వారితో శాస్త్ర చర్చకు దిగి—తన వాదోపవాద నైపుణిని చాటి గెలిచిన దిట్ట' అని ఆ శీర్షిక వ్రాసినవారు వ్రాసిరి. కాని ఆ శాస్త్ర చర్చ ఏ శాస్త్ర సంబంధమైనదో—ఎప్పుడో – ఎచ్చటనో—ఎంతదో—వ్రాయరైరి. వారు ఏలకో వాటిని వ్రాయక విడచినందున ఆ విషయము పెద్దలవల్లను పత్రములవల్లను నెఱింగిన నాకు వ్రాయుట కవకాశము కలిగినందులకు సంతోషించు చున్నాను. ఆ విషయము—మా తండ్రిగారు విద్యారణ్య పంచానన విద్యావాచస్పతి శ్రీమాన్ కళత్తూరు విక్రాల రామచంద్రాచార్యులవారు శాస్త్రములను తఱచి తాము కనిపెట్టిన భీష్మ వివాహ సిద్ధాంతము.

ఇది శ్రీ యాచార్యులవారు నెల్లూరు గుంటూరు మున్నగు పట్టణములలో పలుపండిత సభలయందు పలుమారు లుపన్యసించినారు. శ్రీ యాచార్యులవారి కెచ్చటను ఎదురువాదము రాలేదు. నెల్లూరులో 1923 వ సంవత్సరము ఆరంభములోను, ఆగస్టు నెలలోను రంగనాయకులపేటలో శ్రీరంగనాథాలయమునందు మూడు ఉపన్యాసములు చెప్పిరి. మఱియొ

నెల్లూరులోనే 3–3–1925 ది నాడు పురసౌధము (టవున్‌హాలు)నందు ఈ యుపన్యాసములు చెప్పిరి. అప్పుడు శ్రీ అయ్యంగారు తమ గురువుగారు చెప్పి అడుగుమనిన ప్రశ్నములను అడిగిరి. ఆ ప్రశ్నలు వారి గురువుగారు అడుగుమని చెప్పిపంపినవి అని శ్రీ యాచార్యులవా రెఱింగి 'పాపము. చిలుక పలుకులు ఇవియేనా? కొన్ని మఱచితివా?' అని యడిగి 'ఐనను ఈ ప్రశ్నలకు తావు లేకుండా ఉపన్యాసములో విష యము జెప్పినాను. దానిని విద్వాంసులు గ్రహించినారు. ఆ శాస్త్ర చర్చ అర్థముకాక—గురువుగా రడుగుమనిన వాటిని యడిగినావు. అని నుడివి మఱునాడు (4 వ తేది) సభలో అయ్యంగారడిగిన ప్రశ్నలను చెప్పి ముందు తాము చెప్పిన ఉపన్యాసమునందు ఏ పట్టు ఆ ప్రశ్న లకు సమాధానమైనదో నుడివిరి. క్రమ్మఱ అయ్యం గారు కొంత ప్రసంగము సలుప దొడంగి శ్రీ యాచార్యుల వారి మహోపన్యాసమును విని నిరుత్తరులై కూర్చునిరి. సభ అధ్యకుల మలి పలుకులతో సమాప్తమైనది. జరిగినది యిది. ఇట్లుండ కొంత మార్చి తమ అభి మాన పాత్రులకు ఖ్యాతిని గలిగించ నుద్దేశముతో కీర్తిశేషులయిన ఒక ప్రఖ్యాత పండితుని గెలిచెనని లేనిది కల్పించి వ్రాయుట అనుచితమని పై వ్యాస కర్తగారికి మనవి జేసుకొనుచున్నాను.

తే 11–1–1974 ది గల జమీన్‌రైతు పత్రికలో పడిన వ్యాసమునందును 'ఆ చిలుకయే 'యింకను కొన్ని పలుకులు పలుకుచున్నది. అని రామదాసుగారు అందుకొని జవాబు చెప్ప దొడంగిరి. అట్టి సభలే నేడు కానరావు' అని జరిగినమట్టుకు ఆ వ్యాసకర్తగారు వ్రాసిరి.

పై రెండు దినముల సభలకు నెల్లూరు వాస్తవ్యులేయైన శ్రీమాన్ కొమాండూరు పార్థసారథి అయ్యంగారు అధ్యకులు. ఆ సభలలో శ్రీమాన్ మా తండ్రిగారి ఆ యుపన్యాసములను విని మహాపండితు లైన శ్రీమాన్ నడాదూరు రంగరామానుజాచార్యుల వారు (నెల్లూరు వేదసంస్కృత కళాశాలోపాధ్యాయులు), శ్రీమాన్ కోటి కన్యాదానం సుందరరాజ తాతాచార్యుల వారు (నెల్లూరు వి. ఆర్. కాలేజి పండితులు) మున్నగు ఉద్దండపండితులు ప్రశంసించిరి.

మా తండ్రిగారి ఈ భీష్మవివాహ నిరూపణోప న్యాసము 13—4—1925 నాడు గుంటూరులో రామచంద్రపురము అగ్రహారములో శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి సన్నిధియందు జరిగినది. సభాధ్యకులు శ్రీమాన్ కిడాంబి వేంకటరామానుజాచార్యులవారు, సభ నలంకరించిన విద్యావారిధి మహామహోపాధ్యాయ కళాప్రపూర్ణ మధ్వశ్రీ కాశీకృష్ణాచార్యుల వారు, శ్రీమాన్ వింజమూరి భావనాచార్యులవారు మున్నగు మహావిద్వాంసులు 'ఇది ముందు ఏ పండితుడు కను గొనని శాస్త్రనిగూఢ రహస్యము' అని ప్రశంసించిరి.

ఆచార్యులవారి ఈ భీష్మవివాహోపన్యాస సభ లలో జరిగిన యిట్టి యంశము (చర్చ)లతోటి నా రచించిన విస్తృతమైన* పీఠికతోగూడా మా తండ్రి గారి ఈ భీష్మవివాహ నిరూపణ గ్రంథము నేను స్థాపించి నడుపుచున్న 'విక్రాలవాణి' గ్రంథమాలలో 12 వ ప్రసవముగ అచిరకాలములో ప్రకాశితము కానున్నది—అని విద్వల్లోకములో విన్నవించు భాగ్యము నాకు కలిగినందులకు ఆనందించుచున్నాడ.

—శ్రీ వికాల్రి శేషాచార్యులు.

అరవై యేళ్ల ఆంధ్ర సాహిత్యంలో నిలిచేది

ఆర్యా,

అరవైయేళ్ల ఆంధ్ర సాహిత్యంలో 'నిలిచేది' అనే శీర్షిక బదులు, అరవైయేళ్ల ఆంధ్ర సాహిత్యంలో

* మా తండ్రిగారు పరమపదించిన 27 యేండ్లకు వారి ఈ భీష్మ వివాహ నిరూపణ గ్రంథ మును చదివి అందలి కొన్ని యంశములను గ్రహించి వాటిమీాద ఆక్షేపములను వెలిబుచ్చుచు అయ్యంగారొక ఒక వ్యాసమును వ్రాసి 1959 సంవత్సరము భారతిలో ప్రకటించిరి. దాని ఖండనమున్ను నా పీఠికలో అను బంధముగా జదువవచ్చును.

'నాకు నచ్చినది' అనే శీర్షిక క్రింద శ్రీ నోరి నరసింహ శాస్త్రిగారు తమ యిష్టానిష్టాలను ప్రకటించివుంటే సముచితంగా వుండేది!

'దరిశి చెంచయ్యగారి ఆత్మకథ (పేరు జ్ఞాపకం లేదు) నిలుస్తుంది' అనే వాక్యం ఒక్కటి చాలు!-- పేరే జ్ఞాపకం లేనప్పుడు నిలవడం ఏమిటో?

'వేయి పడగలు' నిలువదు కాని 'మోహనవంశి' నిలుస్తుందట!

'మాలపల్లి'లో మొదటి భాగం ఒక్కటే నిలిచి, మిగతా రెండు భాగాలూ పోతాయట! ఎక్కడికి పోతాయి, చెద తినిపోతాయా? మొదటి భాగం మాత్రం చదివి, నోరివారన్నారుకదాఅని, తతిమా రెండు భాగాలూ చదవకుండా, కథ అంతటితో వదిలి పెట్టేస్తారా! లేక అవి అసలు ముద్రించరా!

గోపీచంద్ నవలలు 'ఏవేవో వాదాలూ, పద్ధతులూ వుండటంవల్ల ఆయాభావాలతోనే అంతరిస్తవి'ట! కాని 'చీకటి గదులు' అనే పూర్తికాని నవల మాత్రం నిలుస్తుందట!

నవలలో కొన్ని భాగాలూ, అసంపూర్తి నవలలూ 'నిలవడం' ఏమిటో వ్యాసకర్తకే తెలియాలి!

పై చూపినవి కేవలం ఉదాహరణలు—వ్యాసం ఎంత హాస్యాస్పదంగా వున్నదో ఎత్తిచూపటానికి.

మంచి రచయితగా, విమర్శకునిగా, పండితునిగా (సమదర్శిగా?) భావించబడుతున్న శ్రీ నోరివారు వ్రాయదగిన వ్యాసం కానేకాదు! రామలింగారెడ్డిగారికి 'కవిత్వతత్త్వవిచార' రచనలో 'అహంభావమూ, అధికార గర్వాంధమూ' కట్టబెట్టడం కూడా సరసంగా లేదు! శ్రీ నోరివారి 'రుచు' లెలా వున్నా, వాటిని 'అనుశాసనం' క్రింద రూపొందించడం మాత్రం పెద్ద సాహసమే!

—శ్రీ ఆర్. ఎస్. సుదర్శనం.

రనండి—పోనండి

భారతి—మార్చిలో 74—లో 'మణిప్రవాళమూ—అరుద్రా' అనే శ్రీ టి. జి. కృష్ణారావుగారి వ్యాసంలో 'రనండి' అనేమాట Run నుంచి యేర్పడ్డట్టు భావించబడింది. ఎవరూ 'రనుతూ వున్నారా?', 'రనుదామా?' ఇత్యాది కృతకరూపాలు వాడరంటే, వాడరేమోగాని, మా (నెల్లూరు) జిల్లా వాళ్లమాత్రం 'రనండి, పోనండి' అనేమాటలు అప్పటమైన వ్యావహారిక రూపాలుగా వాచా అంటారూ, రచనలో ప్రయోగిస్తారూ.

రండి, రండి—పొండు, పొండి అనేవి గ్రాంథిక రూపాలే. రాండి, పోండి అనేవి వ్యావహారిక రూపాలు. రనండి. రానండి — పొనండి, పోనండి — అనేవి మావైపు పల్లెటూళ్ల వాడుకలు. అందువల్ల రనండికి, Run కి సంబంధం లేదనుకుంటాను.

రానాటికి (రావడానికి), పోనాటికి (పోవడానికి) అని మావైపు వాడుకలు. అయ్యా సందర్భాలలో వచ్చే ద్రుతాగమానికీ Run లో వుండే n కూ సంబంధంలేదని నా అభిప్రాయం. పదండిని పొండి అని అంటాము మేము.

Run అండి, Win అండి—అనే అర్థాల్లోనే నేనూ రాశాను అని ఆరుద్ర అంటే నా కాక్షేపణ లేదు గాని, 'Run అండి' కాని 'రనండి' (రండి) ఒకటి మావైపు వాడుకలో వున్నదని మాత్రమే నే జెప్పవచ్చింది.

—శ్రీ బండి నాగరాజు.

వసుచరిత్ర— క్రొత్త తాళపత్రప్రతి

ప్రకాశంజిల్లా కనిగిరి తాలూక—పరిసర జనపదములు సంచరించునపుడు—అగ్రహారమను గ్రామమున—ఒక సంపన్న గృహస్థు నింట—నీ తాళపత్రగ్రంథము లభించినది. అందు కొంతభాగము—కవిత్రయ భారతమున చివరి—5 పర్వములు—మిగత భాగము వసుచరిత్ర. ఇది తొలినుండి మూడాశ్వాసములవరకే ఉన్నది. పుటకు—8 పంక్తు లున్నవి. చాల జిలుగు వ్రాత. శ్రమైక సాధ్యము. కొన్ని పాఠములు—

నేడు ముద్రితమ్మైన వసుచరిత్ర కన్న ప్రత్యేకముగ నున్నవి:—వాటి వివరము లీ క్రింద ఆ శ్వాస క్రమమున పొందుపరచు చున్నాను.

	అచ్చు ప్రతి	తాళపత్రము
1. ఆ. 47.	పద్య	
	అతదుర్వింజెందె	అతులైశ్వర్యంబు
48.	యపరబుద్ధి	యపరవృద్ధి
40.	చపలాన్వితుండై	లాంచితుడై
30.	భావంబు	భోగంబు—(యతి దోషం)
56.	వివృతాగ్ర్య	వివృతాస్య
83.	...క్ష...	త్విం
100.	వాటించు	పండించు
110.	దివి వారల్	దివి వారప్పిటి
2. ఆ. 9.	ముఖంబున	ముఖంబుల
10.	విషంబునన్	ముఖంబునన్
	బాలు విూటితివి	పోవ నూకితివి
16.	గానం బుర్వి	నాదం బుర్వి
25.	నచ్చటం	నంతటం
29.	నన్	లోన్

ఇట్లనేక పాఠాంతరములు మారియున్నవి. తొలి యాశ్వాసము 110 పద్యమందు యతి దోషమును నేను దోలుదొల్త గుర్తించి భారతి సంపాదక లేఖలలో వ్రాసిన పిదప—శేషాచలం అండ్ కంపెనీవారు వెలువరించిన వసుచరిత్రలో పండిత పరమేశ్వరులు—శ్రీ రావూరి దొరసామిశర్మగారు దోషమును దిద్ది—సవరించి వ్రాసిరి. ఇంకను కొన్ని పాఠము లుండి యుండును. ఈలోగా. మిత్రులు—శ్రీ డా. బి. రామరాజుగారు ఒక పర్యాయము పంపుమనగా వారికి పంపినాను.

ఇట్లే ఈ ప్రాంతమున నుండు పల్లెలలో—అటనట తాళపత్రగ్రంథములు లభించు చున్నవి. నాకు కొన్ని గ్రంథములు లభించినవి. 1. చంద్రవర్మ చరిత్రము, 2. నరసింహగురు చరిత్రము, 3. బ్రహ్మోత్తర ఖండము, 4. వకుళభూషణ భాస్కరోదయము, 5. ఆవులమేపు మున్నగునవి లభించినవి.

ఒకరికడ నొక గ్రంథమున్నదని తెలిసి విచారింపగా, అది దేవతార్చనలో నున్నదనియు తీయరాదని వారు చెప్పిరి— నేడు కూడా ఇట్టి వ్యక్తులుండుటాశ్చర్యము.

ఇవన్నియు— ఉద్ధరించువారలకై— అన్వేషించు చున్నాను—

— శ్రీ కొమాండూరి రామానుజాచార్యులు.



గ్రంథవిమర్శలు

పాండవ ధార్తరాష్ట్ర సంభవమ్

(కవి : వాసిష్ఠ గణపతిముని, ప్రతులకు : ఎ. నరసింహశర్మ, లెక్చరర్ : ఎస్. ఎమ్. ఎస్. టి. కాలేజి, ప్రొద్దుటూరు, కడపజిల్లా, మూల్యం 2–00).

వయస్సు పదునొకండు సంవత్సరాలు. విద్యార్థి దశ. పెద్దల సమక్షములో వారి ఆదేశానుసారంగా కౌరవ పాండవుల జనన కథ రెండున్నర గడియలలో ఆశుధారా రూపంగా చెప్పిన కావ్యం ఇది. 34 శ్లోకాలు. చెప్పిన విద్యార్థి అయల సోమయాజుల సూర్యగణపతి.

శ్రీకాకుళం జిల్లా అరసవల్లి గ్రామములో వేంచేసిఉన్న సూర్యదేవుని అనుగ్రహముతో, వారణాసి యం దవతరించి ఉన్న ఢుంఢి గణపతి అంశతో జన్మించిన వాడు కనుక 'సూర్య గణపతి' అని తలిదండ్రులు నామకరణం చేశారు. కాలక్రమాన ఐచ్ఛికంగా తానే 'సూర్య' పదం వదిలివేశానని చెప్పాడాయన. తిరువణ్ణామలై వెళ్లి రమణ మహర్షి అంతేవాసియై తపస్సు చేసి ముని అయాడు. గోత్రనామం 'వాసిష్ఠుడు'—

అయిదేళ్ల దాటేవరకూ నోటమాటరాని బాల గణపతి పదునొకండవ ఏట పలికిన చిన్నారి సంస్కృత కావ్యం ఇది. కనుక ఆ వ్యక్తి ఆంతర వ్యక్తిత్వాన్ని గురించి విశేషించి చెప్పనక్కరలేదని నా ఉద్దేశం. తపస్వి అయిన తరుణములో వ్రాసిన ఉమాసహస్రమ్ ఎంత గంభీరంగా ఉందో చిన్నారి వయసునాటి యీ కృతి కూడా అంత గంభీరార్థ గర్భితంగానూ ఉన్నది! ఒక్క శ్లోకం మచ్చుకి—

'న సా మిత్రం వశీచక్రే
కేవలం విద్యయా తయా
కేతకీ కలికా కాంతైః
కోమలై రంగ కై రపి'—

దుర్వాసు డిచ్చిన మంత్రమును జపించి కన్నె కుంతి సూర్యుని వశపరచుకొన్నది. కేవలం మంత్ర విద్య చేతనే కాదట! మొగలి మొగ్గల్లాగా కమనీయములూ సుకుమారములూ అయిన అవయవాలచే కూడాను. భావం ఎంత గంభీరమో, శైలి అంత కాంతమై ఉందని చెప్పనక్కరలేదనుకుంటాను. అయినా ఇంకొక్క శ్లోకం : ఆ విద్యాప్రభావంవల్ల కుంతి ఇంద్రుని అనుగ్రహముగా అర్జునుని కన్నదని చెప్పినది :

'అర్జునం తనయం ప్రాప
వజ్రపాణే రియం తతః
ప్రసాదం హరితాం పంక్తిః
ప్రమోదం మరుతాం తతిః.'

తరువాత ఈమె (కుంతి) ఇంద్రునివల్ల అర్జునుడనే తనయుణ్ణి పడసింది. మూడు నాలుగు పాదాల భావం చూడండి. ఆ సమయంలో దిక్కులు నైర్మల్యాన్నీ, దేవతలు ఆనందాన్నీ పొందారట! శ్లోకంలో ఒక్కటే క్రియ. అర్థవైశిష్ట్యాన్ని పరిమితమైన వ్రాతలో చెప్పడం అసాధ్యం—

ఇదివరలో కొన్నేళ్లక్రితం గణపతిముని శిష్యులు గుంటూరు లక్ష్మీకాంతంగారు దీనిని తెలుగు లిపిలో తాత్పర్యముతో ముద్రించారు. ఈ ముద్రణలో విశిష్టత ఉంది. నరసింహశర్మగారి సంస్కృత వ్యాఖ్యానమూ, తెలుగు తాత్పర్యమూ ప్రత్యేకించి ఉన్నాయి. అంతేకాదు. నాగరలిపిలోనూ, తెలుగు లిపిలోనూ ముద్రించడం అటు యావద్భారతానికీ, ఇటు ప్రత్యేకించి తెలుగు లిపిమాత్రమే తెలిసినవారికిన్నీ ఇది పఠనయోగ్యంగా ఉన్నది.

సంస్కృత వ్యాఖ్య సరళంగా ఉన్నది.

తెలుగు తాత్పర్యం ప్రయత్నిస్తే మరి కొంత సాఫీగా వ్రాయవచ్చు.

మొత్తంమీద మంచిపని. చక్కని కృతి. నాగరాంధ్ర ముద్రణకూడా చక్కగా ఉన్నది.

—శ్రీయామిజాల పద్మనాభస్వామి.

శ్రీ వీరబ్రహ్మేంద్ర చరిత్రము

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ
సహాయమున ముద్రితము.

(రచయిత: శ్రీ పూసపాటి నాగేశ్వరరావుగారు. ప్రాప్తిస్థానము: శ్రీ పూసపాటి నాగేశ్వరరావుగారు, సీనియర్ తెలుగు పండిట్, సి. కె. హైస్కూలు; మంగళగిరి (P O) గుంటూరు జిల్లా, **మూల్యము** రూ. 10-00. పోస్టు ఖర్చులు అదనము.)

'శ్రీ వీరబ్రహ్మేంద్ర చరిత్రము,' కందిమల్లాయపల్లి వాస్తవ్యులై, కాలజ్ఞాన తత్త్వకర్తయై, మహామహిమోపేతుడై, సజీవ సమాధి నొందిన శ్రీ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వాములవారి దివ్యజీవితమును దెల్పు ఐదాశ్వాసముల కావ్యము. మను వసు చరిత్రలవలె నిదియు చరిత్రమను పేర నున్నది. ఇందు పీఠికతో గలిసి దాదాపు 1230 పద్యగద్యము లున్నవి. శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారి అమూల్యాభిప్రాయము, శ్రీ వాసిలి వేంకట లక్ష్మీనరసింహారావుగారి విపుల సమీక్షయు కావ్యముఖాలంకారములై యున్నవి. విశ్వనాథవారన్నట్లు ఇది మహాకావ్యము. ఈ మాట ఇందలి విషయ గౌరమునుబట్టి సార్థక మగుచున్నది.

కవి యన్నట్లు 'కావ్యంబులోఁ బసకలవైనఁ బండితాభిప్రాయములు పెచ్చుపెరిగినట్లు' (3-247) గాక, ఇందు ఒక్క పండితాభిప్రాయము మాత్రమే యున్నది. తరువాత విపుల పండితాభిప్రాయము లేకున్నను, సాహిత్య అకాడమీవారి పుస్తకములలోని పరిష్కర్తల పీఠికవంటి, ఇందలి సమీక్ష కవిగారి పై వాక్యమునకు కొంత భంజకమేమో యనిపించుచున్నది. జగద్విదితమైన శ్రీ స్వామివారి చరితమునకు సమీక్ష అనవసరమైనను, అది కావ్యగ్రంథమున దగులొక్కనుటం జేసి, కావ్యమునకు చరిత్రమునకు గల భేదమునుబట్టి, కావ్యకర్త గావించు నగిషీ పనులను కొంత వివరించుట అవసరమే! ఇందలి సమీక్ష—కావ్యహేతువు; రచనా లక్ష్యము; కథా సంవిధానము; ఆశ్వాస విభాగము; కథలో మార్పులు; చేర్పులు; పాత్రౌచిత్యము; నాటకీయత; శబ్ద సౌభాగ్యము; అర్థ గాంభీర్యము; సంస్కృత సూక్తులు—లోకోక్తులు; లోకజ్ఞత—ఆలంకారికోక్తులు; కావ్యశైలి; ఛందో (విని)యోగము; రసబ్రహ్మము; బ్రహ్మోపదేశము — అను పదునాల్గు అంశములను గూర్చిన వివరణము. ఇవన్నియు కావ్య సాధారణ విషయములు.

ఇందు కవి ప్రాచీనకావ్య నిర్మాణపద్ధతినే పాటించియున్నారు. పీఠికలో ఇష్టదేవతా ప్రార్థన, కృతి ప్రస్తావనాదులు గలవు. ఆశ్వాస విభాగము ఇతివృత్తమునకు తగినటుగ, శ్రీ స్వామివారి యోగ జీవితమునుబట్టి, క్రమముగ బాల, రాజ, సిద్ధ, ఛత్ర, సమాధి యోగములనుపేర గూర్పబడుట తాత్త్వికపద్ధతి కెంతయు తగియున్నది. ఇందు ప్రబంధోచితములైన ఋతువర్ణనాదులున్నను, అవి నాతిదీర్ఘములై కథాసంవిధానమున కెంతయు పోషకములై యున్నవి.

కావ్యమున శ్రీ స్వామివారి జీవితము, మహిమలు సమగ్రముగ పోషింపబడినవి. ఎడనెడ లోకప్రచారమున నున్న వృత్తాంతమునకును, ఇంతలి పద్ధతికిని కొంత వ్యత్యాసమున్నది. అది కావ్యశిల్పమునుబట్టి యుక్తముగ దోచినను, సత్యప్రకటనకు అంతరాయ మగునేమో! సమీక్షకులు ఇట్టి మార్పులను సమర్థించియున్నారు. కాని మార్పులు, చేర్పులు అనునవి ఇతర వ్యక్తుల చరిత్రమున చేయవచ్చునేమో కాని, శ్రీ వీరబ్రహ్మం శ్రీ వివేకానందస్వామి; శ్రీ రామకృష్ణ యతీంద్రుల వంటి మహనీయుల చరిత్ర కథనమున సత్యమును మరుగుపరచుట అంత బాగుండదనిపించును. ఇట్టి మహనీయుల చరిత్రకొరకు కావ్యనియమములు కొన్ని సడలించుకొన్నను మంచిదే! ఇట్టివారు లోకాతీత

ప్రభావులు; కారణజన్ములు గదా! కనుకనే యిట్టివారి చరిత్రలు కావ్యములుగ నుండుట చాల తక్కువ.

కవిగారిందులకు సాహసించిరి. అయినను సహజసిద్ధమైన భక్తిభావమును పూసలలో దారము వలె కావ్యమందు సర్వత్ర పోషించి, ప్రదర్శించి యున్నారు. ఇందెన్నియో పద్యములు సహృదయ హృదయాహ్లాదకరములైనవి గలవు.

పీఠికలోని,

'విల స ద్యోగ, మదృష్టమూలము
విరాడ్విఖ్యాత నానావిధో
జ్జ్వల శాఖా రమణీయ వృత్త
ముపసేవా నమ్రసిద్ధేంద్ర హృత్
కలికానందము, సర్వకాల ఫలి
తాంతస్స్వర, మమ్లాన భా
వ లతాంతంబగు బ్రహ్మకల్ప
మిది సంప్రార్థ్యంబు లోకాళికిన్.'
(పీఠిక–19)

అను ఈ పద్యము ఎంతయు హృద్యమై, పోతనగారి 'లలితస్కంధము, కృష్ణమూలము'ను దలపించుచు, భక్తి భావబంధురమై యున్నది. ఇందలి 'అదృష్ట మూలము'— అనునది శ్రీ స్వామివారి కాలజ్ఞానతత్త్వ గీతములను స్పష్టము చేయుచున్నది. ఇట్టి దివ్యచరిత్రమును కావ్యస్థము చేయుటకు కవిగారి అదృష్టమే మూలము! చెప్పదలచిన విషయమును హృదయమునకు హత్తుకొనునట్లు చెప్పగల నేర్పు, ఈ కవియొక్క సహజకవి పంచాననత్వమును సార్థకము చేయుచున్నది.

'ప్రాణవిభునిఁ దలఁచి ప్రాణంబు విడిచిన
సుతుని బ్రదుకుఁదెరువు సూతు రెవరు?
తల్లిలేని బిడ్డ ధరణికి భారంబు
కన్నతల్లి సుతుని కల్పవల్లి' (1–19)

అను నీ పద్యమును అలతి అలతి పదములతో తిక్కన రచనవలె సాగించి, మనోహరమైన అర్థమును కన్నతల్లిగా బోధించినారు కవి.

కాళిదాసుని వలె లోకసహజములైన వస్తువులనే పోలికలుగా గ్రహించుట ఈ కావ్యమున సర్వత్ర కన్పట్టును. 'గెలవేసిన నంటి చెట్టుంబలెఁ గాలము తీరెనాకు భవలిఖితంబై'—వంటి వాక్యములు మిక్కిలి మనోహరములు. శ్రీ స్వామివారి బాల్య వర్ణనలోని, 'తడబాటుతోఁ దప్పటడుగుఁ దమ్ములు నిల్పి పడుచు లేచుచు సాఁగి నడచు మెటిఁగి' [1–30]. ఇత్యాది రచన ఆ బాలపరబ్రహ్మను సాక్షాత్కరింప జేయునదై, మన ముందు నడపించుచున్నదనుట సహృదయైక వేద్యము.

అతిగహనములగు షట్చక్రాదుల వివరణము అందు సైతము రచన సహజసుందరముగ సాగుట. వీరి కవితాభ్యాస బలమునకు నిదర్శనము. ఇట్టివి 3–138, 139 అందు గలవు. బ్రహ్మానుభవమును గూర్చి, 'బ్రహ్మరంధ్రమ్మనఁగ సహస్రార మొప్పు; బ్రణవముం గూడి బుద్ధికావాసమగుచు, సచ్చిదానంద మయ గురుస్థాన మదియ, యచటు చేరంగఁ గనుటె బ్రహ్మానుభవము' [3–140] అను పద్యమున కవి తాను బ్రహ్మానుభూతి నొంది వచించుచున్నాడా యనుపించును.

కాలజ్ఞాన తత్త్వములను 1–175 నుండి 199 వరకు చిన్నిచిన్ని పదములతో, పద్యములతో బాలురకు సైతము అర్థమగు రీతిని రచించుటలో కవిగారి కవితా తపస్సు పండిన దనవచ్చును. శ్రీ స్వామివారు గోవిందాంబను పరిణయమాడుటకు పయనమై

నప్పటి, 'పరికించి తద్వధూమణిఁ బరిణయ మాడంగఁ దలఁచి, పయనం బయ్యెన్; పరమేశ్వరుండె యైనను జరుగునె పరువంబునందు సతి లేకున్నన్' అను పద్యము [2—12] న ఈశ్వర జీవితమును గ్రహించుటలో శ్రీ శంకరులవారి, 'శివః శక్త్యా యుక్తో యది భవతి శక్తః ప్రభవితుం, నచేదేవం దేవో నఖలు కుశల స్పందితు మపి' అను సౌందర్య లహరీ వాక్యము స్మర్తవ్యమైనది. అట 'సతి' పదము ఎంతయు సాభిప్రాయము!' గోవిందాంబను ఆమె తల్లి ఈ పెండ్లికి నివారింపగా, వధువు తల్లితో, 'ఏమిటఁ గొఱంతలేని నాఁడిందువదన! సాధ్వియనిపించుకొనుట కష్టంబుగాదు! లోపభూయిష్ఠ మగునట్టి కాపురంబు దిద్దికొని పేరు నిల్పుట దెప్పరంబు' అనిన మాటలు, యావత్ స్త్రీ లోకమునకుమ ఒక దివ్యసందేశమై 'వికారహేతౌ సతి వక్రియన్తే యేషాం న చేతాంసి త ఏవ ధీరాః' అను కాళిదాసోక్తిని స్థిరపరచు చున్నవి. సిద్ధుని నిర్వేదమందలి ప్రతి వచస్సును రస స్రోతస్సు. ఆ సన్నివేశమంతయు భక్తికరుణ శాంతరస మిశ్రితమై త్రివేణీ సంగమమై, చేతస్సుఖావహముగ నున్నది. ఇట్టి రచనను బట్టియే శ్రీ విశ్వనాథవారు తమ అభిప్రాయములో, 'లోతులకు పోగల్గినవారి కిది మహా కావ్యము'— అనినారు. ఇది యథార్థము.

ఇందు కొన్నియెడల పాత్రలచే కవితాప్రసక్తి, కావ్యగుణములు చెప్పించుట జరిగినది. ఇది కేవలము ప్రబంధకవుల ననుకరించుటయే గాని, కావ్యమున పెద్దగా రమ్యముగా కన్పట్టదు. ఐదవ యాశ్వాసమున 'చం॥ వరకరుణానిధీ [200] అను పద్యమున గర్భ కందము, గర్భగీతము గలవని అధస్సూచికలో ఆ గర్భ పద్యము లివ్వబడినవి. మరియు, 'మ॥ కరుణా సాంద్ర... (5–216) అనునది నిరోష్ఠ్య రచన. అందే 217 మాలికాబంధము. ఇందు కవిగారి బహుముఖ కవితానైపుణి వ్యక్త మగును. కాని ఆ సన్నివేశము సిద్ధుని నిర్వేదము, శ్రీ స్వామివారి సాంత్వనము గనుక, అచ్చట ఈ కవిత్వపు గారడీలు లేకున్న బాగుండెడిది. మంగళహారతి సందర్భమున గైకొన్న 'మంగళ మహాస్రగ్విృత్త' రచన సందర్భశుద్ధి కెంతయు దోహదమై యున్నది.

కావ్యమున నచ్చటచ్చట కొన్ని ముద్రణ స్ఖాలిత్యములు పట్టికలో చేరనివి గలవు. 'తెలయ—తెలియ [1–43]; బ్రాంతి—భ్రాంతి (2–146). ఇక 'పిత్రుఁడు (1–97); కమండలము (5–106), మొదలగునవి కవి బుద్ధిపూర్వకముగ ప్రయోగించిన వనిపించును. నిజమునకు శబ్దసుభగత్వమును అర్థ గాంభీర్యముతో వేరుచేసి చూడరాదు'— అని సమీక్షకులు తెల్పియున్నారు. కాని దోషమని తెలిసియు ప్రయోగించుట కేవల సాహసమగును. 'కమండలము'— అనునది వ్యవహార సిద్ధముగా వచ్చును' కాని 'పిత్రుఁడు' అనునది శ్రవణ సుభగతకును దూరమై యున్నది. చాలచోట్ల 'కలవరించు' అనుటకు బదులు, 'కలువరించు' అని యున్నది. 'తగునట వోయీ' [1–38] అనుచో 'వో' వ్యాకరణ సాధ్యమో! వ్యవహార సాధ్యమో!! రాజునోట 'సరసుఁడబ్బిన కయీ సరుని సరణి' [1–115] అని 'కవీశ్వరుని' వికృతిసేత అంత రమ్యముగా తోపదు. 'కవీశ్వరుని సరణి' అని యుండుట లెస్స! 'గోవుల మల మూత్రములతోడ నలికియుండు' [1–127] అను చోట గల 'మల మూత్రములను' విసర్జించియుండిన మంచిది. ప్రసిద్ధములైన 'గోమయ; గోపంచితము' లను గ్రహించియుండిన రమణీయముగ నుండుననుట సహృదయులకు సువిదితము.

ద్వితీయాశ్వాసమున 68 నుండి 72 వరకు గావించిన స్త్రీ వర్ణనవలన ప్రకృత కథ కెట్టి ప్రయోజనము కన్పట్టదు. ఇవి కేవలము ప్రాచీన ప్రాబంధిక పద్ధతి మాత్రమే! 'నీ రాశి సేతువు నిర్మింపఁజాలిన' [2–32] అనుచో 'నీ రాశి' సాధువగుట యెట్లో!!. 'అని భక్తి భరాశ్రులు చె క్కున జాల్కొను చుండ' [5—196] అనుచో 'భక్తిభరాశ్రులు ఒక చెక్కున మాత్రమే జాల్కొనుచుండగా' వనిపించును. 'చెక్కుల' అనుచో ప్రాసభంగము. ఇట బహువచన ముండుటయే సబబు. 'సంపతిల్లె'—[2–7] అనునది అపూర్వ

ప్రయోగము! 'ఈషణత్రయము' [3–114] అనుచో 'ఈషణత్రయము' అను వ్యవహారమును బట్టి ప్రయోగించుట జరిగినది. కాని అది 'ఏషణత్రయము' అని యుండిన సాధువు.

ఇట్టి యే కొన్నియో స్ఖాలిత్యములు తప్ప, మొత్తము పై కావ్య నిర్మాణము సర్వాంగసుందరమై, 'తగిన రీతిని పాక పద్ధతు లమర్చి। వీర యోగీంద్ర తత్త్వ సుధారసంబు। కావ్యచషకంబునం దిడి కలయం ద్రిప్పి। చవుల మురిపింతు, మఱపింతుం జవలరుచులు' [పీఠిక–18] అని కవి చెప్పికొనిన రీతిగా చవుల మురిపించుచున్నది. ఇందలి రచన కమ్మచ్చున తీగ వలె ఒడుదుడుకులు లేక రమ్యమై యున్నది. శ్రీ స్వామి వారి దివ్య చరిత్రమును కావ్యస్థము గావించి, వారి పేరిట కావ్యము లేని కొఱతను దీర్చి, శ్రీ నాగేశ్వర రావుగారు కవిశేఖరులుగా తమ సేవా విధిని నిర్వర్తించి ధన్యులయినారు.

'జయంతితే సుకృతినో రససిద్ధాః కవీశ్వరాః.'

—శ్రీ పమిడికాల్వ చెంచు సుబ్బయ్య.

రానున్నది ఏది నిజం?

(నవల)

(రచన: శ్రీ దాశరథి రంగాచార్య, 80 పేజీలు. రూ. 2–00 ప్రచురణ: ఆంధ్రప్రదేశ్ యువజన సమాఖ్య, మఖ్దూంమార్గ్, హిమాయత్‌నగర్, హైదరాబాద్.)

'శ్రామికరాజ్యం వర్ధిల్లాలి—పేదరికాన్ని నిర్మూలిస్తాం— అసమానతలను అడుగంటిస్తాం— మురికి వాడలను నిర్మూలిస్తాం—సమతారాజ్యం స్థాపిస్తాం — ప్రజాప్రభుత్వం వర్ధిల్లాలి– ప్రజాద్రోహులు నశించాలి— పాతమంత్రుల్ని పాతరవేస్తాం' — ఇలాటి నినాదాలతో తొలినుండి తుదివరకూ నిండిఉన్నదీ నవల.

ఒక వ్యవస్థ నశిస్తేగాని మరి ఒకటి పైకి రాదు. ఒకపార్టీ పతనమయితేగాని రెండోది ఎత్తిరిల్లదు. రానున్నది ఏది నిజమయినా, ఇదిమాత్రం నిజం, ప్రజలకు ఎటువంటి ప్రభుత్వం ఉండాలి? ఎటువంటి నాయకులుండాలి?—ఈ ప్రశ్నలకు ఉదాత్తమయిన రూపకల్పన ఈ నవల.

కేవలం పాఠకులను ఉద్రేకపరిచే కాలక్షేపం కాదిది. ఇందులో ప్రజలూ నాయకులూ ఏరుకోతగిన బోలెడు నీతులున్నాయి, నేర్చుకోతగిన గుణపాఠాలున్నాయి; యువతలో నూతనోత్తేజాన్నీ స్ఫూర్తినీ వికసింపజేసే కొత్త ఫక్కీ నవల.

ఉదయం

(కథల సంపుటి)

(68 పేజీలు రు. 2,— ప్రచురణ: యువ భారతి, 5 కింగ్స్‌వే, సికిందరాబాదు–500003.)

ఈ సంపుటిలో పదకొండు కిరణాలు. అన్నీ అందరి రచయితల నవకథా విధానాలు. ఇది యువ భారతి దశమవార్షికోత్సవ 'విజయదశమి' కానుక.

ఇంతవరకు — వీచికలు, అక్షరాలు, స్వరాలు, పంచవటి—వంటి రచనలు ప్రచురించి యువభారతి కొత్తపంథా తొక్కింది. యువరచయితలను తీర్చిదిద్ది, సంస్థపేరు సార్థకం చేసుకుంటూ వుంది.

రచయితల్లో అంతా కొత్తవారు కాదు. కథల తీరులో ఆరితేరిన శైలి కనబడుతుంది. 'చావద్దు'లో నాగభూషణం సమస్య చాలా క్లిష్టమయింది. సమస్య కొరుకుడు బడలేదు. చివరికి తన చిక్కు తనే విడదీసుకొన్నాడు. 'అఘాయిత్యం' చదివి తీరాల్సిన కథ. ఒకానొక సుందరిని చక్కదిద్దబోయిన మగువ అంచనా ఊహకు అతీతం. సంఘటన అసహజమైనా, ఈనాటి సినిమాలుచూస్తే— సీరియల్సు చదివితే ఇలాంటి వెర్రి తలకు ఎక్కుతుందని కథకుని చమత్కృతి.

తక్కిన కథలు న్యాయాన్వేషణ, దీపం — పురుగు, కాశీపతి కథ రాశాడు, సంతృప్తి, ఓడిపోయాను, దాచుకున్న..., ముగింపు, జీవితంలో ఓ భాగం, కనువిప్పు, ఒకదాన్నిమించి ఒకటి ప్రత్యేకతతో ఉట్టిపడుతున్నాయి.

—శివకుమార్తి

శాతవాహన సంభవము

(శ్రీ వఝ్ఝల కాళిదాసు—క్రౌన్ 68 పారటలు. వెల రు. 1–50. ఆంధ్ర విజ్ఞాన సమితి, జెంషెడ్‌పురం (తాతానగర్, బీహార్)

జెంషెడ్‌పురము తెనుగుదనము వెల్లువబెట్టిన బీహారు ప్రాంతము. అచటి ప్రవాసాంధ్రులు తమ భాష, నాగరకత, సంఘ జీవనములను పోగొట్టుకొన కుండుటే గాక పెంచుకొంటున్నారు. అట్టి ప్రవాసాంధ్రులలో కాళిదాసుగా రొకరు. ఇక, మారుమూల ఆ కొండ కోనలో తెనుగు కవిత్వం వికసించుట ఒక విశేషం. ఈ దృష్టితోనే గాక కాళిదాసుగారు సాంప్రదాయిక కవితా రీతులలో ప్రౌఢ ప్రబంధ పాకములో బాగా చేయి తిరిగిన వ్రాతగాడు.

విప్లవావేశంతో ఛందో నియమాలపై పితూరీ లేవదీసిన యీ దినాలలో, బూజు బట్టిన ప్రబంధ ధోరణికి పెడమొగముబెట్టి పెదవి విరిచేవారు కొందరున్నా, ఆ రీతులను అభిమానించి ఆనందించేవారు గూడ ఉన్నారు. రెంటినీ ఆమోదించేవారు గూడ చాలమంది ఉన్నారు. పాత పద్ధతి యింకా బ్రతికి ఉన్నది గాని, కొత్తది ఎంతకాలం మనగలదో భవిష్యత్తే చెప్పగలదు.

ఇప్పుడు యీ శాతవాహన సంభవాన్ని గుణ పక్షపాత బుద్ధితో పరికిస్తాం—

క్రీస్తు శకానికి అటు ఇటు నన్నూరేండ్లు మగధ నేలిన ఆంధ్రరాజుల మూలపురుషుడైన శాతవాహనుని జన్మోదంత మిది; అంటే—అప్పటమైన చరిత్రాంశము. పురాణాలతో చరిత్రను కలగలుపు చేయడం, ఆవల పరిశోధించడం హైందవ సంప్రదాయమై నట్లున్నది. అందువల్లనే యీ సంభవ కావ్యం పురాణమైపోయి చరిత్ర గౌరవాన్ని కొంత పోకార్చుకొన్నది.

ప్రణయినులైన ఒక ముని కన్యను, యతుడైన శాతుని ముని శపించగా, పగలు సింహాలుగా సంచరించడం, రేయి మానవులుగా తిరుగాడడం, చివరకు శాపవిముక్తిని బొంది వారు యతులుగా పైకి ఎగిరిపోవడం—ప్రబంధ ఫక్కికి బాగా ఉపకరించిన సామగ్రి. బాలురే సింహాది జంతువులు పెంచి పెద్ద జేయడం అక్కడక్కడా వినబడే చరిత్రాంశాలే. రోము నగర స్థాపకులు రాములస్ రీమస్ అనే వారిని ఒక తోడేలు పెంచినట్లు కత. శపులైన సింహ సింహికలుగా గోదావరి కావలనుండి, ఆంధ్రవిష్ణువు కొరకు కృష్ణాతీరం చేరడం కొంత వ్యత్యస్థంగా ఉన్నట్లున్నది.

మునికన్య—వనలక్ష్మి శాతుల ప్రణయోదంతం శాకుంతలోపాఖ్యానం కరువున బోసినట్లున్నది. అయినా కథ చెప్పుట బాగున్నది.

కవిగారు ఉపయోగించిన కవితాసామగ్రి అంతా, సమయా సమయాలు పాటించకుండా పోతన దగ్గర చేబదులు తెచ్చుకొన్నవే. అయినా ప్రౌఢశయ్య ధార భాషా సౌష్ఠవం యీ కావ్యానికి అలంకారాలై యున్నవి. 'నానావర్ణ విశేషభూషిత వసంతక్ష్మాజ వల్లీ నవప్రాణోత్ఫుల్ల మనోజ్ఞ మంజుతర పుష్పశ్రీ విలాసమ్ము', 'హృదంతరాళ గంభీర పయోధి భావ రస వీచులదోచిన ఫేనమట్లు'—ఇదీ యీాయన చిక్కటి సమాసశయ్య. తెనుగు నుడికారపు సొంపు గూడ ఇట్లే చవులూరిస్తున్నది. ప్రకృతిపై కవికి మంచి మోజు; దానిని భావపూర్ణ ఉత్ప్రేక్షలకు తనివి దీర ఉపయోగించినారు. ఉపమాలంకారాలు ప్రీతికరంగా ఉన్నవి. 'తలిరుంబ్రాయపు కన్నియ ఎలసిగ్గున రాచబాటనేగు విధంబున్ దలపించుచు, గోదావరి కులుకుచు బ్రవహించు గనులకు విందగుచున్' అని గోదావరికి ఒయ్యారం గలిపించినారు.

ఎట్టిమార్పులులేని అమరుల విసువు బ్రతుకు పట్ల మొగముమొత్తిన శాతునకు పరిణామగుణము గలిగిన భూలోక ప్రకృతిదశలు— భిన్నరుచులు నచ్చి, వాటిని స్తుతించుట మంచిభావన. పాత్రల అంతరంగిక బాహ్యచేష్టల సహజవర్ణనము హృద్యము. అక్కడక్కడ భావకవిత్వపు పోకడలు బాగున్నవి. మానసిక క్షోభకు అనుగుణంగా బాహ్యప్రకృతిని పార్శ్వ దృష్టిగా వర్ణించుట రసవత్తరమైన అల్లిక.

ఒక స్వప్నవృత్తాంతంవల్ల కథాగమనమందలి ఔత్సుక్యం పలుచపడిపోతున్నది. కొన్ని సమయభంగ వర్ణనలు:— మిణుగురుబూచులు వానా కాలంలోనివి, కార్చిచ్చు ఎండాకాలంలోనిది. కాని కవితావేశంలో కామాల కొంతకాలభంగం కలిగించినారు.

శాతవాహన జన్మపత్రికను వ్రాసి, ఒక కాల వ్యతిరిక్తాలంకారమును (అనక్రానిజం) చేబట్టి, కవి గారు తమ జ్యోతిషశాస్త్రాభిరుచిని వెల్లడించినారు. రవి శుక్ర గురువుల ఉచ్ఛవల్ల సార్వభౌమపదవి సూచన ఉన్నదిగాని, యీ మేషరాశికి రాశీశీలము బాగాలేదు. అసలు యీ రాసులు లగ్నాలు వారాలు గ్రీసునుండి వరాహమిహిరుడు (యవనాచార్యుడు; క్రీ. శ. 7–8 శతాబ్దం) సంస్కృతీకరించి మనకు దించినాడు. మనవారి పాతపద్ధతి నక్షత్రగణనమే! మన పురాణాలలో రాముని జననం పునర్వసు నవమి అని; కృష్ణునిది రోహిణి అష్టమి అని మాత్రమే చెప్పబడియున్నవి. ఈ ప్రక్షిప్తాన్ని కవి గ్రహించుట తప్పేమి కాదు; అందుకనే 'అనక్రానిజం' అన్నది.

క్రాంతి యుద్ధం

[శ్రీ చెరబండ రాజు, క్రౌన్ 54 పొరటలు, వెల రు 1—00. కాగడా బుక్ హౌస్, చిక్కడపల్లి, హైదరాబాద్–20.]

జనవాహిని కెదురు లేదు! ఇది అనాది సత్యం. ఈ లక్ష్యసిద్ధికే యీ రచయిత తన రచనలతో ప్రయత్నిస్తున్నాడు. వీరి రాజకీయాల జోలి ప్రస్తుతం వద్దు. చాలా ఏండ్ల నుండి యీ చర్చ వింటూనే ఉన్నాం, కాని పరిష్కార మార్గంలోనే ఉన్న వ్యత్యాసమంతా. ఈ విప్లవ కవులు లేక, దిగంబర కవులకు ఇతర ఆశా వాదులకు గల భేదమంతా, మానవ స్వభావపు బాగోగులను గురించే. కార్మిక నియంతృత్వం అరవై యేండ్లుగా మానవుని ఆర్థిక స్థితిని బాగు పరచినట్లు లేదు; మెరుగై ఉంటే, అమెరికా గోధుమతో రష్యాకు పనిబడి ఉండేది గాదు. అచట భావ స్వాతంత్ర్యం ఉండి ఉంటే—నోబెల్ పురస్కార విజేత — సోల్జ్షెనిట్సిన్ కాందిశీకతతో జన్మభూమిని వదలవలసిన పని పడియుండేది గాదు. ఇదంతా దూరపుకొండలు నునుపు అనే సామెత వంటిది. క్యాపిటలిజం తనంతట తానే కూలిపోవలసి ఉంటే అమెరికా బోటి దేశాల ప్రగతి యింత ఆశాజనకంగా ఉండజాలదు. కాని, యీ రెండు ధ్రువాలమధ్య పొత్తు కుదరనందుననే ఇంగ్లండు బ్రివరిడ్జి శ్రేయోరాజ్యం అనే సామరస్య విధానం సూచించినాడు. ఇట్టి భావసమత, తృప్తి, సహనం కుదిరేవరకు యీ భావకల్లోలం, విప్లవ కార్యాచరణ తప్పవేమో అని చరిత్రపాఠం చెప్పుతున్నది. ఇదంతా అతృప్తి కలిగించే ఆవేశం.

చెరబండకు రాజాగదా— యీ కవి! కాబట్టే జెయిలులో రసస్ఫూర్తి, భావావేగం, భాషోద్రిక్తత గల యీ చిన్నపుస్తకం వ్రాయగలిగినారు.

వీరి భాష, భావంతోబాటు పరుగెత్తిపోతుంది. జీవం సత్వ, స్థానికజాతీయ నుడికారంతో, వీర్యవంతంగా ఉక్కుతునకలుగా శీర్షికలు రూపొందినవి. దీనికి కారణం— యీ కవిహృదయంలో కుమ్మరి ఆమ్మవలె కుమిలే అసూయ అసాయత ఆక్రందన ప్రతీకారం కోరుతూ, పల్లెటూరి కొడవటి వాదరకు పదను ఎక్కిస్తున్నవి.

'ఊరు మేలుకొన్నది' అనే భాగం, ఒక బయిర గీతంవలె, పతితజాతుల జాగృతి, అన్యాయ నిర్మూలన దీక్ష, అసహనం నిప్పురవలను చెరగుచున్నవి, ద్వేషానలం గనగన మండుతున్నది. ఆ గ్రామ పెద్దరైతు దుష్వర్తనకు గొంతు కోతే ప్రతీకారంగా కవి తృప్తిపడుతున్నాడు. 'మాలపల్లి'తో మన్నించి మరచిపోయిన మహితగుణం పరిష్కార మార్గమైనది. ద్వేషమే ద్వేషాన్ని పెంచవలెననే దానినే ఈ కవిత ప్రోడిచేస్తున్నది. 'చంపదగిన యట్టి శత్రువు తన చేత జిక్కెనేని కీడు చేయరాదు; పొసగ మేలుచేసి పొమ్మనుటే చాలు' అన్న వేమన వాక్యం, వీరికి వెర్రివేదాంతంగా తోస్తున్నది. అందువల్లనే గదా పరాసు రష్యా విప్లవాలు నెతురు మడుగుల నిండించినవి.

రాజుగారి కవిత్వానికి దేశీయ నుడికారం కుదింపు జీవం. కొన్ని వినండి:— 'తూమెడొడ్ల జీత గాడు, పని దగ్గర మొనగాడు', 'ఆ తల్లి కడుపులో తలబెట్టి మల్లన్న'—ఎంతటి సహజచేష్ట! ఊరు మారలేదంటూ 'ఎద్దు పుండును కాకి ముద్దెట్టు కోదమ్మ' అని మానవ స్వభావాన్ని వర్ణిస్తాడు. 'గాంధిగారిని మించి మేక వన్నెపులి లోకాన లేదమ్మ' అని అంబేద్కార్ వాదం చేసినా, భాషలో సారళ్యం ఉన్నది. దెబ్బల వాతలుపడిన 'పెయి(=దేహం) చూపి దొరకాళ్ల మొక్కాలో శిరసు తెగనరకాలో 'అన్న దానిలో హృదయావేగం విప్లవోద్రేకం ప్రదర్శించి నాడు—కవి. 'వాడికింక రేపులేదు' అని మల్లన్న అన గానే, తల్లి 'బుసకొట్టి పడగెత్తి పగబట్టిన పల్లె పడచై' కొడుకునుకొట్టిన దొరతల నరికి, ప్రతీకార దేవతకు పొంగలిబెట్టి గావు యిచ్చింది. తన అవును పురుగుకరిచినదానిని కాపరిని కొట్టిన దొరచేష్ట ఎంత గర్హ్యమో, చిన్నదెబ్బకు గొంతుకోతతో పగతీర్చుకొనడం గూడ అంత దారుణమే! దీనితో ఊరు లేచిందంటాడు కవి. కాని, ఒకరిని చంపినంతమాత్రాననే సమస్యలు పరిష్కారమయ్యేపని అయితే మానవజాతి చరిత్రే తిప్పివ్రాయవలసి వచ్చేదేమో! ఇది నక్సలైట్ల నిర్యా తన క్రమము—అంతే!

ఇట్లా యీ కావ్యశీర్షికలలో, ఆయన దృష్ట్యై వ్యాయమున్నా, పాఠకుని దృష్టిలో మంచి కవిత్వ మున్నది. జాతీయోద్యమ దినాలలోవలె, యీ కవితకు ఒక దశ; పరిణామమెట్లుండునో చూస్తుందాం.

ఆర్త విపంచి

(శ్రీ జి. వెంకటేశ్వర్లు; ఆర్ట్సు అండ్ సైన్సు కాలేజి; మహబూబ్ నగర్. డెమ్మి—78 పుటలు—వెల రు. 2/.)

నేటి ఆకలిమంటలు, ద్వేషానలాల మధ్య ఈ ఆర్తవిపంచీ వాదం ఆశానినాదంగా మేళవింపబడుట ఒక ప్రత్యేకత! ఇప్పుడు వినబడే సంకుల విశీర్ణ ఆక్రంద నాలలో ఇది కొంత హాయిని గూరుస్తున్నది. కవి, నేటి సమస్యల వికృత రూపాన్ని వర్ణించి, వాటి పరి ష్కారం విద్వేష ప్రతీకారం గాదు—అంతర్ముఖమైన దృష్టితో సహనము సమతలను ప్రదర్శించడమేనని ఆశావాదం చేస్తూ, ఆర్తికి ఒక ఊరట త్రోవను సూచిస్తున్నాడు. 'మోడుబారిన తరువులు ఇగురు వేయడం చూశాను; మోడుబారిన తరువులను వంట చెరుకు కని కొట్టడం చూశాను' అని యీ ప్రపంచంలో మంచిచెడ్డలు కలగలువని— జీవిత వసనానికి అవి పడుగు పేకలని—ఆశతో జీవించాలని చెప్పడంతో, నేదు అక్కడక్కడ వ్యాపించియున్న ద్వేషకవితా సికతాతల మరుభూమిలో ఒక శాద్వల యుత పల్వలంగా యీ కావ్యం కనిపిస్తూ, భవిష్యత్తును మానవుడు స్వర్గ తుల్యంగా చేసుకోవచ్చునంటూ'—ఇతరులను చూస్తూనే నిన్ను నీవు చూచుకో, మందమాట వింటూనే నీ మనసు మాట నమ్ముకో' అని అంటూ, ఒక ఆధ్యా త్మిక వాసనాబలంతో గానం చేస్తున్నాడు—యీ కవి. ప్రపంచ శాంతి అవిభాజ్యమంటాడు. 'సమస్యలు లేవనెత్తడం గాదు ముఖ్యం; పరిష్కార మార్గం ఆచరణమార్గం కావాలి' అని అంటూ తన కవితకు ఒక లక్ష్యం కుదుర్చుకొంటున్నాడు. గొంతెమ్మ కోర్కెలతో కాలం వృథాపుచ్చకుండా — 'భావ ప్రపంచంలో బంగారుమేడలు కట్టడంకన్నా వాస్తవిక జగత్తులో వారపాకవేయడం మిన్న' అని, ఆచరణ యోగ్యసరళిని సూచిస్తున్నవి— యీ విపంచి స్వరాలు. 'అరువుతెచ్చుకొన్న ఫ్యాషన్ పరువుతీస్తుంది, మన పవిత్ర సంస్కృతికి మచ్చతెస్తున్నది' అని ఆర్షాభి రుచిని ప్రదర్శిస్తున్నాడు.

'కాలం' శీర్షిక వేదాంతధోరణిలో, బురద మడుగు తేరుకొన్నట్లే మనసు శాంతించాలని— 'జగం వింతైనతరువు, ఒకవైపు ఇగురువేయు, వేరొకవైపు వాడిపోవు' అని సృష్టిలో మార్పు సహజమంటు న్నాడు. 'జీవితం'లో 'తెలుసుకోవలసినది ఇంకా ఎంతో ఉంది' అని ఆసక్తిని చూపుచున్నాడు.

వెంకటేశ్వర్లుగారికి ఊహాసరణికి తగినభాష— ధారాపాటవము — నుడికారపుసొంపు అలవడియున్నవి.

ఈ ఆర్తవిపంచి స్వరాలు వింటుంటే, భాషయిచ్చే ఆనందం, భావమిచ్చేఊరట అనుభవించగలుగు తున్నాము. కాబట్టే 'ఈలాంటి అనుభూతులు అలలై రాసాగాయి, కలలై రాసాగాయి, కవితయ్యై నిలిచాయి' అని ధైర్యంగా చెప్పుకోగలుగుచున్నాడు. 'వికసించినపూలు పూజకు తగును' అని జీవితసుమాల విప్పారజేసుకోమంటాడు. కాలాన్ని కాలుతున్న సిగ రెట్టుతోపోల్చి, 'పీల్చినా పీల్చకున్నా కాలుతూనే ఉంటుంది' అని, చక్కటి ఉపమానం వేమన బాణిలో చెప్పినాడు. కవికి పరిసర పరిశీలనాజ్ఞానం బాగా ఉన్నది.

సరే! అంతా బాగున్నది. 'పేరిన విషం పారు తున్న'దంటావు. ఇది ప్రకృతికి విరుద్ధం కదూ? దినానికి జేనెడైనా గ్లేషియర్ పారడం లేదా— అంటా వేమో, ('నాకేం తెల్సు' శీర్షికలో)

ఇది చదివి ఆనందించదగిన లలిత రచన.

తెలుగు నవల — నూరు సంవత్సరాలు

(శత జయంతి సందర్భంగా వెలువడిన ప్రసంగ వ్యాస సంకలనము, డెమ్మి—103పేజీలు వెల రు 2/– ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీ, కళాభవన్; సైఫాబాద్; హైదరాబాద్—4.)

గడచిన యాభైయేండ్లుగా, భారతీయ భాష లన్నిటిలోను యీ 'నవల' అనే రచనా ప్రక్రియ సాహిత్య వికాసంగా రూపొంది ఎదుగుచున్నది. కథాని కలు యీ ఏటిపాయలే! నవల అనే పదం ఇంగ్లీషు 'నావెల్' అనే మాటనుండీ పుట్టినది. ఇంగ్లీషులో యీ నావెలుకు జనకుడు – రిచర్డుసన్. తెనుగులో యీ పదాన్ని సృష్టించినది— 1893 లో, 'చింతా మణి' అనే సాహిత్య మాస పత్రిక–పోటీబెట్టి బహు మతు లిస్తామన్న అడ్వర్టైజ్‌మెంటులో 'వచన ప్రబంధ'మనేదానికి మారుపేరుగా దీనిని బ్రాకెట్సులో వాడినది. ఆ తర్వాత కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రి, కందుకూరు వీరేశలింగంగారి 'రాజశేఖర చరిత్ర' (గోల్డ్‌స్మిత్ వ్రాసిన వికార్ ఆఫ్ వేక్‌ఫీల్డు మూలం) రెండవ ముద్రణాన్ని సమీక్షిస్తూ 1902 లో, యీ వచన రచనా క్రమాన్ని 'నవల' అన్నారు; వీరి భావం కొత్తదని. ఇంగ్లీషు మాతృకకుగూడ ఇదే అర్థం గదా!

ఇప్పుడు యీ రచనను—గుజరాతీలో నవల్‌కథా; మరాఠీ కన్నడాలలో కాదంబరి; బెంగాలీ హిందీలలో ఉపన్యాస్; మళయాళం తమిళాలలో నావల్ అంటారు. డి. ఎం. కె వారు పుదినం (కొత్తది) అంటారు.

1872 లో మొట్టమొదటిసారిగా తెనుగులో నిర్మింపబడిన యీ రచనా విధానానికి 'వచన ప్రబంధ' మని పేరుబెట్టినారు.

నవల నూరేండ్లపుట్టిన పండువును ఆంధ్ర ప్రదేశ సాహిత్య అకాడమీవారు, కొన్ని ప్రసంగ వ్యాసాల మూలకంగా జరిపి, వాటినన్నిటిని యీ ప్రత్యేక సంచికగా వెలువరించడం ఎన్నదగిన భాషాసేవ. నవల యొక్క వివిధ పార్శ్వదృష్టులను, రూపాలను అభి వర్ణిస్తూ ఎనిమిదిమంది ప్రముఖవేత్తలుచేసిన ఉప న్యాస సంపుట మిది.

1. తొలి తెలుగునవల అనే శీర్షికపై— డా. అక్కిరాజు రమాపతిగారు ప్రసంగించారు. నవల, పేరు— పుట్టుపూర్వోత్తరాలను విషయపూర్ణమైన విమర్శకబుద్ధితో పరిశీలిస్తూ — ఇంగ్లీషు పరోక్ష ప్రభావమున్నా, తెలుగున స్వకపోల కల్పితంగా పుట్టిన మొదటి వచన ప్రబంధం—నరహరి గోపాలకృష్ణమ చెట్టిగారి 'శ్రీరంగరాజ చరిత్ర' అని నిలబలుకు చున్నారు. చెట్టిగారు కర్నూలులో డెపుటీ కలెక్టర్ పని చేస్తూ, ఆనాడు ఆంధ్రభాషాభిమానం కలిగిఉండుటే గాక, రచన చేయడం కొనియాడదగిన సంగతి. వీరు నూనెగమళ్లవారు. దీనిని అప్పటి గవర్నర్ జెనరల్— మేయో ప్రభువుకు అంకిత మిచ్చినాడు. దీనినే తర్వాత విమర్శకులు నవల అన్నారు. రమాపతిగారు సంగతులు మొగమాటం లేకుండా బాగా చెప్పినారు.

2. పిలకా గణపతిశాస్త్రిగారిది 'చారిత్రిక నవల' అన్న వ్యాసం. వెలువడిన నవల లన్నిటినీ పేర్కొనడం కష్టమైన పని అయినప్పటికినీ, 60 ఏండ్లనాడు, శాస్త్రిగారు పేర్కొన్న విజ్ఞానచంద్రికా గ్రంథ మండలి వారి—విమలాదేవి (భోగరాజు నారాయణమూర్తి) రాయచూరు యుద్ధము (కేతవరపు వెంకటశాస్త్రి, విజయనగర సామ్రాజ్యము (దుగ్గిరాల రాఘవచంద్రయ్య చౌదరి) ఆనాడు చాల పాపులర్. గ్రంథమండలి పెట్టిన పోటీలో దుగ్గిరాలవారి నవలకు ప్రథమ బహుమతి వచ్చింది. వంగ అనువాదాలంటూ శాస్త్రిగారు 'ఆనందమఠ' వెంకటపార్వతీశ కవులదంటారు; కాని 70 ఏండ్లనాడు ప్రచారంలోకివచ్చి, ఆంధ్ర జాతీయతను చిగురింపజేసినది—వావిళ్లవారు ప్రచురించిన, ఓ. వై. సి. దొరస్వామయ్యగారి ఆంధ్రానువాదం.

3. అనువాదాలు: మద్దిపట్ల సూరిగారు, అనువాద ప్రక్రియ అసిధారావ్రతచర్య అంటూ తెనుగువారు సొంతం చేసుకొన్న వివిధ భాషా గ్రంథాలను పేర్కొన్నారు. కాని ఆనందమఠను పేర్కొనరు. ఇంగ్లీషునుండి వచ్చిన హ్యూగో దురదృష్టవంతులు, బీదలపాట్లు; డ్యూమా యుగంధర విజయము, స్కాట్ ఐవన్‌హో మొదలగువాటిని ప్రస్తావించరు. శరత్ బాబు సాహిత్యాన్ని దిగుమతి చేసినవారిలో దేశికవితా మండలినిగూడ పేర్కొని ఉండవలసినది.

4. కథాకథన శిల్పముపై నాగభూషణ శర్మగారు మంచి పత్రమును సమర్పించినారు. పేరులు పేర్కొనడం కష్టం అన్నారుగదా, అయినా 50 ఏండ్లకు ముందు నూటికిపైన నవలలు వ్రాసిన సోమరాజు రామానుజరావుగారిని, 1930 దశకంలో రైల్వేని నింపివేసిన క్రొవ్విడివారిని పేర్కొని ఉండవలసినది.

5. సమకాలీనతను గురించి చెప్పిన, ఆర్. ఎస్. సుదర్శనంగారు 'నవల సమకాలీన జీవితాన్ని ప్రతిబింబిస్తుంది' అనిన ప్రతిపాదనను రమ్యంగా చేసినారు. వీరి భాషగూడ బాగున్నది.

6. కుటుంబ జీవనమును గూర్చి శ్రీమతి ఆనందారాంగారు, స్త్రీ స్వరూపాన్ని వివిధ దృక్పథాలలో చూచి, నవలలు ఆయాపాత్రల ఎట్లు పోషిస్తున్నవో సహజ వైఖరిలో బాగా చెప్పినారు.

7. మనోవిశ్లేషణము — అన్న శీర్షిక క్రింద, డా. అపిరాల విశ్వంగారు, సిగ్‌మండ్ ఫ్రాయిడ్, జంగ్ మొదలగువారిచే తన ప్రవృత్తి సిద్ధాంతాల ప్రభావాలను గురించి విశేష దృష్టితో విపులంగా వ్యాఖ్యానించి వ్యాసానికి గురుత్వాన్ని గూర్చినారు.

8. భాష—శైలి—మాండలికతతో పోరంకి దక్షిణామూర్తిగారు భాషలలో మాండలికతను నొక్కి చెప్పచునే, అరాజకం పనికిరాదని మంచి ఎచ్చరికే చేసినారు.

మొత్తంమీద యీ సంపుటం విషయ గౌరవం చేత అకాడమీవారి ఉత్సవానికి మంచి గ్రంథ నీరాజన మగుచున్నది.

సు మ తి శ త క మ్ః

(బ్రౌన్ ఇంగ్లీషు అనువాదంతో)

[సంపాదకుడు: డా. చల్లా రాధాకృష్ణశర్మగారు డెమ్మి 66 పేజీలు. వెల రు. 2/— ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి; కళాభవన్, సైఫాబాద్, హైదరాబాద్—4.]

వైద్యం తెలియని, కూనరాగం తీయలేని, సుమతి—వేమన పద్యాలు ఒకటో రెండో నోటికిరాని ఆంధ్రుడు లేడనే మాట నూటికి నూరుపాళు నిజం. ఈ రెండు శతకములు ఇంగ్లీషు తమిళములలోనికి అనువదింపబడి ప్రజామోదమును పొందినవే! ఛార్లెస్ ఫిలిప్ బ్రౌన్, ఆంధ్రుల ఎప్పటి ఋణమో తీర్చుకోనో అన్నట్లు ఆంగ్లేయుడుగా భారతావనిలో జన్మించిన పుణ్యాత్ముడు. ఆంధ్రసాహిత్యవన పునర్వికసనానికి యీ దొర నవవసంతుడు. ఈయనేగాన, స్వధనంతో ఆంధ్రభాషను ఉద్ధరించను పూనుకొని ఉండకపోయినచో, ఎన్నో ప్రబంధాలు నేటివారికి దక్కేవికావు. అర్తిలో ఉండిన ఎందరో తెనుగుపండితులకు అండగా ఉండేవాడు.

బ్రౌన్ వేమనను వెలికిదీసి, పద్యాలను ల్యాటిన్ ఇంగ్లీషుభాషలలోనికి అనువదించి ప్రచురించినాడు. అట్లే సుమతిశతక ప్రతులను అనేకములను సంపాదించి, శోధించి 150 పద్యాలతో ప్రచురించినాడు. సాధారణంగా శతకంలో 110 పద్యాలు మాత్రమే ఉంటవి.

బ్రౌను ఆంగ్లీకరించినది 85 పద్యములను మాత్రమే — (స్త్రీలయెడ వాదులాడకు అనే పద్యం వరకు) ఎళుమూరు (ఎగ్మూరు) సమరపురి మొదలియార్ 110 పద్యాలను తమిళంలోనికి అనువదించగా, సి. ఎతిరాజులు నాయుడు 1904 లో మదరాసులో ప్రకటించినాడు. వరదాచార్యులుగారు సంస్కృతీకరించినారు. దీనిని ఆం. ప్ర. సా. అకాడమీయే ప్రచురించినది. సికిందరాబాదు వాస్తవ్యుడు — పి. కృష్ణమూర్తిగారుగూడ 108 సుమతిశతక పద్యాలను ఆంగ్లంలో వ్రాసి 1969లో వెలువరించినారు.

ఈ ప్రచురణను — డాక్టర్ చల్లా రాధాకృష్ణశర్మగారు (కేంద్ర సాహిత్య అకాడమి మదరాసు దక్షిణ శాఖకు కార్యదర్శి) పరిశోధించి, అనేక తాళపత్ర గ్రంథములతో సరిజత్తి సంపాదకుడుగా ప్రచురించినది. శర్మగారు తమ నిశిత విమర్శక ప్రజ్ఞాపాటవమును జూపి, క్రోడీకరించి అమూల్య విషయపూర్ణమైన పీఠికతో ముద్రింపించినారు.

బ్రౌన్‌గారి సుమతిశతక ఆంగ్లానువాదమును ప్రకటించుటకు ఇదే మొదలు. దీనికిగా శర్మగారు వందనీయులు. ఇందు చాల నూతనాంశములను వెల్లడించుచున్నారు. సాధారణ సుమతిశతక ప్రథమ ముద్రణకు 1868 నాటిది. శర్మగారు పద్యాలను అకారాదిగా ఏర్పరచినారు. 85 వరకు ఒక వర్గంగా, తతిమ్మావి రెండవ వర్గంగా విభాగించినారు.

ఈ శతక కర్త — బద్దెన, లేకబద్దె భూపాలుడని, నీతిశాస్త్ర ముక్తావళి అనే రాజనీతి శాస్త్రమును గూడ వ్రాసినది యీయననే అందరూ అనుకొనేమాట. బద్దెన తెనుగుచోళ (నెల్లూరుచోళ) వంశీకుడు. మానవల్లి రామకృష్ణకవి బద్దెన, కుమార సంభవ— గంథకర్త — నన్నెచోడుని దగ్గరి చుట్టమనిగూడ అంటారు. వేదం వేంకటరాయశాస్త్రి (చిన్న) యీ వాదమునే అంగీకరిస్తూ, వీరిద్దరు ఒకరి తర్వాత ఒకరు రాజ్యానికి వచ్చినారంటారు.

ఇది ఇట్లా ఉంటే, యీ సంపాదక శర్మగారు యీ శతకాన్ని వ్రాసింది ఒక జైనకవి అనిన్ని, మిత్రుడు ఒకానొక సుమతికి అంకితం చేసినాడని నిలబలుకుతున్నారు. దీనికి కారణం:—అనేక తాళపత్ర ప్రతులలో 'శ్రీరాముని దయచేతను' అనే పద్యం, హిందూ ధర్మానుసరణంగా లేకపోవడమేనని అంటారు. కొన్ని వ్రాతప్రతులు 'స్త్రీలయెడ వాదులాడకు' అనే పద్యంతోను, మరికొన్ని 'కవిగానివాని వ్రాతయు' అనే పద్యంతోను ప్రారంభమగుచున్నవి. ఇదీగాక—నీతిశాస్త్ర ముక్తావళి భాషకు శైలికి, సుమతిశతక శైలికి చాలా భేదమున్నదంటారు — శర్మగారు. 'వినదగు నెవ్వరు చెప్పిన' అనే గదా సుమతిశతక హితవు. ఈ విషయం పరిశోధకులు ముమ్మందు తేల్చి చెప్పుదురు గాక. చిన్న సందేహం 89 వ పద్యంలో 'తల్లి సుమీ పంచాక్షరి' అన్నది జైనకవి వ్రాత కాగలదా? యోచించండి.

ఈ బ్రౌన్ ఇంగ్లీషు పాఠము 'అడియాస కొలువు గొలువకు' అనే పద్యంతో మొదలుపెట్టి 'స్థితిలేని బలిమి చెల్లదు' అనే పద్యంతో (150 వది) పూర్తి అవుచున్నది.

ఈ ముద్రణంలో ఇంకొక విశేషం:– ప్రతి పద్యానికి, ఉన్నచోట పద్యపాఠాంతరము. కొన్నిచోట్ల పదపాఠభేదాలు క్రింద క్రింద ఇచ్చి ఉన్నారు. ఇట్లా పోల్చి చూపడం, శర్మగారు శ్రమపడి చేసిన పని. కొత్తపద్యాలు చాలవరకు సొంపైనవే!

ఇక బ్రౌన్ ఇంగ్లీషు అనువాదం:— ఈ దొర భావమెరిగి, అర్థం తెలిసి ఇంగ్లీషులోనికి మార్చినారు. ఈ రచన సహజభాషాసౌందర్యంతో, పదలాలిత్యంతో ఆ భాషాసంప్రదాయిక నుడికారంతో నున్నది. ఇది బ్రౌన్ త్రవ్వి ఎత్తి ఆంధ్రులకు బహూకరించిన మరి

యొక్క పెన్నిధి. ప్రతిభాషాభిమాని నెనరుచో ఆ దొరకు కైమోడ్పు వలసినదే! శర్మగారి సేవగూడ ఎన్నదగినది.

—శ్రీ మరుపూరు కోదండరామ రెడ్డి.

పెంచిన ప్రేమ

(నవల)

(రచన: కోలాహలం లక్ష్మణరాజు. వెల: ఏడు రూపాయలు. నాగినీ పబ్లికేషన్సు, మిర్యాలగూడ, నల్లగొండజిల్లా, ఆంధ్రప్రదేశ్.)

కొన్ని రచనల్నిగురించి ఏమాటా చెప్పకుండడం మంచిదనిపిస్తుంది. 2—3 వందల పేజీలు వ్రాయ గలిగిన ఓపికా, ఏ డెనిమిదిరూపాయలతో తృప్తిపొంద గలగడమూ దప్ప వానిలో బాగుందన గలిగిన అంశం ఒక్కటికూడా వుండదు. సరిగ్గా ఇది ఆ కోవకి చెందిన నవల.

అందమైన, బలమైన సంతానం కలగడం గర్భధారణ సమయంలోనూ, గర్భవతిగా వున్నప్పుడూ స్త్రీ చూసే దృశ్యాలూ, ఆమెకు కలిగే మనోభావాలూ మీద ఆధారపడి వుంటుందనుకొనే వారు ఒకప్పుడు. గర్భాధానపు గదులలో దేవతా చిత్రాల అలంకరణ, గర్భిణీ స్త్రీలు గ్రహణాలు చూడకూడదనడం, ఆల మందలు తిరిగేచోట నంది విగ్రహాల ప్రతిష్ఠాపన మొదలైనవి ఈ మాదిరి ఆలోచనల ఫలితమే.

తరవాత శాస్త్రజ్ఞానం ఆ ఆలోచనలను నిరా కరించింది. ఆనువంశికతా, నవ్యతా పరిసరాలమీద ఆధారపడినది కావనీ, సెల్, క్రోమోజోమ్, జెనేలు వానిని నిర్ధారణ చేస్తున్నాయనీ ధృవీకరించింది.

అభిప్రాయాలు విజ్ఞానాభివృద్ధితో మారవచ్చు. కాని ఆచారాలు ఓ పట్టాన మారవు. సైన్సుటీచరు క్లాసులో గ్రహణం ఎందుకు తటస్థ పడుతూందో గ్లోబూ మొదలైన పరికరాల సాయంతో బోధిస్తాడు. తిన్నగా వెళ్లి గ్రహణ స్నానంచేసి, ఏ తేలు మంత్రమో నేర్చుకొంటాడు. ఇదే కారణం. దానిని అర్థం చేసుకోగలం. బాగా వెనకబడిన ప్రాంతాలలోని, విద్యావిహీనులైన జనం ఇంకా పూర్వపు అశాస్త్రీయ ఆలోచనల్లోనే వున్నా రంటే అర్థం చేసుకోగలం. కాని ఈ రచయిత తమ రచనకు ఈ అశాస్త్రీయ విషయాన్ని కేంద్రకం చేయడం, ఉస్మానియా హాస్పిటలులో డాక్టరుగావున్న మీరాబాయి పాత్రచేత ఆ ఆలోచనను సమర్థింప చేస్తూ, గుంటూరుజిల్లాలో జరిగిందంటూ ఒక ఘటనను చెప్పించడమూ నిజంగా తెలుగువాడి తెలి వికో సవాలు. నిజానికి తొలి పలుకులు వ్రాసేవారూ, అభిప్రాయా లిచ్చేవారూ మన ప్రతినిధులుగారి సవా లును తీసుకొనివుండాలి. మన దురదృష్టం, అది జరగలేదు.

ఈ విధంగా అశాస్త్రీయమైన పునాదిమీద చెప్పిన కథ. ప్రతి పుటలోనూ అసందర్భాలూ, అవాస్త వికతలతోనే సాగింది. పాత్రలు ఈడుకు మించిన ఆ మాటలు పలుకుతాయి. స్థాయికి మించిన ఆలోచనలు వెలువరిస్తాయి. అవసరాన్ని మించిన ప్రేమను ప్రకటిస్తాయి. వీటన్నింటికీ పరాకాష్ఠ — పోలీసు డిపార్టుమెంటులోకల్లా కడగొట్టు వుద్యో గంలో (సబినస్పెక్టరు) వుండి, రఘుమంత్రుల్ని ఆఫీసర్లని ధిక్కరించి దొంగవర్తకుల్నీ, దొంగరవాణా దార్లనీ రాష్ట్రమంతటా గడగడలాడించటం. నెగ్గుకు రావడమూ. జిల్లాకలక్టర్లకు, డి. ఎస్. పి.లకి, చివరకు మంత్రులకుకూడ ఆశ, దిగ్భ్రమ కలిగించగల ఈ మాదిరి కలను వూహించడం (కవి) నిరంకుశత్వానికి మచ్చు తునక.

భావాలలోనేగాక రచయితభాష విషయంలో కూడ ఎంతో అపరిపక్వత కనబరుస్తారు. 'లీనం కావడం', 'లీనం చేసుకోవడం' అనేపదాలు ఈయ నకు బహుప్రీతికరం అనుకోవాలి. అయితే వాని నుప యోగించిన తీరు చాల దుస్సహం. రఘు తన్ను ఆద రించిన మీరాబాయిని విడిచి పారిపోతూ వ్రాసిన వుత్తరంలో వాక్యం చాలు—ఉదాహరణకి. 'మరి కొన్నాళ్లు ఇచ్చటేవుంటే నన్ను మీలో లీనంచేసుకొనే వరకూ దిగజారుతారు' (పుట 72) అప్పటికి వాని వయస్సు పదేళ్లు.

హత్యచేసే ప్రయత్నాన్ని అడ్డుకోలేక, వ్యథితులైన ప్రజలను వర్ణిస్తారు చూడండి. 'సీతమ్మ బావురుమంది. దమయంతి నిస్తేజంగా నిలబడింది. లీల పరవశించింది. ఏవిధంగా హత్యను నిరోధించాలో తోచక తొట్రుపడ్డాను రఘు.' (పుట 235)

ఇల్లా ఎన్నని వ్రాయడం? విస్తరభీతితో ఆపుతున్నా.

నాలుగు మంచాలు

(నవల)

(రచన: బలివాడ కాంతారావు, వెల రు. 2—50 ఎమెస్కో ప్రచురణలు, రాష్ట్రపతి రోడ్, సికింద్రాబాద్.)

హాస్పిటలులో నాలుగు మంచాల వార్డు, రోగులు, వారి చరిత్రలు సంకేతంగా పెట్టుకొని మనుష్యుడు పరిపూర్ణుడు కావాలంటే శారీరక, మానసిక, వైజ్ఞానిక, ఆత్మికానందాలు పొందాలనీ అందులో ఏ ఒక్కటీ మనిషిని పూర్ణుని చేయలేదనీ రచయిత చెప్తారు దీనిలో. కోరికల్ని చంపుకోనిదే సన్యాసాశ్రమం కూడదనీ, ఆత్మజ్ఞానం కలగదంటారు.

అయితే మనుష్యుని సుఖదుఃఖాలు ప్రధానంగా సమాజ గతాలుగాని, కేవలం వ్యక్తి నిష్ఠాలుగావు. మనిషి సమాజ జీవికావడమే దీనికి కారణం. భారతీయ తత్త్వసృష్టి ఒక పరిమితిలో దీనిని అంగీకరిస్తూ వచ్చినా, క్రియారూపంలో ప్రధానంగా అది వ్యక్తికే ప్రాధాన్యం ఇచ్చింది.

ఈ రచనలో కూడ కథ నడుస్తున్న తీరు, పాత్రల జీవితగతి, పరిస్థితుల పరిణామాలు సామాజిక సమాధానాలకే దారితీస్తున్నా రచయిత దానిని గుర్తించ నిరాకరించడమూ, ఎక్కడికక్కడ సమాధానం చెప్పలేకపోవడమూ కనిపిస్తుంది. గోవిందరావు, విశాలలతోడి చర్చలతో సూర్యం (ఈ నవలలోని ప్రధాన పాత్ర) కనబరచిన దిగ్భ్రమలో దీనిని గమనిస్తాం.

గోవిందరావు (సూర్యం చెల్లెలిమగడు) ఆఫీసులలో జరుగుతున్న అన్యాయాలు, పెరిగిపోతున్న లంచగొండితనం, అవినీతి చూసి తల్లడిల్లిపోతాడు. రూపాయకి రెండణాలు వడ్డీ తీసుకోడం సహించలేడు. దొంగవర్తకం, దొంగలెక్కలు చూడలేడు. ఎవడికర్మకు వాడేపోతాడనే సిద్ధాంతం తెలివితక్కువదనం అంటాడు.

'సంఘజీవిగా బ్రతుకుతూ, ఈవిధంగా సంఘానికి ద్రోహంచేస్తున్నా'రనే స్ఫూర్తి గోవిందరావుకి వుంది.

అయితే ఈ అన్యాయాల్ని నివారించే దెల్లాగ? గోవిందరావు అభిప్రాయం ప్రకారం—'వాడు సంఘజీవిగా ప్రవర్తించేలాచేసే బాధ్యత సవ్యంగా నడిచే వారిలోవుంది' తన అభిప్రాయాన్ని అనుసరించి గోవిందరావు అన్యాయాల నెక్కడికక్కడ వ్యతిరేకించసాగేడు. ఫలితంగా కొన్ని వుద్యోగాలనుంచి వాళ్లు తరిమేశారు. కొన్నిటిని తానే తన్నేసేడు. తిండిలేదు. అత్తారింటికి చేరేడు. బావమరది సూర్యం పంచచేరేడు. బావ కార్యవిధానం సూర్యానికి నచ్చదు.

'ఎదటివాళ్లలో తమ తప్పులను ఒప్పుకొనే ధైర్యసాహసాలను కల్పించడానికి ప్రయత్నించండి.' అంటాడు సూర్యం. బావమరది ఆలోచనలు మంచివే గాని. పంథా తప్పని ఆతని అభిప్రాయం. గోవిందరావు ప్రశ్న వెయ్యకపోవడంచేత చెప్పనక్కర లేకుండా తప్పిపోయిందేగాని ధైర్యసాహసాలు కల్పించడం అంటే ఏమిటో, అదెల్లా చెయ్యాలో సూర్యానికి తెలియదని ఆతని జీవితమే నిరూపిస్తుంది.

మనవి

భారతికి తమ రచనలని పంపేవారందరూ వాటిని—

* సంపాదకుడికి

* భారతి కార్యాలయానికి మాత్రమే పంపాలని మనవి చేసుకుంటున్నాము.

వ్యక్తుల పేర్ల పంపరాదని మనవి.

—సంపాదకుడు.

సంఘంలో జరుగుతున్న ఈ దురన్యాయాన్ని మాపాలి. అంతవరకూ మానవుడికి సుఖం అబద్ధం. సరే, అదెల్లాగ ?

అయితే ఇక్కడ పరిస్థితి వైయక్తికమా ? సామాజికమా—అనేది చూడాలి. ఇది సామాజికమైన స్థితి. దీనికి వ్యక్తి స్థాయిలో తీసుకొనే ప్రతిక్రియలు ఆతనిని కజ్జాకోరునిగా, దుర్మార్గునిగా చేస్తుంది. అతడెన్ని ఆదర్శాలు వర్ణించినా జరిగేదంతే.

సామాజికమైన సమస్యలను సామాజిక రూపం లోనే ఎదుర్కోవాలి. అలాగాక వైయక్తిక రూపంలో ఎదుర్కొంటే పాలక వర్గమేకాదు మనకు ఎదురు నిలిచేది. మనం సాయం చేయదలచిన వాళ్లకూడా మన మీదనే పడతారు. మన ఆలోచనను సమాజం అందుకోవాలి. క్రియాచరణలో పని తరవాయి చేబట్టాలి.

గోవిందరావుకి ఆ ఆలోచన లేదని 'ఆ బాధ్యత సవ్యంగా నడిచేవారిలో వుంద'న్న మాటే చెప్తూంది. ఫలితం ఆతని జీవితంలోనే కనబడింది. మనిషి పేరసైటోలా తయారయ్యేడు. సిగ్గు, బిడియం చచ్చి వట్టి అహంకారీ, అహంభావీగా తయారయ్యేడు.

ఆలాగే విశాలప్రేమ విషయం. ఆమెను సూర్యమూ అమితంగా ప్రేమించేడు. ప్రేమ వ్యక్తిగతం. కాని వివాహంలో కొంత సామాజిక లక్షణం వుంది. ఆ సామాజిక లక్షణం ప్రేమకు దోహదకారి కాని ప్రతిద్వంద్వికాదు. కాని వెనుకబడిన మన సమాజంలోవున్న కొన్ని పరిస్థితులు సామూహిక క్షేమం పేరుమాటున పెళ్లికీ ప్రేమకీ పోటీ పెడుతున్నాయి.

విశాల తక్కువకులం అమ్మాయి. ఆమెను పెళ్లిచేసుకొంటే కుటుంబానికి మచ్చ. చెల్లెళ్లకు పెళ్లిళ్లు కావు.

కులం హెచ్చుతగ్గుల గణన తేల్చలేని మహారాష్ట్ర కన్య గీత విషయంలోనూ అదే అభ్యంతరం వచ్చిందే మరి !

వీనినిపట్టే ఈ సామూహికసంక్షేమం అనేది మూఢాచారాలకు కేవలం ముసుగుతప్ప వేరుకాదని అర్థం అవుతుంది.

పోనీయని సామూహిక సంక్షేమం, కుటుంబం పేరున విశాలను, గీతను వదులుకొన్న సూర్యం తండ్రి తెచ్చిన సంబంధాన్ని చేసుకోలేకపోయేడు. తనకు వచ్చే కట్నం ఆ కుటుంబక్షేమానికి అవసరమన్నా అంగీకరించలేకపోయాడు. ప్రేమించిన పడుచును పెళ్లాడడానికి ఆటంకం అయిన కుటుంబం, దాని క్షేమం ఇక్కడ పెళ్లి చేయలేక పోయినాయి. ఎందుచేత ?

ఈ బెడదనుంచి తప్పించుకొనేందుకు సూర్యం ట్రాన్స్ఫర్ చేయించుకుంటాడు. హిమాలయాలు వగైరా తిరిగేడు. సమస్యలు ఎదురైనచోటు వదిలి బొంబాయి నుంచి విశాఖ, విశాఖ నుంచి ఢిల్లీ, అక్కడినుంచి హిమాలయాలకు పారిపోతే సమాధానం దొరకదు. దొరకలేదు కూడా. పట్టుబడ్డవి పడికట్టు మాటలు కొన్ని. ఆత్మజ్ఞానం, అంటూనే లోకం హర్షించే పని చెయ్యాలంటాడు. ఎదటి వాళ్లను ప్రేమించుమంటాడు. ఆ ప్రేమ నటన అంటాడు, మళ్లీ — ఈ విధంగా వట్టి గంద్రగోళంలో పడ్డాడు.

చివరికి ఒక వ్యభిచారిణితో సంపర్కం పెట్టుకోడానికి ఆమె గుడిసెలో ప్రవేశిస్తూంటే నిజంగా ఆ క్షణంలో ఆతనికి ఆత్మజ్ఞానం కలిగిందంటారు రచయిత. ఏమిటూ ఆత్మజ్ఞానం ? శ్రీనివాసరావుకు భార్యగావుండి, వితంతువైనా విశాలనే పెళ్లి చేసుకోవాలనేది అజ్ఞానం !

విశాలతో వివాహానికి ఆటంకం ఆమె వితంతువు కావడం, కొంతకాలం ఒకరి భార్యగా వుండడమూ మాత్రమేనా? కన్యాదశలోనే ఆమెను కాదను కొన్నాడు కదా? అసలు పేచీ, కులాంతర వివాహం కావడ ఇప్పుడు కలిగిందన్న ఆత్మజ్ఞానం దాని నెల్లా పరిష్కరించింది?—'మా చెల్లెళ్ల తమ్ముళ్ల పెళ్లిళ్లవరకు యిలాగే వుందామంటాను.' — అనుకొంటాడు. ఆత్మజ్ఞానం కుల మతాలను గురించిన మూరపు కట్టుబాట్లను త్రోసిపుచ్చడానికి తోడ్పడలేదు. దానికి పట్టం కట్టడానికే తోడ్పడింది!

నవల పొడుగునా ఇదే పరిస్థితి.

సామాజిక సమస్యల్ని, సమాజప్రగతిని, అది తెచ్చిపెడుతున్న నూతన సంబంధాల్ని అర్థంచేసుకోకుండా ఆత్మ, త్యాగం, నచ్చచెప్పడం, హింస, అహింస, జ్ఞానంవంటి కొన్ని పడికట్టుమాటలకు, జీవితాన్ని ముడిపెట్టి చూసే అర్థరహిత తాత్త్విక జిజ్ఞాస మాత్రమే ఈ నవలలో చూస్తాం.

రచయిత రెండుమూడుచోట్ల 'జాతి' అనే మాటను 'కులం' అనవలసిన సందర్భంలో వాడేరు. ఈనాడు మనం జాతి, కులం సమానార్థంలో వాడుతున్న పదాలుకాదు. కనీసం సాహిత్యంలో వానిని ప్రత్యేకార్థాలలో రూఢంచేసి వాడుతున్నాం.

—''అవంతి''

తెలుగు జాతి మేల్కొనాలి

(రచన: మారెళ్ల సుబ్బారావు ప్రచురణ: చెరుకుపల్లివారివీధి, గవర్నరుపేట, విజయవాడ—2, వెల రు. 2–00.)

యుగయుగాల చీకటినుండి
తరతరాల బానిసత్వంనుండి
తెలుగుజాతి మేల్కొనాలి!

162 పుటల పుస్తకంలోవి లకార్యాన్ని పైన పేర్కొన్న గేయం క్లుప్తంగా సూచిస్తోంది. (1) తెలుగుజాతి (2) తెలుగుభాష (3) తెలుగుదేశం (4) తెలుగుజాతికి జరుగుతున్న అన్యాయాలు (5) ఆంధ్ర—తెలంగాణా (6) తెలుగుజాతి కర్తవ్యం అనే భాగాలున్నాయ్ పుస్తకంలో.

'తెలుగుజాతి అతి పురాతనమైన జాతి. యుగాలన్నింటికి పూర్వపుజాతి. ఆదికాలానికి మొదటి జాతి. ప్రపంచంలో అతి పురాతనమైన జాతులు కొన్ని ఉన్నవి. ఆ ఆదికాలంనాటి జాతులకంటే ఆదిమజాతి తెలుగుజాతి. అంటే సృష్టి ప్రారంభం తెలుగు మూర్తితోనే ప్రారంభమైనదేమో!' అంటున్నారు మొదటి పుట ప్రారంభంలోనే శ్రీ సుబ్బారావు.

సాహిత్య విలువల దృష్ట్యాకాక, ప్రచారం పోనీ ప్రబోధాన్ని దృష్టిలో పెట్టుకుని చదివితే 'అయ్యో నాజాతి ఏమయిపోతుంది? నా దేశం భవిష్యత్తు ఎట్లా ఉండబోతున్నది' అనే ఆరాటం ద్యోతకమవుతుంది ఈ పుస్తకంలో సహృదయులకు.

'తెలుగుదనం కావాలనినా, తెలుగుభాష రావాలనినా అనేకజన్మల పుణ్యముండాలి' అని అప్పయ్యదీక్షితుడు అను అరవ పండితుడు అన్నాడట. (2వ పుట) నిజమేకావచ్చు. కానీ ఈనాడు ఈ అభిప్రాయాన్ని ఎవరూ ఆమోదించరు. కారణం. ప్రాంతీయతత్వం రాజ్యం ఏలుతూండడమే.

'తెలు' అంటే పవిత్రత, తెల్లన, వెలుగు, పౌరుషము అని అర్థాలున్నవి. తెల+అగు=తెలుగు తెలయొక్క వేరొకరూపమే తెల్ల; తెల+గ=తెలగ; తెల + అంగం = తెలంగం. ఈ విధంగా అనేక మార్పులు జెందుచూ నేటికి తెలుగురూపాన్ని ధరించిన దీ పదం. (3 వ పుట) ఇటువంటి నిర్ణయాలను రూపొందించే సందర్భంలో ఇంతకు పూర్వం శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మ, చిలుకూరి నారాయణరావు ప్రభృత పండితుల అభిప్రాయాలను ఉదహరించి కొంత చర్చ చేస్తే శాస్త్రీయంగా ఉంటుంది. తెలుగు యొక్క రూపాంతరమే తెనుగు అని ఈనాడు కొత్తగా మనం చెప్పవలసిన అవసరం లేదేమో. అయితే, అనేక కారణాల వల్ల పరభాషలలో ఆలోచించి తెలుగులో వ్రాస్తున్న వారనేకమంది ఉన్న ఫలితంగా మన భాషకు యీనాటి దురవస్థ ప్రాప్తించింది. మన భాష గొప్పదని నిరూపించడంలో తప్పులేదు. కానీ ఆ నిరూపణ అనేది వస్తునిష్ఠంగా జరగాలి. ఇతర భాషలను దుయ్యబట్టవలసిన అవసరం ఏమాత్రమూ లేదు.

'ఈ తెలంగమే ఈశ్వరుడని చెప్పుట కనేక నిదర్శన లున్నవి. 'లింగం' అను పదమునుండి వచ్చిన పదమై ఉండవచ్చును. ఈ ఈశ్వరుని డమరుకము నుండి జన్మించింది తెలుగేనని చెప్పవచ్చును' 6 వ పుట. నిరూపణ లవసరం కాదా ఇటువంటి నిర్ణయాలను సార్వత్రికాభిప్రాయంగా వెలువరించే సందర్భంలో ?

'తెలుగు జాతి ఆదిపురుషుని గూర్చి తెలిసికొన్నాము. ఆ మహనీయుడు బ్రహ్మ విష్ణువులకంటే కూడ ఆదిపురుషుడు కావచ్చును' 7 వ పుట. నిజమేనేమో! కానీ నిరూపణలూ, ఉపపత్తులూ లేకుండా ఇట్లా వ్రాస్తే యీ రకం వాక్యాలలోని వాస్తవం కంటే ఆవేశం ఎక్కువగా కనిపించి రచయిత ఆశించే లక్ష్యమే దెబ్బతినే ప్రమాద ముంటుంది.

తెలుసుకోనదగిన అంశాలు

'న్యూజీలాండ్ వద్ద గల టోబ్రియాండే దీవులలో కృష్ణాసియనులు, శ్రీలంకలోని వెడ్డాలు, అండమాను దీవులలోని నిగ్రెటోలు, ఆస్ట్రేలియాలోని ఆదివాసులు తెలుగు తెగలకు జెందినవారు. వీరి భాష, ఆచార వ్యవహారాలు, పండుగలు, పబ్బాలు, దేవతలు, దెయ్యాలు అన్నీ తెలుగువారివేనని తెలియుచున్నది. ఉదాహరణకు కృష్ణాసియనుల ముఖ్య దేవత పేరు పోలేరు. మన ప్రాచీన దేవత పేరు కూడా పోలేరే.' అంటారు ఈ రచయిత 10 వ పుటలో. మరి 8వ పుటలో నేమో 'తెలుగువారి దేవుని పేరు తెలంగము' అన్నారు. తెలుగువారి అనేక దేవతలలో పోలేరమ్మ ఒకటి అనడానికీ, మన ప్రాచీన దేవత కూడా పోలేరమ్మ అనడానికీ తేడా ఉన్నదనిపించదా ?

'మనం ప్రత్యేకంగా తమిళజాతికి అంటే ద్రావిడజాతికి చెందినవారము కాము. అంటే కొన్ని చాలా దగ్గర పోలిక లుండవచ్చును.' (10వ పుట). తెలుగుభాషా శాస్త్రవేత్తలందరూ పరిశీలించి, తెలుగువారందరికీ బాగా అర్థమయ్యే పద్ధతిలో చెప్పవలసిన అంశ మిది.

అదేవిధంగా 'హరప్ప మొహంజోదారో సంస్కృతులు తెలుగు సంస్కృతులనియే చెప్పవలసి ఉంటుంది. హరప్ప, మొహంజోదారో శిథిలాలకూ తుంగభద్రనది ఒడ్డున కనుపించిన శిథిలాలకు చాలా పోలికలున్నవని శాస్త్రవేత్తలు జెప్పుచున్నారు 16 వ పుట. పోలికలుంటే ఉండవచ్చు. అంతమాత్రానే ఆ కారణాననే హరప్పమొహంజోదారో లలో అలనాటి భాష తెలుగయి ఉండవచ్చుననడం శాస్త్రీయమవుతుంది. తమిళం, తెలుగుభాషల పోలికల సందర్భంలో యీ రచయిత వెలిబుచ్చిన అభిప్రాయం యీ సందర్భంలో కూడా వర్తించదా? వర్తించని పక్షంలో ఎందుకనో అనుభవము, ప్రయోగాలూ ఫలితాల పద్ధతిలో నిరూపించడ మవసరం కాదా?

'సంగమచరిత్ర ప్రకారం దక్షిణ సముద్రాల మీదగా దక్షిణ భారతదేశం జేరిన ద్రావిడులకు అంటే అరవవారికి హరప్ప నాగరికతకు సంబంధమేమిటి ? హరప్ప లిపిలో (ఆన్ర) ఆంధ్ర అనుపదం (పేరు) ఉన్నది 22 వ పుట. ఇది చర్చనీయాంశం. ఆవేశం, దురభిమానంవంటివేమీ లేకుండా జిజ్ఞాస చెయ్యవలసిన అంశాలివి.

'మనం ద్రావిడులంగాము. ఆర్యులమని చెప్పకొనవలసిన అవసరంలేదు. సిసలైన తెలుగువారము' 13 వ పుట. సమంజసంగా ఉన్నది ఈ అభిప్రాయం. 'ఆర్య, ద్రావిడపదము లే మాత్రం మనకు వర్తించవు. తెలుగు తెలుగే' ఆలోచించండి భాషా శాస్త్రవేత్తలారా ఆలోచించండి. ఆలోచించి నిగ్గు తేల్చండి.

తెలుగుజాతి దురదృష్టం

జాతి అంటే గుంపు అని ఈ రచయిత అర్థం చెప్పారు. 'మన ననుభవించే బానిసత్వం కూడా ప్రపంచంలో ఏ జాతి అనుభవించడం లేదేమో?'

ప్రతి కష్టంలోనూ తెలుగువారు ముందుంటారు. ప్రతి లాభంలోనూ వెనకకు నెట్టివేయబడతారు. మనకు న్యాయం జరగటంలేదు! 20వ పుట. ఇది తెలుగుజాతి దురదృష్టం. ప్రతిజాతి చరిత్రలోనూ ఉత్కృష్టదశ హీనదశ, అని ఉంటయ్. అది గతి తార్కిక భవుతిక నియతి సరళిలో ఒక పీచిక, అని సంజాయిషీ చెప్పకుందాం. మనలను మనమే తక్కువగా చూచుకొనడం అలవాటయింది మనకు, చాలా కారణాలున్నాయ్. ముఖ్యమయిన కారణం మేధాశక్తి క్షీణించడం దానికి కారణం. సరయిన విద్యాబోధన లేకపోవడం. దానికి కారణం ఎవరికి వారు మనవల్ల ఏమవుతుందిలే అనే దృష్టితో మిన్నకుండడం. దాన్ని బానిసత్వమనుకొనడం మర్యాదకాదు. బ్రతుకు పోరాటంలో ఎవరి గొడవ వారిదిగా ఉంటున్న రోజులివి. అటువంటప్పుడు బాని

సత్వ మనస్తత్వం కారణంగా మనభాష, మన చరిత్రలను మనం మరచిపోవడం జరిగినదనడం శాస్త్రీయ దృష్టిని అనిపించుకొనదు. అన్యోన్యాశ్రయపద్ధతి బాని సత్వం కాదు.

'అందరికీ భారత పౌరసత్వమేగానీ అందరూ ఒక జాతిమాత్రంగాదు. కాని మనమంతా ఒక జాతిలా బ్రతకాలి! ఇదీ భారతదేశవిధానం...మనం మాత్రం మనజాతిని పాడుజేసుకుంటున్నాము.' 25 వ పుట. ఇది వాస్తవమే. కానీ ఇది ఇట్లా జరుగుతూండడానికి కారణాలు చాలా ఉన్నాయి.

పూర్వపు ఔన్నత్యాన్ని నెమరువేసుకొన్నంత మాత్రాననే ఆంధ్ర తెలంగాణా తగాదా పరిష్కారం కాదు—భారతదేశంలో ఆంధ్రులు అగ్రస్థాన మలంకరించబోరు.

'తమ మాతృమూర్తి తెలుగని తెలుసు. కానీ సంస్కృతాన్ని, సంస్కృత పెద్దలను ఆరాధిస్తారు. పైపెచ్చు సంస్కృతంనుండి తెలుగు బుట్టిందని చెప్పి తెలుగుభాషకు తెలుగుతల్లికి వ్యక్తిత్వం లేకుండ జేసి తెలుగుజాతినే అవమానిస్తున్నారు 29 వ పుట. తెలుగుభాషలో ఒక గ్రంథం వ్రాసి 'తెలుగులారా! తెలుగు ఇట్లా ఉండాలి' అని చూపించే, చూపించగల రచయిత లవసరం కాదా? అటువంటి రచయితలను తయారుచెయ్యగల విద్యావంతులుకావాలి. అందుకు ఉపయోగపడే విద్యావిధానాన్ని ప్రజలే రూపొందించుకోవాలి. అందుకు విశ్వాసమూ, ఆత్మస్థైర్యమూ అవసరం. ఉద్దీపనమవసరం. తెలుగు భాష అనే అధ్యాయంలో యీ అంశాన్ని సుబ్బారావుగారు కొంత చర్చించారు. కానీ గమనించవలసిన అంశం ఒకటి ఉన్నదని మనవి: 'శూన్యం నుంచి రూపొందలేదు ప్రస్తుత తెలుగు భాష చరిత్ర. జాతి గౌరవమే నీ గౌరవం. ఏ దేశ మేగినా ఎందు కాలిడినా...భారతీయుడనని వంటి ప్రబోధాలు గతంలో జరిగినయ్—వ్యక్తికంటే రాష్ట్రమూ, రాష్ట్రం కంటే దేశమూ, జాతి గొప్పవని ప్రబోధించారు. వ్యక్తినీ, వ్యక్తిత్వాన్నీ కించపరిచారు. అంతే కాదు 'ప్రభుత్వమనేది ప్రజలు ఏర్పాటు చేసుకునే వ్యవస్థలలో ఒకటి. ప్రభుత్వ విధానాలకూ వ్యక్తి స్వభావానికీ పొంతన కుదరడం లేదు. కుదురు కదిలింది. కొత్త కుదురు ఏర్పడలేదు.' ఫలితమే యీనాటి తెలుగు భాష స్థితి. ఇదొక పెద్ద సంక్షోభం.

'భాష ప్రయోజనం అత్యద్భుతమైనది '49వ పుట' నిజమే. భారతదేశంలో ఎక్కువమంది మాట్లాడేది తెలుగు భాష. జాతీయ భాష కాదగినది ఒక్క తెలుగే. హిందీ కాదు' 50 వ పుట. ఇట్లా వాదించి వాదించి 'తెలుగును గూడ హిందీ అని ఎందుకు పిలువరాదు. హిందీనివలె ఎందుకు అభివృద్ధి జేయరాదు' అంటారు 51 వ పుటలో యీ రచయిత. చాలా సమంజసమయిన వాదమే. కానీ ప్రాంతీయాభిమానం వైరితలలు వేస్తున్న వర్తమానకాలంలో కనీసం మేధావులయినా యీ అంశాలను తీరికగా చర్చించుతారా? చర్చించితే ఫలితమూ పర్యవసానమూ ఎట్లా వుంటయ్?

పత్రికలలో

'తెలుగు పత్రికల సంపాదకులు తమ పత్రికలు ఎల్లప్పుడూ తెలుగుజాతికి ఉపయోగకరమైన విధానంతో నడపాలి' 148 వ పుట. ఈ ప్రయత్నం 'ఆంధ్ర దిన పత్రికలో' కొంత జరుగుతున్నది. ఇంకా ఎక్కువగా జరగడానికి, వాణిజ్య సంబంధమయిన, శాసన సంబంధమయిన ప్రతిబంధకాలు చాలా ఉన్నయ్. కాదనగలమా?

'తెలుగు ఈశ్వరుని డమరుకనుండి జన్మించిందంటే ఆడమరుక ధ్వనులనుబట్టి ఆదిపురుషులు తెలుగును రూపొందించారని గమనించాలి. ప్రతి సంవత్సరం గ్రామస్థాయినుండి ప్రపంచ స్థాయివరకు తెలుగు మహాసభలను జరుపుకొంటూ ఉండాలి. ఆ సభలలో ప్రపంచంలోని అందరు తెలుగువారు పాల్గొంటూ ఉండాలి.' (149 వ పుట) అంటారు ఈ రచయిత. ఈ కృషికూడా ఇప్పుడిప్పుడే కొంతలో కొంతగా ప్రారంభమయింది.

కానీ అనుభవమూ, ఆ అనుభవంలో తెలిసిన గుణపాఠాలను అవగాహన చేసుకొనగల శక్తి అవసరం

కదా? రాబోయే కాలంలో యీ కృషిజరిగే అవకాశం లేకపోలేదు. కాని అది భాషాదురభిమానంగా రూపొంద కుండా జాగ్రత్తపడడ మవసరం. తెలుగు మేధావులు ఆలోచించవలసిన అంశాలు చాలా ఉన్నయ్ ఈ పుస్త కంలో. అట్లా ఆలోచించేందుకు అవసరమయిన తీరిక, ఓపిక, సహనమూ యేవీ యీ అధికార కీచులాటల రాజకీయాల కాలంలో?

—శ్రీ వి ఎస్. అవధాని

ఇందుమతీ పరిణయము

(తెనాలి రామభద్రకవి ప్రణీతము. ప్రబంధము పరిష్కరణ. ఉపోద్ఘాతము, డాక్టర్ దివాకర్ల వేంక టావధానిగారు, తొలిపలుకు వాఙ్మయమహోధ్యక్ష కళా ప్రపూర్ణ డాక్టర్ వడ్లమూడి గోపాలకృష్ణయ్యగారు. రాయల్ సైజు 37+124 పేజీలు. వెల 4 రూ. ప్రకాశకులు. ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఓరియంటల్ మాన్యుస్క్రిప్ట్సు లైబ్రరీ అండ్ రిసెర్చి ఇన్‌స్టి ట్యూట్, అఫ్జల్‌గంజి, హైదరాబాదు — 12. ప్రతులకు ప్రకాశకులకే వ్రాయవలెను.)

గ్రంథకర్త సుప్రసిద్ధ మహాకవి తెనాలి రామ కృష్ణుని తమ్ముడు శ్రీ గిరికవికి పౌత్రుడు. 17 వ శతాబ్దివాడు. కాళిదాస మహాకవి రచించిన రఘు వంశకావ్యంలోని 5–6–7 సర్గలు ఆధారంగా అజ మహారాజు వివాహవృత్తాంతాన్ని తెలిపే 'ఇందుమతీ పరిణయ'మనే నాలు గాశ్వాసాల ప్రబంధాన్ని రచించాడు. అది ఇంతవరకూ అముద్రితం. తంజావూరు సరస్వతీ మహల్ లైబ్రరీలోనూ, మదరాసు ఓరియంటల్ లైబ్రరీలోనూ దీనికి వ్రాతప్రతులు ఉన్నాయి. స్టేట్ ఆర్క్ట్ స్క్రిప్ట్సువారూ, నిడుదవోలు సుందరేశ్వరరావు గారు ఇచ్చిన వ్రాతప్రతులు ఆధారంగా డాక్టర్ దివా కర్ల వేంకటావధానిగారు దీన్ని పరిష్కరించి, శుద్ధ ప్రతిని తయారుచేసి యివ్వగా ఆంధ్రప్రదేశ్ గవర్న మెంటువారు తమ రిసెర్చి ఇన్‌స్టిట్యూటు పక్షాన ప్రకటించారు. బంధకవిత్వానికి సంబంధించిన వేర్వేరు రంగుల చిత్రాలతోకూడా గ్రంథం చక్కగా ముద్రించ బడింది.

దీనిరచన ప్రసిద్ధప్రబంధాల అడుగుజాడల్లోనే జరిగింది. ముఖ్యంగా రామభద్రకవి తన పెదతాతగారి పాండురంగమాహాత్మ్యాన్ని అనుసరించే దీనిని రచించా డని చెప్పవచ్చును. హయగ్రీవాదిస్తవాలు దీనికి తార్కాణం.

ఇందులో కృత్యాద్యనంతరం అయోధ్యాపుర వర్ణన, రఘువర్ణన, సంతానంకోసం అతడు యాగం చెయ్యడం, వరతంతు మహాముని శిష్యుడు కౌత్సుని రాక, రఘుమహారాజాతని కోరిక తీర్చి, దీవనపొందడం, సంతానప్రాప్తి, అజుడు అన్ని విద్యలలోను ఆరితేరి మహాశూరుడై ఇందుమతీ స్వయంవరంకోసం బయలు దేరడం, మార్గమధ్యంలో వనగజంగా ఉన్న ప్రియం వదుడనే గంధర్వునికి శాపవిముక్తి చేసి, అతనివల్ల శత్రువులను సులభంగా జయించగల సమ్మోహనాస్త్రం పొందడం, స్వయంవరంలో ఇందుమతిచే వరించబడి, తన్నెదిరించిన రాజుల నందరినీ ఓడించి, ఇందుమతీ దేవిని వివాహమాడడం ప్రధానమైన కథాంశాలు. మొత్తంమీద నాలుగాశ్వాసాలు కలిసి వచనాలతోసహా ఆరువందల అరవైకిపైగా పద్యాలు ఉన్నవి. రచన ఇతరకవుల ప్రబంధాలధోరణినే సాగింది. కవి తన ప్రావీణ్యాన్ని ప్రదర్శించడంకోసం చిత్రకవితా పద్ధతిని, బంధకవితాపద్ధతినీ గ్రహించినట్లు కానవస్తుంది. గద్యలలో 'ఇందుమతీపరిణయం బను మహాప్రబంధంబు నందు' అని తన కృతి గొప్ప ప్రబంధమని కవియే చెప్పకున్నాడు. ఇది సాధారణమైన ప్రబంధమే కాని విశిష్టరచన అని చెప్పలేము.

దీనికి 'తొలిపలుకు'ను కూర్చిన డాక్టర్ వడ్లమూడి — గోపాలకృష్ణయ్యగారు తెలుగు వాఙ్మయంలో రచితాలైన 'ఇందుమతీ పరిణయా'లను గురించీ, రామభద్ర కవి కృతిని గురించీ, ఈ ప్రబంధం లోని ఛందో విశేషాలు—బంధ కవిత్వాలను గురించీ విపులంగా తెలియజేశారు. అంతే కాకుండా వర్ణ వ్యవస్థను గురించీ, సమ్మోహనాస్త్రాన్ని గురించీ తమ ఆశయాలను సవిమర్శంగా వెల్లడించారు.

ఉపోద్ఘాతాన్ని వ్రాసిన—ఏతద్గ్రంథ పరిష్కర్తలు డాక్టర్ వేంకటావధానిగారు కృతి కర్తను గురించీ, కృతిపతి కృష్ణభూపాలుని గురించీ వివరించారు,

ప్రబంధ వైశిష్ట్యాన్ని గురించీ, రామభద్రకవి కూర్చిన కాళిదాసానుసరణలను గురించీ ఇందులో ఎన్నో విష యాలు వివరించారు.

ఇంతవరకూ అముద్రితంగా వుండి, సుప్రసిద్ధ కవి పండితులు తెనాలి వారి వంశానికి చెందిన రామ భద్ర కవి వ్రాసిన ప్రబంధం ప్రకటింపబడవలసినదే! దానిని ప్రకటించిన ఆర్కైవ్సు డిపార్టుమెంటువారికి మనం కృతజ్ఞతను చూపవలసినదే! కాని, గ్రంథం స్వరూపంలో అందంగా కనిపించినా, ప్రశస్తంగా పరిష్కరించబడినట్లు కానరాదు. పుస్తకం చివరను ఇవ్వబడిన పెద్ద తప్పొప్పుల పట్టీ 'సవరణలు—వివ రణలు' అనే దాని మొదటనే 'కావ్య పరిష్కరణలోను, ప్రూఫులు చూడడంలోను పరిష్కర్తలు శ్రద్ధ వహించ నందువల్ల దొర్లిన ముఖ్యమైన పొరపాట్లకు సవరణలు, కొన్ని విశేషాంశాలకు వివరణలు యిక్కడ ప్రకటించడం జరుగుతున్నది' అని చెప్పబడింది. 'ఆఁకొన్న, పూఁత, తేఁటి, దాఁటు, వ్రేఁక, మున్నగు పదాల్లో అర్ధాను స్వారాలు లోపించడం, కొన్ని పదాలలో శకటరేఫలు పడవలసినచోట్ల సాధురేఫలు పడడం, థ—ధ లు తారుమారు కావడం ఈ ముఖ్యమైన పొరపాట్లలో చేరనే లేదు. 124 వ అంటే చివరి పుటలో నాగ బంధానికి ఈయబడిన పద్యంలో రెండవపాదం కొంత లోపించింది. తక్కిన బంధాలకు చిత్రాలు ఉన్నా, దీనికి చిత్రం ఇయ్యబడలేదు. 'తొలిపలుకు'లో 'బంధా'లను గురించి కొంత చర్చ వున్నా దీని ప్రస్తావనయే లేదు. 'తొలిపలుకు'లో కొన్నిచోట్ల రామభద్రుడు అనేదానికి వీరభద్రుడు అని అచ్చుపడడం, సిరాతో 'వీర'ను 'రామ'గా దిద్దడం జరిగింది. ప్రూఫులను శ్రద్ధగా చూడకపోతే ఎలాటి పెద్ద పొరపాట్లు జరిగేదీ వీటి వల్ల బాగా తెలుస్తున్నది.

డాక్టర్ వేంకటావధానిగారు కొన్ని మూలశ్లోకా లనూ, రామభద్రుని పద్యాలనూ చూపుతూ సంస్కృ తాంధ్రకావ్యాలలో సన్నిహితమైన సంవాదం కాన వస్తున్నదని చెప్పారు. కాని కొన్నిచోట్ల అనువాదంలో మూలాభిప్రాయం రాలేదని చెప్పవలసి వస్తున్నది. ప్రధానమైన ఒక ఉదాహరణను గమనించవచ్చును.

ఇందుమతీ స్వయంవరవర్ణనలో ఒక చక్కని శ్లోకం రఘువంశంలో ఉన్నది. 'ఉపమా కాళిదాసస్య' అని కాళిదాసుని ఔపమ్యం సుప్రసిద్ధమైనా, ఆ శ్లోకాన్నిబట్టి అతనికి 'దీపశిఖాకాళిదాసు' అనే ప్రఖ్యాతి లభించింది. ఆ శ్లోకం—

'సంచారిణీ దీపశిఖేవ రాత్రౌ
యం యం వ్యతీయాయ పతింవరా సా,
నరేంద్రమార్గాట్ట ఇవ ప్రపేదే
వివర్ణభావం స స భూమిపాలః.'

అనేది. దీని అనువాదం ఈ క్రింది కందపద్యం.

'రేలు చలియించు దీపిక
పోలిక నలసతి ధరాధిపులఁ గడవఁగఁ ద
త్పాలక వర్గము క్షేమము
హేలన్ వైవర్ణ్యమున్ వహించెం జాలన్.'

(పుట 90)

'రాత్రి రాజమార్గంలోని సౌధాలను — ఒకదాని తర్వాత ఒకదానిని నడదీపం — అంటే నడుస్తున్న దీపం దాటిపోతూ ఉన్నప్పుడు — దాటిపోయిన సౌధం వివర్ణభావాన్ని— అంటే చీకటిని పొందుతుంది. ఆ రీతిగానే స్వయంవర మంటపంలో పతిని వరింపగోరిన ఇందుమతీ దేవి ఏ రాజును దాటిపోతుందో, ఆ రాజు వైవర్ణ్యాన్ని పొందుతూ ఉండెను—' అని మూలాభి ప్రాయం. తనవద్దకు రాకముందు — తన్ను ఆమె వరిస్తుందని గంపెడు ఆశతో ఉన్న రాజకుమారుడు— ఆమె తన్ను వరించక మరొకరిదగ్గరకు పోతూ వున్నప్పుడు అతని ముఖం మాడిపోయిందని గ్రహించ వలసి ఉన్నది.'

ఈ అర్థం తెలుగుపద్యంలో రాలేదు. 'సంచా రిణీ దీపశిఖా' అంటే కరదీపిక—నడదీపం. చలియించు దీపిక కాదు. 'తత్పాలకవర్గము క్షేమముహేలన్' అంటే అర్థం ఏమిటో? ఇక్కడ అర్థం కుదరక పోవడాన్ని గ్రహించి పరిష్కర్తలు 'ఉపోద్ఘాతం'లో 'ఇందలి మూఁడవ పాదమును గొంత సవరింపవలసి యున్నది. 'తత్పాలకవర్గం బట్టముహేలన్' అని

మార్చినచో మూలభావము కొంతవఱకైన వ్యక్తము కాఁజాలును. మూలమున నే యే రాజు నామె యతిక్రమించెనో, యా యా రాజుల వైవర్ణ్యమును (యా యా రాజులను వైవర్ణ్యము— అని ఉండవలెను) భజించెనని కలదు. తెలుఁగున — ధరాధిపుల గఁడవఁగ అని రాజుల నందఱిని సూచించు బహువచన ముపయోగింపఁబడినది. అజుఁడు తప్ప మిగిలిన రాజులని యర్థము చేసికొనవలెను.' అని సవరణను సూచించి యున్నారు! అంతే కాకుండా 'తత్పాలక వర్గము' లోని 'వర్గ' పదప్రయోగాన్ని సమర్థించారు. కాని, ఇలా సవరించినా సరిపోదు. మూలంలో 'నరేంద్ర మార్గాట్ట' అంటే రాజమార్గంలోని సౌధం, పద్యంలో 'అట్టము' ఉన్నా — రాజమార్గంలోని అట్టమనే అర్థం దానివల్ల రాదు. ఇలా మారిస్తే కొంతవరకైనా అర్థమవుతుందని వారి అభిప్రాయం.

కొంచెం ఆలోచించి వుంటే ఇంకా కొంత సంస్కరణ జరపడానికి అవకాశం ఉన్నది. తొలి పాదంలో 'చలియించు దీపిక'ను 'చరియించు దీపిక' అని మార్చవచ్చు. చలించే దీపిక కరదీపిక కాదు. చరించేదే అవుతుంది.

ఈ పద్యంలో 'తత్పాలక వర్గము క్షేమము' అనేదానికి, 'తత్పాలక మార్గక్షౌమము' అనే పాఠాంతరం ఉన్నట్లు అధస్సూచికలో చూపబడి ఉన్నది. అదే మేలైన పాఠం. క్షౌమమంటే సౌధం పైనుండే గది. పాలకమార్గ క్షౌమమంటే రాజమార్గంలోని సౌధమని సులభంగా తెలుస్తుంది. ఫుట్‌నోట్‌లోని పాఠాన్ని మూలానికి ఎక్కించి, ముద్రిత పాఠాన్ని కిందికి దించడం పరిష్కర్తలు చేయవలసిన పని. అది జరగలేదు. ఇట్టి పట్టుల ఎంతో శ్రద్ధ వహించడం అవసరం.

ప్రస్తుత పరిస్థితుల్లో తక్కినవాటి మాదిరిగానే గ్రంథముద్రణంలోనూ, ప్రకటనలోనూ ప్రభుత్వ సంస్థలకు ఉండే సౌకర్యాలు ఇతరసంస్థలకు లేవు. అందువల్ల ప్రజాధనం విలువను గ్రహించవలసిన ప్రభుత్వ క్రమమైన పద్ధతిలో విధి నిర్వహణ జరిగేటట్లు చూడాలి. అలా జరిగితే యీ గ్రంథం ఇంతకంటే మేలైనదిగా తయారయి ఉండేది.

— "ఆంగీరస"

Printed and Published For Nageswara Rao Estates (Private) Ltd., by S. Nageswara Rao at the Andhra Patrika Press, 6 & 7 Thambu chetty Street, Madras-600001 Editor : S. Radhakrishna.